శనివారం 30-12-2023



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50


సంపుటి: 16
సంచిక: 279

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


1st Anniversary Celebrations
లక్కీ ఫస్ట్ ..
లక్కీ బెస్ట్ ..
లక్కీ ఆఫర్స్ ..
సంక్రాంతి వరకు
contact@eyecatch.co.in
IT'S YOUR FESTIVAL DAYS
JACK & JONES
LINEN CLUB PASSIONATE LIKE YOU
ROOKIES
ARROW USA·1851
parx
MUFTI
Buy 2 GET 2 FREE
INDIAN TERRAIN
RARE RABBIT
BLACKBERRYS
Buy 3 GET 40%
KILLER
spykar
Buy 3 GET 50% off
U.S. POLO ASSN. SINCE 1890
Buy 3 GET 2 FREE
WALKER Jeans & Casuals
TWILLS
COOL COLORS
BLUE JERSEY
Buy 2 @ ₹1599/-
USC T-shirts
Buy 4 @ ₹1099/-
OXEMBERG
LIVE IN JEANS
Buy 2 @ ₹1699/-
WERT
Flat 50%
THE DENIM UNIVERSITY
Buy 2 GET 30%
1+1 & Combo Offers (బాయ్స్ & గర్ల్స్)
a Big Style ZONE FOR YOUR LITTLE ONES
Wonderful women's wardrobe
5 చున్నీస్ 199/-
3 కుర్తీస్ 799/-
3 ట్రాక్స్ 249/-
2 పటియాల సెట్ 899/-
4 బోటమ్స్ 499/-
2 కుర్తీసెట్ (or) టాప్స్ 999/-
6 కుర్తీస్ 499/-
2 (or) 3 డ్రస్ మెటీరియల్స్ 999/-
3 కుర్తీస్ 499/-
2 రెడీమేడ్ డ్రస్ 1599/-
5 లెగ్గింగ్స్ 499/-
30 % Off అలియా కట్ & షరారా
WOMEN
MEN
KIDS
LUCKY® shopping mall
VIZAG ANAKAPALLE
VIJAYAWADA
PALASA PEDDAPURAM
MARKAPURAM
హోటల్ DV మేనర్ పక్కన, MG రోడ్, విజయవాడ

సత్యమేవ జయతే

సాక్షి


'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 279

శనివారం 30-12-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



వెల్‌కమ్ 2024

మంచి ప్రారంభం సంతోషాలకు తొలిమెట్టు - 13లో



సరికొత్త శిఖరాలకు..

2023లో భారత్‌కు క్రీడల్లో చిరస్మరణీయ విజయాలు - 15లో



అసోంలో శాంతి పవనాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో శాంతి ఒప్పందంపై వేర్పాటువాద సంస్థ యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అసోం సంతకం చేసింది.

వివరాలు 6లో ▸



కథ అడ్డం తిరిగింది

తేజస్వీ యాదవ్‌ను బిహార్ సీఎం చేసేందుకు ప్రయత్నించిన జేడీ(యూ) అధ్యక్షుడు లాలన్ ఎత్తులను ఆ రాష్ట్ర సీఎం నితీశ్ చిత్తు చేశారు.

వివరాలు 6లో ▸



ప్రపంచంలోకెల్లా సంపన్నురాలు

లో రియల్ వ్యాపార సామ్రాజ్య వారసురాలు ఫ్రాంకోయిస్ మేయర్స్ ప్రపంచంలో అత్యంత సంపన్న మహిళగా చరిత్ర సృష్టించారు.

వివరాలు 6లో ▸



ట్రంప్‌కు మరో షాక్

మెన్ రాష్ట్రంలో ప్రైమరీ ఎన్నికల్లో పోటీ చేయకుండా బ్యాలెట్ నుంచి ట్రంప్ పేరును తొలగిస్తున్నట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.

వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్‌చెక్

ఏమిటీ తప్పుడు రాతలు ?

- గతంలో సిమెంటు స్తంభాలకు ప్రతిపాదనలు.. ఇప్పుడు ఎం+ స్తంభాల ఏర్పాటుకు నిర్ణయం
- అప్పట్లో విడివిడిగా లేబర్ ఖర్చు, మెటీరియల్ చార్జీలు.. ఇప్పుడు మొత్తం ఒకే రేటు
- ఆక్వాకు కోతల్లేని విద్యుత్ సరఫరా చేసే ప్రయత్నం తప్పా రామోజీ? 12లో
- తప్పుడు రాతలతో ప్రజలకు జరిగే మంచిని అడ్డుకుంటారా?

ఆ పోస్టుల భర్తీ కనిపించలేదా రామోజీ ?

- రాష్ట్రంలో అందుబాటులో 1,527 పశువైద్య సహాయ శస్త్ర చికిత్సకులు
- ఏపీలో ప్రతీ 17,808 పశువులకు ఒక గ్రాడ్యుయేట్ వైద్యుడు
- మరో 264 పశువైద్యసహాయ శస్త్ర చికిత్సకుల భర్తీకి చర్యలు
- ఆర్బీకేల్లో 4,652 మంది సిబ్బంది సేవలు 11లో
- మరో 1,896 మంది పశుసంవర్థక సహాయకుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్


పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరిగిన జగనన్న విద్యా దీవెన నిధుల జమ కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, భారీ జనసందోహంలో ఓ భాగం

సరికొత్త దారిలో సర్కారీ చదువులు

రాష్ట్ర విద్యా వ్యవస్థలో సమూల మార్పులు

ఖర్చుకు వెరవక పేద విద్యార్థులకు మెరుగైన చదువు

విద్యా దీవెన నిధుల విడుదల కార్యక్రమంలో సీఎం జగన్

- పేద కుటుంబాల నుంచి ఇంజనీర్లు, డాక్టర్లు, కలెక్టర్లు రావాలి
- మన పిల్లలు ప్రపంచ మేటి యూనివర్సిటీలతో పోటీ పడాలి
- ఉన్నత విద్యలో సంస్కరణలు తెచ్చి కరిక్యులంలో మార్పులు చేశాం
- నాడు-నేడుతో బడులు బాగుపడిన తీరు గమనించండి
- ఇలాంటి మార్పులు గతంలో ఎందుకు జరగలేదో ఆలోచించండి
- 8,09,039 మందికి మేలు జరిగేలా భీమవరంలో రూ.583 కోట్లు జమ
- నాలుగున్నరేళ్లలో విద్యా దీవెన, వసతి దీవెన ద్వారా రూ.18,576 కోట్లు
- 55 నెలల్లో విద్యా రంగ సంస్కరణల కోసం రూ.73 వేల కోట్ల వ్యయం

2లో



"ప్రపంచంలోని టాప్ 50 యూనివర్సిటీల్లోని 21 ఫ్యాకల్టీస్‌లో 350 కాలేజీల్లో ఫీజులు రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉన్నాయి. అయితే ఈ వర్సిటీల్లో చదివించేందుకు ఏ ఒక్కరూ అప్పుల పాలు కాకూడదనే జగనన్న విదేశీ విద్యా దీవెన తీసుకొచ్చాం. సీటు తెచ్చుకోండి.. రూ.1.25 కోట్లు మీ జగన్ మామే భరిస్తాడని చెప్పాం. జగనన్న విదేశీ విద్యా దీవెన వల్ల 400 మంది పిల్లలు ప్రపంచ ప్రఖ్యాత యూనివర్సిటీల్లో చదువుతున్నారు. బెస్ట్ యూనివర్సిటీ నుంచి బయటకు రాగలిగితే వారి బతుకులతో పాటు రాష్ట్ర రూపురేఖలు మార్చే లీడర్ షిప్ కూడా రాబోయే రోజుల్లో వస్తుంది. పెద్ద పెద్ద సంస్థలు మన పిల్లల్ని చేయిపట్టుకుని మరీ పైకి తీసుకుని పోయే అవకాశాలు ఇస్తాయి.

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్

మోసాలు, కుట్రలు, కుతంత్రాలు

- ఇవే దుష్ట చతుష్టయం, వారి దత్తపుత్రుడి మేనిఫెస్టో
- భీమవరం సభలో నిప్పులు చెరిగిన సీఎం వైఎస్ జగన్
- చంద్రబాబు పాలన మొత్తం అవినీతి, అభూతకల్పన
- దోచుకున్న సంపద దుష్ట చతుష్టయానికి బిస్కెట్లుగా పంపకం
- పక్క రాష్ట్రంలో నివాసం ఉంటూ పక్కవాడు సీఎం కావాలని పార్టీ పెట్టిన ఘనుడు దత్తపుత్రుడు
- సీటు ఇచ్చినా ఇవ్వకపోయినా చిత్తం బాబూ అనే త్యాగరాజు ఈ ప్యాకేజీ స్టార్

2లో

వలంటీర్లకు ప్రతినెలా అదనంగా రూ.750

ఇంటింటికీ రేషన్ పంపిణీ పర్యవేక్షణకు ప్రోత్సాహకం

- గ్రామ, వార్డు సచివాలయాల శాఖకు పౌరసరఫరాల శాఖ లేఖ
- రాష్ట్రవ్యాప్తంగా అధికారులందరికీ ఆదేశాలు
- ఎప్పటి నుంచి ప్రోత్సాహకం వర్తింపజేయనున్నారో త్వరలో వెల్లడి
- ఇప్పటికే వలంటీర్లకు ప్రతి నెలా రూ.5,000 చొప్పున గౌరవ వేతనం



సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు వలంటీర్లకు ప్రతి నెలా గౌరవ వేతనంగా చెల్లిస్తున్న రూ.5,000కు అదనంగా మరో రూ.750ను ప్రోత్సాహకంగా చెల్లించనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఇంటింటికీ రేషన్ పంపిణీ కార్యక్రమంలో వలంటీర్లు క్రియాశీలకంగా పాల్గొంటున్నందుకు ఈ ప్రోత్సాహకాన్ని అందజేయనున్నట్టు తెలిపింది. ప్రతి నెలా రూ.750 మొత్తాన్ని పౌరసరఫరాల శాఖ ద్వారా వేరేగా వలంటీర్లకు అందిస్తామని వెల్లడించింది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్ కుమార్ కొద్ది రోజుల క్రితం గ్రామ, వార్డు సచివాలయాల శాఖకు లేఖ రాశారు. ఈ నేపథ్యంలో గ్రామ, వార్డు సచివాలయాల శాఖ కమిషనర్ టీఎస్ చేతన్ శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లతోపాటు జాయింట్ కలెక్టర్లు, జిల్లాల గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఇన్‌చార్జిలు, మున్సిపల్ కమిషనర్లు, డీఎల్‌డీవోలు, ఎంపీడీవోలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 13న సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు

మిగతా 11వ పేజీలో ▶


కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

ఏపీలో ఆరోగ్య సేవలు భేష్

- కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ
- విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో క్రిటికల్ బ్లాక్‌కు శంకుస్థాపన
- పొన్నూరు మండలంలో హెల్త్ క్లినిక్‌లు పరిశీలన

3లో

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- ఆరోగ్యశ్రీ చికిత్సల తర్వాత అందించే ఫాలోఅప్ వైద్య సేవలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- ఫాలోఅప్ కన్సల్టేషన్ సేవలు పొందేలా రోగులకు చేయూత
- ఆస్పత్రికి వెళ్లి రావడం కోసమయ్యే ప్రయాణ ఖర్చుల కోసం రూ.300 చొప్పున అందజేత
- ఫాలోఅప్ కన్సల్టేషన్ అవసరమైన 138 ప్రొసీజర్లకు అమలు
- సంపూర్ణ ఆరోగ్యవంతుల్ని చేయడమే ధ్యేయంగా సీఎం జగన్ నిర్ణయం

3లో

ఇంతంతెలుసా?


'ఓటుకు కోట్లు' కేసులు, స్కాంలు అలానే నిలిచిపోయాయి.. ష్!


భీమవరంలో సీఎం జగన్‌కు పూలతో స్వాగతం పలుకుతున్న ప్రజలు


సీఎం జగన్‌ను చూసిన ఆనందంలో యువతులు, మహిళలు


థ్యాంక్యూ జగనన్న అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న డ్రైవర్లు

సరికొత్త దారిలో సర్కారీ చదువులు

రాష్ట్ర విద్యా వ్యవస్థలో సమూల మార్పులు ■ విద్యా దీవెన నిధుల విడుదల కార్యక్రమంలో సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, ఏలూరు: 'రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చాం. దేశ భవిష్యత్‌ను, తల రాతను మార్చే శక్తి ఒక్క చదువుకు మాత్రమే ఉంది. దీనిని నేను గట్టిగా నమ్మాను. విద్యా విధానంలో ప్రభుత్వ పాఠశాలల నుంచి ఉన్నత విద్య దాకా 55 నెలల పరిపాలనలో విప్లవాత్మక అడుగులు వేశాం. ఏకంగా రూ.73 వేల కోట్లు విద్యా రంగానికే ఖర్చు చేశానని గర్వంగా చెబుతున్నా' అని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇలాంటి గొప్ప మార్పులు ఒక్క విద్యా రంగంలోనే కాకుండా వైద్య, వ్యవసాయ రంగాల్లో, మహిళా సాధికారత విషయంలో, సామాజిక న్యాయం, పరిపాలన సంస్కరణల విషయంలోనూ తీసుకొచ్చామని చెప్పారు. ఇలా ప్రతి రంగంలో మార్పులు చేస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లా కేంద్రమైన భీమవరంలో జగనన్న విద్యా దీవెన పథకానికి సంబంధించి జూలై – సెప్టెంబర్ త్రైమాసికం నిధులను కంప్యూటర్‌లో బటన్ నొక్కి విడుదల చేశారు. 8,09,039 మంది పిల్లలకు మంచి చేసేలా రూ.7,47,920 మంది తల్లుల ఖాతాల్లో రూ.583 కోట్లు జమ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. నాలుగున్నరేళ్లలో ఈ ఒక్క పథకం ద్వారా 27.61 లక్షల మంది పిల్లల పూర్తి ఫీజులు రూ.11,900 కోట్లు చెల్లిస్తూ తల్లిదండ్రులపై భారం పడకుండా ఒక మేనమామలా ఆదుకున్నానని చెప్పారు. పిల్లలపై బోర్డింగ్, లాడ్జింగ్ ఖర్చుల భారం పడకూడదని వసతి దీవెన ద్వారా అండగా ఉంటూ రూ.4,275 కోట్లు ఇచ్చామన్నారు. పెద్ద చదువులు చదువుతున్న ఈ పిల్లలు మరింత ఉన్నత చదువులు చదవాలనే తాపత్రయంతో విద్యా దీవెన, వసతి దీవెన ద్వారా మొత్తంగా రూ.16,175 కోట్లు ఖర్చు చేశామని స్పష్టం చేశారు. 'ప్రతి కుటుంబంలో ప్రతి ఒక్కరూ గొప్ప చదువులు, డిగ్రీలతో బయటకు రావాలి. ఇంజనీర్లు, కలెక్టర్లు, డాక్టర్లు కావాలి. అలా ఆ కుటుంబాల తలరాతలు మారాలనే తపనతో అడుగులు వేస్తున్నాం. 2017–18కి సంబంధించి అప్పటి ప్రభుత్వం ఎగ్గొట్టిన ఫీజులు రూ.1,777 కోట్లను మనందరి ప్రభుత్వమే చెల్లించిందని తెలిపారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..


కంప్యూటర్ బటన్ నొక్కి జగనన్న విద్యా దీవెన నిధులను విడుదల చేస్తున్న సీఎం వైఎస్ జగన్

ఉన్నత విద్యలో సంస్కరణలు

- నాడు–నేడుతో బడుల రూపురేఖలను మార్చుతూ ఉన్నత విద్యపై ధ్యాస పెట్టి సంస్కరణలు తీసుకువచ్చి కరిక్యులంలో మార్పులు చేశాం. పిల్లలు ఏం చదువుతున్నారు.. అని ఒక ముఖ్యమంత్రి ధ్యాస పెట్టిన పరిస్థితి మీ జగన్ మామ పాలనలోనే జరిగింది. తొలిసారి డిగ్రీలో కూడా ఆన్‌లైన్ వర్టికల్స్‌ను తీసుకొచ్చాం. ఏకంగా 10 నెలల ఇంటర్న్‌షిప్‌తో జాబ్ ఓరియంటెడ్ దిశగా వేగంగా అడుగులు ముందుకు వేశాం.
- మన పిల్లలు ప్రపంచంలోని మేటి యూనివర్సిటీలతో పోటీ పడేలా మన రాష్ట్రంలో చదువులుండాలనే తపనతో అంతర్జాతీయంగా ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలు, ఎంఐటీ, హార్వర్డ్, ఎల్‌బీఎస్, ఎల్‌ఎస్‌సీ లాంటి ప్రఖ్యాత యూనివర్సిటీల నుంచి సర్టిఫికెట్లు వచ్చేందుకు హైడెక్స్ అనే సంస్థతో టై అప్ అయ్యాం. తద్వారా ఆన్‌లైన్‌లో ఆ కోర్సులు తీసుకొంటూ ఏఐని అనుసంధానం చేస్తూ డిగ్రీలో భాగం చేస్తూ ఈ ఫిబ్రవరి నుంచి ఈ దిశగా అడుగులు వేస్తున్నాం.
- పేద విద్యార్థులు మన పిల్లలు.. ప్రపంచంతో పాటు విద్యాభ్యాసం చేయగలిగితేనే వేగంగా ఎదగగలుగుతారు. ప్రఖ్యాత యూనివర్సిటీకి సంబంధించిన సబ్జెక్ట్ సర్టిఫికెట్ మన డిగ్రీలో భాగమైనప్పుడు ఇక్కడే కాదు ప్రపంచంలో ఎక్కడైనా ముందు వరుసలో ఉంటాం. పిలిచి ఉద్యోగాలు ఇచ్చే పరిస్థితి ఉంటుంది.

> ప్రభుత్వ బడుల్లో చదువుతున్న పిల్లలకు ఒక పేజీ ఇంగ్లిష్, ఒక పేజీ తెలుగుతో బై లింగ్వల్ టెక్స్ట్ బుక్స్ ద్వారా మెరుగైన చదువు చెప్పిస్తున్నాం. శ్రీమంతుల పిల్లలకే అందుబాటులో ఉండే.. రూ.15 వేలు ఆన్‌లైన్‌లో చెల్లిస్తే తప్ప రాని బైజూస్ కంటెంట్‌ను మన ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు ఉచితంగా అందిస్తున్నాం. 6వ తరగతి.. ఆపై తరగతి గదుల్లో ప్రతి క్లాస్ రూంలో ఇంటరాక్టివ్ ప్లాట్‌ఫాంలు ఏర్పాటు చేసి డిజిటల్ క్లాస్ రూంలుగా మార్చి డిజిటల్ బోధనను తీసుకువచ్చాం. 8వ తరగతికి వచ్చేసరికి పిల్లలకు ట్యాబ్‌లు ఇస్తున్నాం. తెలుగు మీడియం నుంచి ఇంగ్లిష్ మీడియంకు సీబీఎస్ఈతో మొదలై ఐబీ వరకు వెళుతున్న ఈ ప్రయాణం పిల్లలందరినీ గొప్ప వారిగా తీర్చిదిద్దే వరకు సాగుతుంది. 3వ తరగతి నుంచి టోఫెల్ సబ్జెక్ట్‌ను తీసుకువచ్చి క్లాస్ టీచర్ లేని పరిస్థితి నుంచి ఏకంగా స్కూళ్లలో సబ్జెక్ట్ టీచర్లను ఏర్పాటు చేయడం వరకు.. పిల్లల బంగారు భవిష్యత్ కోసం వాళ్ల జగన్ మామ ఎంతో తాపత్రయపడుతూ అడుగులు ముందుకు వేస్తున్నారు.
>
> – ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి


పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జరిగిన సభలో యువతుల కేరింతలు


సీఎం జగన్‌ను చూసిన ఆనందంలో విద్యార్థులు

మార్పును గమనించండి

- దేశ భవిష్యత్‌ను మార్చగలిగేది చదువు మాత్రమే. గత ప్రభుత్వ హయాంలో రూ.12 వేల కోట్లు కూడా సరిగ్గా ఖర్చు చేయలేని పరిస్థితి. ఈ రోజు మనందరి ప్రభుత్వం రూ.18,576 కోట్లు ఖర్చు చేసిన పరిస్థితి. తేడాను మీరే గమనించాలి. చదువు అనేది తలరాతను మార్చే ఒక ఆస్తి. మనిషి తలరాతను మార్చాలన్నా, ఒక కుటుంబం పేదరికం నుంచి బయటకు రావాలన్నా, వెనుకబడిన కులాల తలరాతను మార్చాలన్నా, దేశ భవిష్యత్‌ను మార్చాలన్నా.. ఆ శక్తి కేవలం చదువుకే ఉంది. అందుకే 55 నెలల ప్రయాణంలో విద్యా రంగంలో విప్లవాత్మక అడుగులు వేశాం.
- నాడు–నేడుతో బడులు బాగుపడిన తీరు తెన్నులు గమనించాలి. ప్రభుత్వ స్కూళ్లల్లో పిల్లలకు మంచి భోజనం పెట్టాలని తపన, తాపత్రయంతో అడుగులు వేస్తూ జగనన్న గోరుముద్ద మీద ఫోకస్ పెట్టాం. పిల్లలు బాగా చదవాలని, వారిని బడులకు పంపేలా తల్లులను ప్రోత్సహిస్తూ అమ్మఒడి కార్యక్రమం అమలు చేస్తున్నాం. పిల్లలు ప్రపంచంతో పోటీ పడాలని ప్రభుత్వ బడులను తెలుగు మీడియం నుంచి ఇంగ్లిష్ మీడియంకు తీసుకువచ్చి రూపురేఖలు మార్చుతున్నాం.
- ఒక్క విద్యా రంగంలోనే రూ.73 వేల కోట్లు ఖర్చు చేశాం. కేవలం 55 నెలల కాలంలోనే ఇన్ని మార్పులు జగన్ చేయగలిగినపుడు గత పాలకులు 14 ఏళ్లు అధికారంలో ఉండి ఎందుకు చేయలేకపోయారో మీరే ఆలోచన చేయాలి. ఒకసారి చంద్రబాబు నాయుడు పరిపాలన గుర్తు తెచ్చుకోండి.


సభా ప్రాంగణం నిండిపోవడంతో బయటే భారీ సంఖ్యలో ఉన్న ప్రజలు, విద్యార్థులు

అన్నా.. క్యాంపస్ ఇంటర్వ్యూలో సెలెక్టయ్యా



నేను పేద కుటుంబంలో పుట్టాను. చిన్నప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చదివాను. నేను ఇంజనీరింగ్ చదవాలనే కోరికతో చిన్నప్పటి నుంచి కలగనేదాన్ని. జగనన్న విద్యా దీవెన ద్వారా ఒక్క రూపాయి ఫీజు కూడా కట్టకుండా చదువుకుంటున్నాను. మొత్తం ఫీజు మీరే (సీఎం) కట్టారు. వసతి దీవెన ఎంతో ఉపయోగపడింది. మీ వల్ల అందరం బాగా చదువుకోగలుగుతున్నాం. మీ వల్ల నేను మంచి ప్యాకేజీతో క్యాంపస్ ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయ్యాను. ఆ క్రెడిట్ అంతా మీదే సార్.

– ప్రిన్స్ ఏంజిల్, బీటెక్ ఫైనలియర్ విద్యార్థిని, నరసాపురం

మీరు గొప్ప విజ్ఞతతో ముందుకెళ్తున్నారన్నా



నేను జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా బీటెక్ చదువుతున్నా. నెల్సన్ మండేలా చెప్పినట్టు విద్య అనే ఒక ఆయుధం మాత్రమే మన భవిష్యత్‌ను మారుస్తుంది అన్న మాటను మీరు నిజం చేశారు. మీరు విద్యా రంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. వరల్డ్ క్లాస్ వర్సిటీల్లో మాదిరి సిలబస్ తీసుకొచ్చారు. మహిళా సాధికారత, విద్య.. ఈ రెండు జీవితాల్లో మార్పులు తీసుకొస్తాయి. మీరు ఈ రెండింటినీ సాధించారు. మీరు గొప్ప విజ్ఞతతో ముందుకెళ్తున్నారు. థ్యాంక్యూ సార్.

– నవ్యశ్రీ, బీటెక్ విద్యార్థిని, భీమవరం

మోసాలు, కుట్రలు, కుతంత్రాలు

ఇవే దుష్ట చతుష్టయం, వారి దత్తపుత్రుడి మేనిఫెస్టో ■ భీమవరం సభలో నిప్పులు చెరిగిన సీఎం జగన్ ■ చంద్రబాబు పాలన మొత్తం అవినీతి, అభూతకల్పన

సాక్షి ప్రతినిధి, ఏలూరు: పద్నాలుగేళ్లపాటు మూడుసార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు నాయుడు తన అధికారాన్ని ప్రజలకు మంచి చేయడం కోసం కాకుండా అవినీతి కోసమే ఉపయోగించి, ఆ అవినీతి సొమ్మును తన వాటాదారులైన దుష్ట చతుష్టయానికి బిస్కెట్లుగా వేశారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. చంద్రబాబు హయాం అంతా మనసు లేని పాలన సాగిందని, వాళ్లకు విలువలు లేవు.. విశ్వసనీయత అంతకన్నా లేదని మండిపడ్డారు. మోసాలు, కుట్రలు, కుతంత్రాలే వారి మేనిఫెస్టో అన్నారు. జన్మభూమి కమిటీలు మొదలు.. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ–5.. చంద్రబాబుకు తోడవ్వగా, వీళ్లందరికీ ఒక దత్త పుత్రుడు తోడయ్యాడన్నారు. వీరందరూ కలిసి ప్రజలు గుర్తు పెట్టుకునేలా పాలన చేసిన చరిత్ర లేకపోగా.. దోచుకోవడం, దోచుకున్నది పంచుకోవడం మాత్రమే చేశారని నిప్పులు చెరిగారు. విద్య, వైద్యం, వ్యవసాయం.. ఇలా అన్ని రంగాల్లో మనందరి ప్రభుత్వం మేలు చేసిన విధంగా.. గత ప్రభుత్వం ఎందుకు చేయలేకపోయిందని నిలదీశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో శుక్రవారం విద్యా దీవెన నిధుల విడుదల సభలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు దృష్టిలో అధికారం అంటే వాళ్లు బాగు పడటమేనని, అధికారం కోసం ప్రజలకు అబద్ధాలు చెబుతూ మోసాలు చేస్తూ వెన్నుపోట్లు చేసే వీరి రాజకీయం ఎలా ఉంటుందో చెబుతానన్నారు. 'దుష్ట చతుష్టయానికి చెందిన ముఠా సభ్యుడిని ఇదే భీమవరంలో ప్రజలు తిరస్కరించారు. ఆ దత్త పుత్రుడితోనే మొదలు పెడతా. అతనేమో పక్క రాష్ట్రంలో ఉంటాడు. నాన్ లోకల్. పక్క రాష్ట్రంలోనే ఈయన శాశ్వత నివాసం. మన రాష్ట్రంలో అడ్రస్ ఉండదు. పక్క రాష్ట్రంలో శాశ్వత నివాసం ఉంటూ పక్క పార్టీ వాడు సీఎం కావాలని పార్టీ పెట్టిన వ్యక్తి దేశ చరిత్రలో ఈయన తప్ప ఎవరూ ఉండరు. ఈ మనిషి చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే చాలు.. అదే నాకు వందల కోట్లు అని, బాబు కోసమే నా జీవితమని, అందుకు అంగీకరించని వారు తన పార్టీలో కూడా ఉండకూడదని, వేరే అభిప్రాయం ఉన్న వాళ్లు తన పార్టీ నుంచి వెళ్లిపోవచ్చని సభల్లో ఉపన్యాసాల్లో చెప్పడం బహుశా ఈయన్ని తప్ప ఎవరినీ చూసి ఉండం' అని ఎద్దేవా చేశారు. ఈ సభలో సీఎం ఇంకా ఏమన్నారంటే..

> రకరకాల వ్యక్తుల రంగ ప్రవేశాలు, కుట్రలు, కుతంత్రాలతో తోడేళ్లంతా ఏకమై మీ బిడ్డపై యుద్ధం చేస్తున్నారు. ఈ రోజు చంద్రబాబుకు కానీ, దత్తపుత్రుడికి కానీ ఒంటరిగా పోటీ చేసే సత్తా లేదు. కారణం ప్రజలకు మంచి చేసిన చరిత్ర లేదు కాబట్టి. అన్ని చోట్లా పోటీ చేసే సత్తా లేదు. అందుకే వీళ్లందరూ వంచనను, మోసాన్నే నమ్ముకుంటున్నారు. అమలు చేసిన మంచి స్కీంలేవీ లేవు కాబట్టి.. ఏకంగా రంగు రంగుల వలలతో ప్రజలను మోసం చేస్తున్నారు. కొత్తగా మరిన్ని వాగ్దానాలతో వస్తున్నారు. ఆరు గ్యారెంటీలట. జగన్‌ను ఢీకొట్టలేమని డిసైడ్ చేసుకొని ఉమ్మడి మేనిఫెస్టో అని ప్రజలను మోసం చేయడానికి బయల్దేరారు. ప్రతి ఇంటికీ కేజీ బంగారం, బెంజ్ కారు కొనిస్తారట. ఇలాంటి వారిని నమ్మవచ్చా? ఆలోచించండి. ఇలాంటి వారి బుద్ధి చూసినప్పుడు 'ఎలుక తోలు తెచ్చి ఏడాది ఉతికినా నలుపు నలుపే గానీ తెలుపు కాదు.. కొయ్య బొమ్మను తెచ్చి కొట్టినా అది పలుకునా.. విశ్వదాభిరామ, వినుర వేమ' అనే వేమన పద్యం గుర్తుకొస్తోంది.
>
> – ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



ప్యాకేజీ కోసం త్యాగాల త్యాగరాజు

- దత్తపుత్రుడికి బాబు పొత్తుల్లో ఎన్ని సీట్లు ఇచ్చినా ఓకే. ఏ సీటు ఇవ్వకపోయినా ఓకే. చిత్తం ప్రభూ అంటూ త్యాగాలు చేసే త్యాగరాజు మాత్రం ఈ దత్తపుత్రుడిలోనే చూస్తాం. ఎవరైనా త్యాగాలు ప్రజల కోసం చేస్తారు. కానీ దత్త పుత్రుడు ప్యాకేజీల కోసం త్యాగాలు చేస్తున్నాడు. ఈ మ్యారేజ్ స్టార్ ఆడవాళ్లను కేవలం ఆట వస్తువులుగా మాత్రమే చూస్తాడు.
- పెళ్లి అనే పవిత్ర వ్యవస్థను, సంప్రదాయాన్ని మంటగలుపుతూ, నాలుగేళ్లకోసారి పెళ్లి చేసుకోవడం, మళ్లీ విడాకులు ఇచ్చేయడం, ఇలా కార్లు మార్చినట్టు భార్యలను మార్చుతున్న ఈ పెద్ద మనిషి ఇప్పటికే ముగ్గురు భార్యలు అయిపోయారంటే ఆయన ఎలాంటి వ్యక్తో ఆలోచించండి. నాకు ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. చెల్లెళ్లు ఉన్నారు. మన ఇళ్లల్లో ఆడబిడ్డలు ఉన్నారు. ఇలాంటి వారు ముఖ్యమంత్రులు, ఎమ్మెల్యేలు అయితే వారిని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కడూ అయనలా చేయడం మొదలు పెడితే మన ఆడబిడ్డలు, చెల్లెమ్మల పరిస్థితి ఏంటి? ఈ దత్తపుతురడు పొలిటికల్ లైఫ్‌లో మాత్రం 10, 15 ఏళ్లు అయినా చంద్రబాబుతో ఉండాల్సిందేనని తన క్యాడర్‌కు చెబుతున్నాడు.
- రెండు విషాలు కలిస్తే అమృతం అవుతుందా.. నలుగురు వంచకులు కలిస్తే మంది పెరుగుతారు కాని ప్రజలకు చేసే మంచి పెరుగుతుందా? ఒకరేమో పిల్లనిచ్చిన మామ సాక్షాత్తు ఎన్టీ రామారావుకు వెన్నుపోటు పొడిచిన క్యారెక్టర్. మరొకరు ఈ దత్త పుత్రుడు. వీరిద్దరి కుటిల నీతి వల్ల ప్రజలకు మంచి జరుగుతుందా?

బాబును సమర్థించేవారు ఆలోచించండి

నిజాయతీగా విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా సాధికారత, సామాజిక న్యాయం, పరిపాలన సంస్కరణల్లో విప్లవాత్మక అడుగులు పడుతున్నాయి. ఇందులో ఏవీ చేయని చంద్రబాబును సమర్థించే వారు ఒకసారి ఆలోచించాలని కోరుతున్నా. ఎందుకంటే ఇవన్నీ చూస్తే వారికి కడుపు మండుతుంది. ఎన్ని జలిసిల్ మాత్రలు వేస్తే మాత్రం ఈ కడుపుమంట తగ్గుతుంది! వారు బాబు అనే చిన్న గీతను పెద్దది చేయలేరు కాబట్టి మనం చేసిన సంక్షేమం, అభివృద్ధి అనే పెద్ద గీతను చెరిపేసే ప్రయత్నంలో భాగంగా ఈ దిక్కుమాలిన రాతలు, దిక్కుమాలిన కథనాలతో ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నారు. ఉద్యోగులను సైతం రెచ్చగొట్టే పనులు చేస్తున్నారు.

ఏం చేశారని ఓట్లడుగుతారు?

- 75 ఏళ్ల వయసున్న చంద్రబాబు నాయుడు 14 ఏళ్లలో మూడు దఫాలు ముఖ్యమంత్రిగా పని చేశాడు. కేవలం నాలుగన్నరేళ్లు పనిచేసిన మీ బిడ్డతో ఢీ కొట్టబోతున్నాడు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 14 ఏళ్లలో గుర్తు పెట్టుకోదగ్గ మంచి ఏదైనా, ఎవరికైనా, ఎప్పుడైనా చేశాడా?
- ఫలానా మంచి చేశాను కాబట్టి ప్రజలు నాకు మద్దతు తెలపాలి.. ఓట్లు వేయాలని అడగగలరా? మీ బిడ్డ హయాంలో అమలవుతున్న అమ్మ ఒడి కంటే మెరుగైన పథకం అమలు చేశానని ఓట్లు అడగగలరా?
- పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మల కోసం మన ప్రభుత్వంలో అమలవుతున్న వైఎస్సార్ ఆసరా కంటే ఇంకా మెరుగైన స్కీమ్ ఇచ్చానని ఓటు అడగగలరా?
- మీ బిడ్డ హయాంలో వైఎస్సార్ చేయూత కంటే ఇంకా మెరుగైన పథకం అమలు చేసి ఉంటే, దానిని చూపి ఓట్లేయండని అడిగే ధైర్యం ఉందా? ఏకంగా 31 లక్షల ఇంటి స్థలాలు నా అక్కచెల్లెమ్మల పేరుతో రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చాం. ఇందులో 22 లక్షల ఇళ్లు కడుతున్నాం. ఇంతకన్నా మెరుగైన కార్యక్రమం నేను చేశానని ఈ బాబు ఓట్లు అడగగలరా?
- డీబీటీ ద్వారా 2.45 లక్షల కోట్లు అక్కచెల్లెమ్మల బ్యాంకు ఖాతాల్లో జమ చేశాం. ఇలా తాను కూడా 14 సంవత్సరాలు సీఎంగా ఉంటూ ఎన్ని బటన్లు నొక్కి.. ఇంత డబ్బు ప్రజలకు ఇచ్చానని ఈ బాబు ఏ గ్రామంలో అయినా రచ్చబండ దగ్గర నిలబడి చెప్పగలడా?
- ప్రజల బ్యాంకు స్టేట్‌మెంట్లు చూపిస్తూ దాన్ని సాక్షిగా పెడుతూ 2014–2019 మధ్య తన ప్రభుత్వం ఏమిచ్చిందో, మనందరి ప్రభుత్వం చేసిన మేలుతో పోల్చి ఓటు అడగగలడా? కుప్పంలో అయినా సరే, ఏ ఇంట్లో అయినా సరే.. ఈ ఛాలెంజ్ స్వీకరించి ఓటు అడగగలడా? చంద్రబాబు అడగలేడు. ఎందుకంటే ఎవరికీ మంచి చేసిన చరిత్ర లేనే లేదు.

కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు సచివాలయ వ్యవస్థ

- కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు గ్రామ సచివాలయం ఎవరు పెట్టారు అంటే.. పౌర సేవలను ప్రజల దగ్గరికి గ్రామ స్థాయిలో శాశ్వత ఉద్యోగాలతో ఎవరు తీసుకొచ్చారంటే గుర్తుకొచ్చేది మీ జగనే. ఏ గ్రామంలోనైనా ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్ వ్యవస్థతో పింఛను మొత్తం పెంచింది, ఆర్బీకేలు తెచ్చింది ఎవరు అంటే గుర్తుకొచ్చేది మీ జగనే.
- గ్రామాల్లో విలేజ్ క్లినిక్‌లు, మహిళా పోలీసులు, అక్క చెల్లెమ్మల ఫోన్‌లలో దిశ యాప్, ఆరోగ్య సురక్ష, ఆరోగ్య ఆసరా ద్వారా ఇంటింటా ఆరోగ్యాన్ని పట్టించుకున్న వ్యక్తి ఎవరంటే గుర్తుకొచ్చేది మీ జగనే. 104, 108, ఆరోగ్యశ్రీ, రైతులకు ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్ మెంట్.. ఇలా అనేక పథకాలు తీసుకొచ్చింది దివంగత మహానేత వైఎస్సార్ అయితే, వాటిని మరో నాలుగు అడుగులు ముందుకు వేసి అమలు చేస్తున్నది ఎవరంటే గుర్తుకొచ్చేది మీ జగనే.
- రైతన్నలకు వైఎస్సార్ రైతు భరోసా, అక్క చెల్లెమ్మలు, రైతన్నలకు సున్నా వడ్డీ, అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, అసైన్డ్ భూముల మీద 22ఏ తొలగించి 35 లక్షల ఎకరాల మీద శాశ్వత హక్కులు ఇచ్చింది మీ జగనే. పాఠశాలలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాడు–నేడు, గవర్నమెంట్ బడుల్లో ఇంగ్లిష్ మీడియం, డిజిటల్ బోధన, ఐఎఫ్‌పీలు, పిల్లలకు ట్యాబులు, శాశ్వత బీసీ కమిషన్ ఏర్పాటు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు నామినేటెడ్ పదవులు, కాంట్రాక్టుల్లో 50 శాతం చట్టం, రూ.2.45 లక్షల కోట్లు డీబీటీ, మత్స్యకార భరోసా, నేతన్న నేస్తం, వాహన మిత్ర, తోడు, చేదోడు.. ఈ పేర్లు విన్నప్పుడు గుర్తుకు వచ్చేది మీ జగనే. 11 కొత్త మెడికల్ కళాశాలలు, కొత్తగా 6 పోర్టులు, మరో 10 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం ఈ నాలుగున్నర సంవత్సరాల్లో మాత్రమే కనిపిస్తున్నాయి. నాటికి, నేటికి తేడా గమనించాలి.

క్లుప్తంగా...

ఏపీ ల్యాండ్ అథారిటీ ఏర్పాటు

చైర్‌పర్సన్‌గా సీసీఎల్‌ఏ, కమిషనర్‌గా సర్వే శాఖ కమిషనర్

సాక్షి, అమరావతి: దేశంలోనే మొట్టమొదటిసారిగా రాష్ట్రంలో ఏపీ ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని తెచ్చిన వైఎస్ జగన్ ప్రభుత్వం.. దానిని అమలు చేసే దిశగా కీలక అడుగు వేసింది. ఇందుకోసం ఏపీ ల్యాండ్ అథారిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. అథారిటీ చైర్‌పర్సన్‌గా భూ పరిపాలన శాఖ చీఫ్ కమిషనర్(సీసీఎల్ఏ), కమిషనర్‌గా సర్వే సెటిల్మెంట్, ల్యాండ్ రికార్డుల శాఖ కమిషనర్ ఉంటారని తెలిపింది. స్టాంపులు-రిజిస్ట్రేషన్లు, మున్సిపల్ పరిపాలన, పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి శాఖల కమిషనర్లు సభ్యులుగా ఉంటారని పేర్కొంది.

సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల ఉన్నత చదువులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న జగనన్న విద్యాదీవెన ప్రతి కుటుంబంలో వెలుగులు నింపుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం గుంటూరు జిల్లా అధ్యక్షుడు వినోద్, ప్రాంతీయ సమన్వయకర్త విఠల్ తెలిపారు. జగనన్న విద్యాదీవెన కార్యక్రమం ద్వారా జూలై-సెప్టెంబర్ త్రైమాసికానికి సంబంధించిన నిధులను భీమవరంలో విద్యార్థులు, తల్లుల ఉమ్మడి బ్యాంకు ఖాతాల్లో జమ చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఏసీ కళాశాలలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి విద్యార్థులు క్షీరాభిషేకం చేశారు. జిల్లా విద్యార్థి విభాగం నేతలు రవి, భాను, విశాల్, చంద్ర,విద్యార్థులు పాల్గొన్నారు.

11 బార్ల లైసెన్సులకు నోటిఫికేషన్ జారీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 11 బార్ల లైసెన్సుల కేటాయింపునకు ఎక్సైజ్ శాఖ శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. గతంలో నిర్వహించిన వేలం పాటలో లైసెన్స్ ఫీజు, నాన్ రిఫండబుల్ మొత్తం, బిడ్ మొత్తం చెల్లించడంలో విఫలమైన బార్లకు మళ్లీ వేలం నిర్వహించనుంది. ఈ 11 బార్ల కేటాయింపు పూర్తిగా లాటరీ విధానంలో జరపాలని ఎక్సైజ్ శాఖ నిర్ణయించింది. ఆసక్తి ఉన్న వారు 2024, జనవరి 3లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని..నాన్ రిఫండబుల్ అప్లికేషన్ ఫీజును 2024, జనవరి 4వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా చెల్లించాలని ఎక్సైజ్ శాఖ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. పూర్తి వివరాల కోసంhttp://apcpe.aptonline.in. సమాచారం కోసం 94409 02260, 84979 81234లో సంప్రదించాలని సూచించారు.

జర్నలిస్టు బస్‌పాసుల గడువు పొడిగింపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అక్రిడేటెడ్ జర్నలిస్టులకు ఇచ్చిన రాయితీ బస్ పాసుల గడువును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్‌ఆర్టీసీ) 2024 డిసెంబర్ 31వరకూ పొడిగించింది. జర్నలిస్టుల బస్‌పాస్‌ల గడువు రేపటితో ముగియనుండటంతో వాటి వ్యాలిడిటీని పెంచాల్సిందిగా రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ ఏపీఎస్‌ఆర్టీసీని కోరింది. దీంతో డీపీఆర్‌వోల సూచనలతో బస్ పాస్‌లు రెన్యువల్ చేయాల్సిందిగా అన్ని జిల్లాల పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్లకు ఆర్టీసీ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- ఆరోగ్యశ్రీ చికిత్సల తర్వాత అందించే ఫాలోఅప్ వైద్య సేవలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- ఫాలోఅప్ కన్సల్టేషన్ సేవలు పొందేలా రోగులకు చేయూత
- ఆస్పత్రికి వెళ్లి రావడం కోసమయ్యే ప్రయాణ ఖర్చుల కోసం రూ.300 చొప్పున అందజేత
- ఫాలోఅప్ కన్సల్టేషన్ అవసరమైన 138 ప్రొసీజర్లకు అమలు
- రోగులను సంపూర్ణ ఆరోగ్యవంతుల్ని చేయడమే ధ్యేయంగా సీఎం జగన్ నిర్ణయం



సాక్షి, అమరావతి: ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ తదితర కార్యక్రమాల ద్వారా ప్రజారోగ్యానికి అండగా నిలుస్తున్న వైఎస్ జగన్ ప్రభుత్వం.. ఇప్పుడు మరో అడుగు ముందుకేసింది. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చికిత్స పూర్తయిన అనంతరం.. ఆస్పత్రులకు వెళ్లి ఫాలోఅప్ వైద్య సేవలు పొందడం కోసం రోగుల ప్రయాణాలకయ్యే ఖర్చును కూడా వారికి అందించబోతోంది.

కన్సల్టేషన్‌కు రూ.300 చొప్పున..

ఇప్పటికే ఆరోగ్యశ్రీ పథకం కింద అందించే చికిత్సల సంఖ్య(ప్రొసీజర్లు)ను వైఎస్ జగన్ ప్రభుత్వం 3,257కు పెంచింది. అలాగే ఆరోగ్యశ్రీ వైద్య వ్యయ పరిమితిని కూడా రూ.25 లక్షలకు పెంచి పేద, మధ్యతరగతి కుటుంబాలకు కొండంత భరోసా కల్పించింది. అంతేకాకుండా 1,500కు పైగా ప్రొసీజర్లలో చికిత్సల తర్వాత వైద్యులు సూచించిన విశ్రాంత సమయానికి గాను రోగులకు వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద గరిష్ఠంగా నెలకు రూ.5 వేల వరకు సాయం అందిస్తోంది. ఇప్పుడు ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా సీఎం జగన్ మరో అడుగు ముందుకు వేశారు. ఆరోగ్యశ్రీ పథకంలోని గుండె, మెదడు, ఆర్థో, పీడియాట్రిక్స్ విభాగాలకు సంబంధించిన 138 ప్రొసీజర్లలో ఏదైనా చికిత్స చేయించుకున్న తర్వాత.. ఏడాదిలోపు రోగులు 4సార్లు వైద్యులను సంప్రదించాల్సి ఉంటుంది. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేసే రోజే.. ఫాలోఅప్ సేవల కోసం రావాల్సిన తేదీలను వైద్యులు చెబుతుంటారు. ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొందేవారంతా నిరుపేద, మధ్యతరగతి ప్రజలే. వీరు ప్రయాణాల ఖర్చులకు వెనుకడుగు వేసి ఫాలోఅప్ వైద్య సేవలపై నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో సమస్య పూర్తిగా నయం కాకపోవడంతో భవిష్యత్‌లో మళ్లీ ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆ 138 ప్రొసీజర్లలో ఏదైనా చికిత్స పొందిన వారికి ప్రయాణ చార్జీలను కూడా ప్రభుత్వమే భరించాలని సీఎం జగన్ నిర్ణయించారు. ఒక్కో కన్సల్టేషన్‌కు రూ.300 చొప్పున చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు వైద్య, ఆరోగ్య శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

అవసరమైన మందులూ అందజేత..

ఫాలోఅప్ కన్సల్టేషన్ సమయంలోనే రోగికి అవసరమైన మందులను కూడా ఆస్పత్రిలో అందజేస్తారు. ఏటా ఆరోగ్యశ్రీ కింద చేసే మొత్తం చికిత్సల్లో 10 శాతం మేర కేసుల్లో ఫాలోఅప్ కన్సల్టేషన్‌లు అవసరం ఉంటాయని వైద్య శాఖ అంచనా వేసింది. ఫాలోఅప్ కన్సల్టేషన్ వైద్య సేవల పొందేందుకు ప్రభుత్వం ఇలా అదనపు సాయం చేయడం వల్ల రోగులు పూర్తి స్థాయిలో కోలుకుంటారని వైద్య నిపుణులు పేర్కొన్నారు. ఇది ప్రజలకు గొప్ప మేలు చేస్తుందన్నారు.

ఆదేశాల అమలుకు చర్యలు చేపట్టాం..

అవసరం ఉన్న ప్రతి ఒక్క రోగి ఫాలోఅప్ కన్సల్టేషన్ సేవలు పొందేలా చర్యలు తీసుకుంటున్నాం. కన్సల్టేషన్‌కు రూ.300 చొప్పున చెల్లించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీటిని అమలు చేయడానికి చర్యలు చేపట్టాం. మెడ్కో లాగిన్‌లో ఓ ప్రత్యేక ఆప్షన్ ఇస్తున్నాం. ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొందిన వ్యక్తి ఫాలోఅప్ కన్సల్టేషన్‌కు హాజరయ్యాడని నిర్ధారిస్తే.. ఆ రోగి, వారి కుటుంబ సభ్యుల బ్యాంక్ ఖాతాల్లో రూ.300 చొప్పున నగదు జమ అవుతాయి.

– డీకే బాలాజీ, సీఈవో, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ

12 మంది డీఎస్పీలకు అదనపు ఎస్పీలుగా పదోన్నతి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 12 మంది డీఎస్పీలకు అదనపు ఎస్పీలుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు వారికి పోస్టింగ్‌లు ఇస్తూ హోమ్ శాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్ కుమార్ గుప్తా శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. ఆ పోస్టింగ్‌ల వివరాలు..

పేరు	డీఎస్పీగా ప్రస్తుత పోస్టు	అదనపు ఎస్పీగా పోస్టింగు
ఎంకేఎం నాయుడు	సీఐడీ	అదనపు ఎస్పీ(క్రైమ్), విజయవాడ
ఆర్‌వీఎస్ఎన్ మూర్తి	ద్వారకా, వీఎస్‌పీఎస్	అదనపు ఎస్పీ, ఇంటెలిజెన్స్
కె.తిరుమలరావు	దిశ, తూర్పు గోదావరి	అదనపు ఎస్పీ, అప్పా
దీవీ రమణమూర్తి	14వ బెటాలియన్	అదనపు ఎస్పీ, అప్పా
జె.మల్లికార్జున వర్మ	పీటీసీ, అనంతపురం	అదనపు ఎస్పీ, అప్పా
ఏవీ రమణ	ఏసీబీ, బాపట్ల	అదనపు ఎస్పీ, ఇంటెలిజెన్స్
ఎస్.నాగరాజు	జమ్మలమడుగు	అదనపు ఎస్పీ(అడ్మిన్), కర్నూలు
వి.భీమారావు	శ్రీకాళహస్తి	అదనపు ఎస్పీ(అడ్మిన్), పశ్చిమ గోదావరి
ఎం.వెంకటేశ్వరరావు	ఎస్‌బీ, కాకినాడ	అదనపు ఎస్పీ, ఎస్ఈబీ, గుంటూరు
ఎం.శివరామిరెడ్డి	ఏసీపీ, నార్త్, విశాఖపట్నం	అదనపు ఎస్పీ, తిరుమల
ఎం.రమేశ్‌రెడ్డి	ఎస్ఈబీ, ఏలూరు	అదనపు ఎస్పీ, అప్పా
వి. శ్రీరామ్‌బాబు	సీఐడీ	ఆర్ఐవో, ఇంటెలిజెన్స్

ఏపీలో ఆరోగ్య సేవలు భేష్

- కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ
- విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో క్రిటికల్ బ్లాక్‌కు శంకుస్థాపన
- పొన్నూరు మండలంలో హెల్త్ క్లినిక్‌లు పరిశీలన


విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ

లబ్బీపేట (విజయవాడతూర్పు)/పొన్నూరు; ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య రంగ సేవలు, ప్రగతి బాగుందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ ప్రశంసించారు. కేంద్ర, రాష్ట్రాల మధ్య సత్సంబంధాలతో ప్రజారోగ్యరంగ అభివృద్ధికి కృషి చేస్తున్నామని, పథకాలు, కార్యక్రమాల అమల్లో క్రియాశీలంగా వ్యవహరిస్తూ ప్రగతి పథంలో పయనిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య, మౌలి క వసతుల మిషన్ కార్యక్రమంలో భాగంగా రూ.23.75 కోట్లు చొప్పున ఎన్టీఆర్, అనకాపల్లి జిల్లాలకు మంజూరైన క్రిటికల్ కేర్ బ్లాక్‌ల శంకుస్థాపనతోపాటు, రూ.1.25 కోట్ల చొప్పున పశ్చిమ గో దావరి జిల్లా, ప్రకాశం, విజయనగరం, గుంటూరు, కృష్ణా, అన్నమయ్య, శ్రీకాకుళం జిల్లాల్లోని ఏరియా, జిల్లా ఆస్పత్రిల్లో ఏర్పాటు చేసిన ఏడు సమీకృత ప్రజారోగ్య లేబొరేటరీలను విజయవాడ నుంచి వర్చువల్‌గా పారంభించడంతోపాటు విజయవాడలోని ప్రభుత్వాస్పత్రిలో రూ. 30 కోట్లతో ఏర్పాటయ్యే బయోలెఫ్టీ లెవల్-3 లేబొరేటరీకి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను తిలకించారు. అనంతరం పొన్నూరు మండలం మామిళ్లపల్లి గ్రామంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజినితో కలసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో వైద్య సేవలు, సమీపంలోని పొలంలో డ్రోన్ ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించారు. అనంతరం ఎంపీయూపీ పాఠశాలలో వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు అధ్యక్షత వహించిన సమావేశంలో మాండవియా మాట్లాడారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి రజిని మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో వైద్య ఆరోగ్య రంగాన్ని పూర్తి స్థాయిలో బలోపేతం చేసేందుకు అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుంచి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా రూ.1,692 కోట్లతో ఏర్పాటు చేసిన 10,032 విలేజ్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లు ఆరోగ్య సంరక్షణలో కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. ఆరోగ్యరంగ వృత్తి నిపుణులను అందించేందుకు రూ.8,480 కోట్ల పెట్టుబడితో 17 కొత్త వైద్య కళాశాలలను ఏర్పాటుచేస్తున్నట్లు, రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్య సేవలు అందించే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలుచేస్తున్నట్లు తెలిపారు. విజయవాడ, అనకాపల్లి ఎంపీలు కేశినేని శ్రీనివాస్, డాక్టర్ బి.వెంకట సత్యవతి, విజ యవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ సెక్రటరీ పి.అశోక్‌బాబు, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ జె.నివాస్, ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ డి.మురళీధర్‌రెడ్డి, ఎన్టీఆర్ కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ కార్డుతో ఇతర రాష్ట్రాల్లోనూ చికిత్స

భారత్ కార్డుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేయడం లేదని బీజేపీ కార్యకర్తలు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకురాగా 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కార్డులు రూపొందించినట్లు, రెండు కార్డులపై వైద్య సేవలు ఒకటేనని' తెలిపారు. ఎంటీ కృష్ణబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందించే ఆరోగ్య శ్రీతో రూ.25 లక్షల వరకు వైద్య సేవలు ఉచితంగా పొందవచ్చని, కేంద్ర ప్రభుత్వం కార్డును ఇతర రాష్ట్రాలలో వినియోగించేందుకు ఉపయోగపడుతుందని లబ్ధిదారులు గ్రహించాలన్నారు. సభలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ద్వారా ప్రజలకు పథకాలను వివరించారు. లబ్ధిదారులకు ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేశారు.

సీఎం జగన్‌ను కలిసిన కేంద్ర మంత్రి మాండవీయ

సాక్షి,అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ కలిశారు. శుక్రవారం సాయంత్రం ఆయన సీఎం జగన్ నివాసానికి వచ్చారు. ఇది మర్యాదపూర్వక భేటీ అని సీఎంవో వర్గాలు తెలిపాయి. శుక్రవారం రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్రమంత్రి రోజంతా వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సాయంత్రం సీఎం జగన్‌తో భేటీ అయ్యారు.

మంచి ఆలోచనలతో విప్లవాత్మక మార్పులు

- విద్య, వైద్యం, పరిపాలన, భూ సమస్యలపై వినూత్న నిర్ణయాలు
- ప్రతిష్టాత్మకంగా గ్రామ,వార్డు సచివాలయాల వ్యవస్థ ఏర్పాటు
- ఈ వ్యవస్థను దేశ వ్యాప్తంగా అమలు చేసేందుకు ఇతర రాష్ట్రాల ప్రయత్నాలు
- రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయ కల్లం


నెల్లూరులో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయకల్లం

నెల్లూరు (టౌన్): ''రాష్ట్ర ప్రజలకు ఏం చేయాలన్న మంచి ఆలోచన నుంచే రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక మార్పులను తెచ్చింది. 1980కి పూర్వం నుంచి ఒకే మూసలో కొనసాగుతున్న ప్రభుత్వ విధానాలను నాలుగున్నరేళ్లలో సమూల మార్పులు చేసింది. విద్య, వైద్యం, పరిపాలన, భూ సమస్యలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు మరి ఏ ప్రభుత్వంలోనూ జరగలేదు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి, ఉద్యోగాల కల్పన, ఇరిగేషన్ ప్రాజెక్టులు, పోర్టులు, ఫిషింగ్ హార్బర్‌లు, హార్బర్‌లు, హైవేల రూప కల్పన తదితర రంగాల్లో గణనీయమైన అభివృద్ధిని సాధించింది. పక్క రాష్ట్రాలకు స్ఫూర్తిగా నిలిచింది'' అని పూర్వ చీఫ్ సెక్రటరీ, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయ కల్లం చెప్పారు. ఓపెన్ మైండ్స్ ఫర్ బెటర్ సొసైటీ ఆధ్వర్యంలో 'ప్రభుత్వ పాలనా విధానంలో విప్లవాత్మక మార్పులు – ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి' అంశంపై నెల్లూరులోని రావూస్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఏం మాట్లాడారంటే..

డబ్బుంటేనే చదువుకునే పరిస్థితులకు చెక్‌పెట్టి..

మొదట్లో కోచింగ్ సెంటర్లుగా ప్రారంభమైన నారాయణ, చైతన్య వంటి విద్యా సంస్థలు విద్యావ్యవస్థనే సామాన్యులకు అందకుండా చేశాయి. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం నాడు-నేడు, విద్యాదీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అనేక పథకాల ద్వారా పేద పిల్లలు ఉన్నత విద్య అభ్యసించేందుకు అవకాశం కల్పించింది. ఇందుకోసం రూ.7వేల కోట్లు ఖర్చు చేసింది.

పల్లెల్లోనూ 24 గంటలూ వైద్య సేవలు..

గ్రామీణ స్థాయి నుంచే వైద్య విధానంలో పలుమార్పులను ప్రభుత్వం చేసింది. విలేజ్ క్లీనిక్‌ల్లో ఇద్దరు డాక్టర్లను ఏర్పాటు చేసి 24 గంటలు వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టింది. ప్రైమరీ హెల్త్ సెంటర్లను సైతం ఇద్దరు డాక్టర్లతో నడిపిస్తోంది. కమ్యూనిటీ హాస్పిటల్స్, జిల్లా ప్రధాన ఆస్పత్రుల్లో పెను మార్పులు తెచ్చింది. డొనేషన్లతో వైద్య విద్యను కొనుగోలు చేసే విధానానికి స్వస్తి చెప్పి ప్రభుత్వ మెడికల్ కాలేజీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. గత 30 ఏళ్లలో కేవలం 12 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఉంటే ఈ నాలుగున్నరేళ్లలో కొత్తగా 17 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంది.

పాలనావ్యవస్థలో సమూల మార్పులు

ప్రజలకు సుపరిపాలన అందించేందుకు గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసింది. పెన్షన్‌ల నుంచి సర్టిఫికెట్ల వరకు పేదలకు అవసరమైనవన్నీ వారి ఇళ్లకే వెళ్లి ఇవ్వడంలో దేశవ్యాప్తంగా రికార్డు నెలకొల్పింది. బ్రిటిష్ కాలం నుంచి వస్తున్న భూ సమస్యలకు ప్రభుత్వం చెక్ పెట్టింది. రికార్డుల్లో తేడాలు, చుక్కల భూములు వంటి వాటిని పరిష్కరించేందుకు డ్రోన్, శాటిలైట్ సర్వేల ద్వారా విజయవంతమైన ఫలితాలు సాధించింది. జాతీయ రహదారుల అభివృద్ధి, నాలుగు మేజర్ పోర్టులు, పది ఫిషింగ్ హార్బర్‌లకు రూ.21,700 కోట్లు ఖర్చుచేసి లక్ష మందికి ఉపాధి కల్పించింది. ఈ సదస్సులో విక్రమ సింహపురి యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ సుందరవల్లి, బోర్డ్ ఆఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్ (బీసీడీఈ) చైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఓపెన్ మైండ్ అధ్యక్షుడు రాజశేఖరరెడ్డి, రావూస్ విద్యా సంస్థల డైరెక్టర్ శివసాంకేత్ తదితరులు ప్రసంగించారు.

ఇంజినీర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ


డైరీ ఆవిష్కరిస్తున్న విజయానంద్

సాక్షి, అమరావతి: ఏపీ పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ 2024 నూ తన సంవత్సర టెక్నికల్ డైరీని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజ యానంద్ శుక్రవారం విద్యుత్ సౌధలో ఆవిష్కరించారు. టేబుల్ క్యాలండర్‌ను ట్రాన్స్‌కో విజిలెన్స్ జేఎండీ మల్లారెడ్డి విడుదల చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు వి.వి.మహేశ్వరరెడి,అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.వి.శేషారెడ్డి, అసోసియేషన్ రాష్ట్ర ముఖ్య సలహాదారు ఎ.సుబ్బారావు, అసోసియేషన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు హుస్సేన్ ఖాన్, డైరీ కమిటీ చైర్మన్ నాగరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వావ్.. వాట్ ఏ గ్రేట్ మెనూ..

- ఏపీలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంపై జపాన్ వాసుల కితాబు
- సీఎం జగన్‌పై ప్రశంసల జల్లు


కె.గొల్లపల్లె ఉన్నత పాఠశాలలో జపాన్ దేశస్తులతో ఉపాధ్యాయులు

యాదమరి(చిత్తూరు జిల్లా): వాట్ ఏ గ్రేట్ మెనూ.. యువర్ సీఎం కేరింగ్ ఈజ్ సూపర్ ఆన్ మిడ్ డే మీల్స్ అంటూ ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డిపై జపాన్ వాసులు ప్రశంసల జల్లు కురిపించారు. అంతేకాదు.. పాఠశాలలో అమలవుతున్న మెనూ విధానాన్ని పరిశీలించి సంభ్రమాశ్చర్యానికి గురయ్యారు. రోజుకో స్పెషల్ కూరతో ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న భోజన విధానంపై ప్రభుత్వ కల్పిస్తున్న సదుపాయాలను వారు కొనియాడారు. చిత్తూరు జిల్లా యాదమరి మండలం కె.గొల్లపల్లె ఉన్నత పాఠశాలను జపాన్ దేశస్తులు శుక్రవారం సందర్శించారు. పాఠశాలలో సీనియర్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కనకాచారికి జపాన్‌కి చెందిన స్టాన్లీ స్నేహితుడు. కనకాచారి కోరిక మేరకు క్రిస్మస్ వేడుక కోసం స్టాన్లీ అతని జపాన్ స్నేహితులు కోటరో, హిరోమి, ష్కాలర్ ఇక్కడ పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భోజనం వడ్డిస్తుండగా అక్కడి వాతావరణాన్ని చూసి ఆశ్చర్యానికి లోనయ్యారు. ఇంత పకడ్బందీగా ఈ పథకాన్ని అమలు చేసేదెవరని ఆరా తీశారు. అలాగే పాఠశాలకు కల్పించిన మౌలిక వసతులకు మంత్రముగ్ధులై విషయాలన్నీ కూలంకషంగా అడిగి తెలుసుకున్నారు. నాడు -నేడు అనే కార్యక్రమాన్ని ఏపీ ప్రభుత్వం అమలు చేస్తోందని, దీనివల్ల ఇక్కడి పాఠశాలల స్వరూపం పూర్తిగా మారిపోయిందని కనకాచారి వారికి వివరించారు. దీనికోసం సీఎం జగన్ మోహనరెడ్డి మహోద్యమం చేస్తున్నారని, మధ్యాహ్న భోజన పథకంలో మెనూ తీసుకొచ్చి రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్నారని వారి దృష్టికి తీసుకొచ్చారు. దీనికి ఆశ్చర్యం చెందినవారు వెంటనే అక్కడ అందిస్తున్న ఆహారాన్ని రుచి చూశారు. ఇంతటి సదుపాయాలు కల్పిస్తున్న సీఎం జగన్ మోహనరెడ్డిపై ప్రశంసల వర్షం కురిపించారు. పాఠశాల హెచ్‌ఎం లలితతోపాటు ఉపాధ్యాయులు ఉన్నారు.

సర్వభూతాలను ఆ పరమాత్మలోనే నిరంతరం చూస్తూ,
సమస్త భూతాల్లోనూ ఆ పరమాత్మను కనుగొంటూ వుండే
మనుష్యుడు ఎప్పుడేగానీ ఘృణ, ద్వేషాలకు లోనుకాడు.
– ఈశావాస్యోపనిషత్తు

సాక్షి
శనివారం, 30 డిసెంబర్ 2023

చెక్కుచెదరని మైత్రి

అంతర్జాతీయంగా ఒక అస్పష్ట వాతావరణం అలుముకున్న వేళ భారత్–రష్యాలు తమ చిరకాల స్నేహబంధాన్ని మరింత పటిష్టపరుచుకుంటామని ప్రతినబూనాయి. ఏటా జరిగే శిఖరాగ్ర సమావేశం కోసం ఆ దేశంలో పర్యటించిన విదేశాంగ మంత్రి జైశంకర్ రష్యా తమ నమ్మదగిన మిత్ర దేశమని మరోసారి చాటారు. దాదాపు ఆరున్నర దశాబ్దాల ద్వైపాక్షిక సంబంధాల్లో సమస్యలు తలెత్తలేదని అనలేం. మన దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రారంభమై అమెరికా వైపు మొగ్గుచూపటం మొదలైనప్పటినుంచీ రష్యా కలవరపడుతోంది. అమెరికా ఇండో–పసిఫిక్ వ్యూహంలో భాగంగా ఏర్పడిన చతుర్భుజ కూటమి(క్వాడ్)లో మన భాగస్వామ్యం రష్యాకు ససేమిరా నచ్చలేదు. దాన్ని 'ఆసియా–పసిఫిక్ వ్యూహం'గా సవరించి తనతో సహా ఆసియా దేశాలన్నిటికీ అందులో భాగస్వామ్యం కల్పించాలన్నది రష్యా డిమాండ్. అదే సమయంలో చైనాకు రష్యా సన్నిహితం కావటం, పాకిస్తాన్‌తో సైతం మైత్రి నెరపటం మన దేశాన్ని ఇబ్బందిపెట్టే అంశాలు. ఇక ఇటీవలి అంతర్జాతీయ పరిణామాల్లో ఇరు దేశాలూ ఉత్తర దక్షిణ ధ్రువాలుగా వున్నాయి. దౌత్య సంబంధాలు ఎంతో సున్నితమైనవి. ఒక దేశంతో మనకు ఏర్పడే చెలిమి అంతవరకూ మనతో మిత్రత్వం నెరపుతున్న మరో దేశానికి సమస్యగా అనిపించవచ్చు. అనుమానాలు తలెత్తవచ్చు. ఆ రెండు దేశాలమధ్యా వుండే పొరపొచ్చాలే అందుకు కారణం. 2016 నాటి అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రష్యా జోక్యం చేసుకుందన్న ఆరోపణలు వచ్చినప్పటినుంచీ రష్యా–అమెరికా సంబంధాల్లో సమస్యలు తలెత్తాయి. ఆ తర్వాతకాలంలో క్రిమియాను రష్యా దురాక్రమించాక అమెరికా మరింత ఆగ్రహించింది. ఆ దేశంతో ఎవరూ సన్నిహితంగా వుండరాదని కోరుకుంది. ఇక ఉక్రెయిన్ యుద్ధం మొదలైనప్పటినుంచీ రష్యాపై అనేక ఆంక్షలు విధించి, పాశ్చాత్య దేశాలను కూడగట్టింది. మన దేశంపై కూడా ఒత్తిళ్లు తెస్తూనేవుంది. అయినా ద్వైపాక్షిక వాణిజ్యం 1,200 కోట్ల డాలర్ల నుంచి నిరుడు 5,000 కోట్ల డాలర్లకు చేరుకుంది. అమెరికా ఆంక్షల కారణంగా యూరోప్ దేశాలకు ముడి చమురు అమ్మకం ఆగిపోయిన పర్యవసానంగా మన దేశానికి రష్యా చవగ్గా చమురు విక్రయించటంతో ఈ వాణిజ్యం నాలుగు రెట్లు పెరిగింది. ముమ్ముందు ఇది మరింత పెరుగుతుందని జైశంకర్ చెబుతున్నారు. ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ యుద్ధాన్ని మన దేశం వ్యతిరేకించినా బాహాటంగా రష్యాను విమర్శించలేదు. మన జాతీయ భద్రతా వ్యూహంలో రష్యా పాత్ర అత్యంత కీలకం. మొదటినుంచీ మన రక్షణ కొనుగోళ్లలో రష్యా వాటా అధికం. ఇప్పటికీ ఆయుధాల మరమ్మత్తు బాధ్యత రష్యాదే. ఇటీవలి కాలంలో అమెరికా, ఫ్రాన్స్‌ల నుంచి కొనుగోళ్లు పెరిగాయి. తన సలహాను బేఖాతరు చేసి రష్యానుంచి అత్యాధునిక ఎస్–400 క్షిపణి వ్యవస్థను కొనుగోలు చేయటం అమెరికాకు నచ్చలేదు. ఇలా ఎన్ని ఒత్తిళ్లున్నా రెండు దేశాల బంధం సడలలేదు.

జైశంకర్ తాజా పర్యటనలో తమిళనాడులోని కూదంకుళం అణు విద్యుత్ ప్రాజెక్టుకు రష్యా మరింత సాంకేతిక సహకారం అందించే ఒప్పందంపై సంతకాలయ్యాయి. 2016లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టులో రెండు యూనిట్లు ఇప్పటికే పనిచేస్తుండగా మరో నాలుగు మొదలుకావాల్సివుంది. 2027 నాటికి ఈ ప్రాజెక్టు వెయ్యి మెగావాట్ల విద్యుదుత్పత్తి ప్రారంభించాల్సి వుంది. ఇదిగాక ఔషధాలు, వైద్య పరికరాలు వగైరాలకు సంబంధించిన ఒప్పందాలపై సంతకాలయ్యాయి. యూరేషియన్ ఎకనామిక్ జోన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చలు పునఃప్రారంభించాలన్న రష్యా ప్రతిపాదనకు భారత్ అంగీకరించింది. సాధారణంగా వేరే దేశాల మంత్రులు పర్యటించినప్పుడు రష్యా అధ్యక్షుడు పుతిన్ వారిని కలిసే సంప్రదాయం లేదు. కానీ దాన్ని పక్కనబెట్టి ఆయన జైశంకర్‌తో సమావేశం కావటం, తమ దేశంలో పర్యటించాలని ప్రధాని నరేంద్ర మోదీకి ఆహ్వానం పంపటం భారత్‌తో బంధానికి పుతిన్ ఇస్తున్న ప్రాధాన్యతను తెలియబరుస్తోంది. అయితే సమస్యలున్నాయి. ముడి చమురు కొనుగోళ్లకు మన దేశం రూపాయల్లో చెల్లింపులు మొదలుపెట్టినా, దాని అస్థిరత కారణంగా సమస్యలు ఎదుర్కొంటున్నామనీ, అందుకోసం అదనంగా చెల్లించాలనీ రష్యా చమురు సంస్థలు కోరుతున్నాయి. అదింకా పరిష్కారం కావలిసేవుంది.

దౌత్యం ఎంతో క్లిష్టమైనది. అవతలి పక్షంనుంచి కావలసినవి రాబట్టుకోవటం, అదే సమయంలో వారి ఒత్తిళ్లకు తలొగ్గకపోవటం కొన్ని సందర్భాల్లో తప్పనిసరి. కల్లోల సమయాల్లో మరింత చాకచక్యం తప్పనిసరి. వాస్తవానికి భారత్–రష్యా శిఖరాగ్ర సమావేశాలకు ఇరు దేశాల అధినేతలూ హాజరు కావలసివుంది. 2000 సంవత్సరం నుంచి ఈ సంప్రదాయం నిరాటంకంగా కొనసాగుతోంది. కరోనా కారణంగా 2020లో అసలు సమావేశమే జరగలేదు. ఉక్రెయిన్ యుద్ధంతో రెండేళ్లుగా మోదీ శిఖరాగ్ర సమావేశాలకు వెళ్లలేదు. అయినా సరే ఈసారి కూడా జైశంకరే వెళ్లక తప్పలేదు. ఏమాటకు ఆమాటే చెప్పుకోవాలి. రష్యాకు ఒకప్పుడు మనం జూనియర్ భాగస్వామిగా వుండేవాళ్లం. ఉదాహరణకు 1991 నాటికి రష్యా జీడీపీ 51.80 కోట్ల డాలర్లు కాగా, మన జీడీపీ 27 కోట్ల డాలర్లు. ఇప్పుడు రష్యా జీడీపీ 2 లక్షల 20 వేల కోట్ల డాలర్లయితే, మన జీడీపీ మొత్తం విలువ 3 లక్షల 60 వేల కోట్ల డాలర్లు. అయినా ఇరు దేశాల సంబంధాలూ యధాతథంగా వున్నాయి. పరస్పర విశ్వాసం ప్రాతిపదికగా ఏర్పడే చెలిమి ఎప్పటికీ చెక్కుచెదరదు. ఎన్నో అవాంతరాలనూ, కాలపరీక్షలనూ తట్టుకుని నిలబడిన భారత్–రష్యా సంబంధాలు ముమ్ముందు సైతం ఇదే రీతిలో కొనసాగుతాయని ఆశించాలి.

భారత అనుకూల వైఖరి గెలిపించేనా?

సందర్భం



టి.సి.ఎ. రాఘవన్

అనుకున్నట్టే జరిగితే, 2024 ఫిబ్రవరిలో పాకిస్తాన్‌లో సాధారణ ఎన్నికలు జరగాలి! ఇప్పుడున్న అంచనా ప్రకారం, నవాజ్ షరీఫ్ నేతృత్వంలోని పాకిస్తాన్ ముస్లిం లీగ్(ఎన్) మెజారిటీ సాధిస్తుంది. ప్రధానిగా మూడు దఫాలు కూడా పదవీకాలం ముగియకుండానే ఆయన తప్పుకోవాల్సి వచ్చింది. మిలిటరీ, న్యాయవ్యవస్థ రెండూ కుమ్మక్కై తన ప్రభుత్వాన్ని ఎలా పడదోశాయో చెబుతున్న షరీఫ్ ప్రకటనలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. భారత్‌తో కనీస స్థాయి సంబంధాలు కలిగి ఉండాలన్న వాదన వినిపించే భారమిప్పుడు కూడా ఆయనే మోస్తున్నారని చెప్పాలి. ఇది షరీఫ్ బలమని కొందరి నమ్మకం. కొందరు బలహీనతగానూ చూస్తున్నారు. అలాగని షరీఫ్ గద్దెనెక్కగానే అంతా సమూలంగా మారిపోతుందని కూడా కాదు.

మిలిటరీ, న్యాయవ్యవస్థ రెండూ కుమ్మక్కై తన ప్రభుత్వాన్ని ఎలా పడదోశాయో వివరిస్తూ పాకిస్తాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ ఇటీవలి కాలంలో చేస్తున్న ప్రకటనలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ప్రస్తుతం పాక్‌లో ఉన్న పరిస్థితులు, 2024 సాధారణ ఎన్నికల్లో విజయం సాధించాలని భావిస్తున్న నవాజ్ షరీఫ్ నేతృత్వంలోని పాకిస్తాన్ ముస్లిం లీగ్(ఎన్) పార్టీని దృష్టిలో పెట్టుకుంటే ఈ వ్యాఖ్యలకు మరింత ప్రాధాన్యం లభిస్తుంది. ఇంకో రెండు నెలల్లో, అంటే 2024 ఫిబ్రవరిలో అక్కడ సాధారణ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం అటు మిలిటరీ, ఇటు నవాజ్ షరీఫ్ అంగీకరిస్తున్న విషయం ఏదైనా ఉందీ అంటే అది మాజీ క్రికెటర్, మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌ను ఎలాగైనా అధికారానికి దూరంగా ఉంచాలన్నది!



భారత్‌లోనే ఎక్కువ ఆసక్తి

ఇంకో ఆసక్తికరమైన అంశం ఏమిటంటే, షరీఫ్ ప్రకటనలకు పాక్‌లో కంటే భారత్‌లోనే ఎక్కువ ఆదరణ లభించడం. ఎందుకిలా? పాకిస్తాన్‌లో అధికార పక్షానికి భిన్నంగా చేసే వ్యాఖ్యలు, వార్తలు సెన్సార్‌కు గురవుతాయి కాబట్టి అని కొందరు అంటారు. అయితే, పాకిస్తాన్ లో చాలా అంశాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతుంటాయి. మీడియా కూడా వాటిని జనానికి చేర్చుతుంటుంది. కానీ ప్రధాన మీడియా వర్గాలు ముట్టుకోకూడదనుకున్న అంశాలకు సోషల్ మీడియా వేదికగా నిలుస్తోంది. బహుశా మనం దూరం నుంచి పాక్ వ్యవహారాలను గమనిస్తూంటాం కాబట్టి... మన దృష్టంతా అక్కడ మిలిటరీకీ, ప్రభుత్వానికీ మధ్య ఉన్న వివాదాలపైనే ఉంటుంది. నవాజ్ షరీఫ్ ఇలాంటి విషయాల్లో పాతికేళ్లుగా కేంద్ర బిందువుగా నిలిచారు. ప్రధానిగా ఉన్న మూడు దఫాలు కూడా పదవీ కాలం ముగియకుండానే వేర్వేరు కారణాల వల్ల ఆయన తప్పుకోవాల్సి వచ్చింది. మిలిటరీ కుట్రలు లేదా మిలిటరీ–న్యాయవ్యవస్థ కుమ్మక్కులతో అన్నమాట!

పాకిస్తాన్‌లో షరీఫ్ ఇటీవలి ప్రకటనలను కొంచెం భిన్నమైన దృష్టితో చూస్తారేమో. నవాజ్ షరీఫ్ నడిపే రాజకీయాలకు ఇలాంటి ప్రకటనలే ఆధారం. ఇందులో సందేహం ఏమీ లేదు. మిలిటరీ వ్యతిరేకతను ఒక అంశంగా నిత్యం ఉంచుతారు ఆయన. కానీ రాజకీయ వైచిత్రి ఏమిటంటే, ఇప్పుడు మిలిటరీతో కలిసిపోయి అధికారంలోకి వచ్చేందుకు షరీఫ్ ప్రయత్నిస్తూండటం! ఇమ్రాన్ ఖాన్ తప్పటడుగులు, అతడి అనుచరుల చేష్టల పుణ్యమా అని షరీఫ్, మిలిటరీ మధ్య రాజీ కుదిరిపోయింది. అయినప్పటికీ ప్రస్తుతం షరీఫ్ ఒక రకమైన ఇబ్బందికరమైన స్థితిలోనే ఉన్నాడని చెప్పాలి. ఒకవేళ ప్రజల్లో మిలిటరీపై వ్యతిరేకత అంటూ ఉంటే దాని ఫలాలు అనుభవించేది ఇమ్రాన్ ఖానే అవుతాడు కానీ షరీఫ్ కాదు. ఈ నేపథ్యంలోనే భారత్‌తో సంబంధాల విషయమై షరీఫ్ ఇటీవల చేసిన వ్యాఖ్యలకు రాజకీయంగా కొంత ప్రాధాన్యం ఏర్పడుతోంది. అలాగని షరీఫ్ గద్దెనెక్కగానే అంతా సమూలంగా మారిపోతుందని కూడా ఏమీ కాదు. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఇది ఎన్నికల సీజన్, అంతే!

మార్పులపై తీవ్రమైన అంచనాలు!

పాకిస్తాన్‌లో సాధారణ ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ ఏవో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటాయన్న అంచనాలైతే బలపడుతున్నాయి. దక్షిణాసియాలోని ఇతర ప్రాంతాల మాదిరిగానే పాక్‌లోనూ ఎన్నికల ప్రక్రియ మూడు దశల్లో పూర్తవుతుంది. ఇప్పుడున్న సాధారణ అంచనా ప్రకారం షరీఫ్ నేతృత్వంలోని పాకిస్తాన్ ముస్లిం లీగ్ (ఎన్) మెజారిటీ సాధిస్తుంది. షరీఫ్‌ను నాలుగోసారి ప్రధాని పీఠంపై కూర్చోబెట్టేందుకు రంగం సిద్ధమైందని కూడా చాలామంది అనుకుంటున్నారు. ఇమ్రాన్ ఖాన్ విషయానికి వస్తే జైల్లో ఉన్న ఈ మాజీ ప్రధానికి చెందిన పార్టీ ముక్కలు ముక్కలై ఉంది. పార్టీలో ఒకప్పుడు దిగ్గజాలుగా ఉన్నవారు ఇప్పుడు మాకేం సంబంధం లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. వీరు గతంలో ఇమ్రాన్ వైపు మొగ్గిన సందర్భంలోనూ మిలిటరీకి వ్యతిరేకంగా ఉండాల్సి వస్తుందని ఊహించి ఉండరు. వీరిని మినహాయిస్తే మిగిలిన మద్దతుదారులు అనేక రకాల ఒత్తిళ్లు ఎదుర్కొంటున్నారు. వీరిలో ఎందరు ఎన్నికల్లో పోటీకి దిగుతారన్నది కూడా అనుమానమే.

ఇంకోపక్క ఈ వాదనకు ప్రతివాదనలు రెండు వినిపిస్తున్నాయి. ఏవీ కొట్టిపారేసేవి కావు. అవేమిటంటే... ఇమ్రాన్ ఖాన్‌కు ఇప్పటికీ ప్రజల్లో ఆదరణ ఉందన్న అంశం మొదటిది. ఆయన ఆశీస్సులున్న నేతలు కచ్చితంగా ఎన్నికల్లో గెలుస్తారన్నది రెండో విషయం. నవాజ్ షరీఫ్ చరిత్రను తరచి చూస్తే అతడేమంత నమ్మదగ్గ వ్యక్తి కాదని ఆర్మీ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇవి చాలాకాలంగా ఉన్నవే.

గతంలో ఇమ్రాన్ ఖాన్‌కు చేసినట్లే ఇప్పుడు కూడా నవాజ్‌కు అడ్డంగా ఉన్న ప్రతిపక్షాలన్నింటినీ తొలగిస్తే గతానుభవాలు మళ్లీ ఎదురు కావన్న గ్యారెంటీ ఏమిటని ఆర్మీ వర్గాల్లో కొందరు సందేహిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే చాలామంది చెబుతున్నదేమిటంటే... వచ్చే ఎన్నికల్లో స్పష్టమైన మెజార్టీ రాదూ, హంగ్ ఏర్పడుతుందీ అని! తద్వారా పగ్గాలు ఆర్మీ ఆధీనంలోనే ఉంటాయని భావిస్తున్నారు. ఆసక్తికరమైన ఇంకో విషయం గురించి ఇక్కడ చెప్పుకోవాలి. ఈ రెండు వాదనలకు బలం చేకూరుతూండగానే... అసలు ఎన్నికలే జరగవన్న మూడో వాదన కూడా మొదలైంది. ఒకవేళ జరిగినా అవి ఫిబ్రవరిలో కాకుండా, బాగా జాప్యం తరువాతేనని అంటున్నారు.

అసలు విషయాలు వేరే...

ఇప్పటివరకూ చెప్పుకొన్న అంచనాలు ఎన్నికలు జరిగేంతవరకూ కొనసాగడం గ్యారెంటీ. కానీ వీటన్నింటికంటే అతి ముఖ్యమైన విషయం ఇంకోటి ఉంది. ఎన్నికల్లో విజయం సాధించిన పార్టీ ఎదుర్కోవాల్సిన సవాళ్లు ఇవి. దయనీయ స్థితిలో ఉన్న ఆర్థిక వ్యవస్థ వీటిల్లో ఒకటైతే, అంతర్గత భద్రత రెండోది. అఫ్గానిస్తాన్‌లో ఉద్రిక్తతలు మళ్లీ పెరుగుతూండటం కూడా పాక్‌కు ఒక సవాలే. వచ్చే ఏడాది పాక్ భవిష్యత్తును నిర్ణయించేవి ఈ మూడు అంశాలే అన్నా అతిశయోక్తి లేదు.

నవాజ్ షరీఫ్ ప్రకటనల్లో భారత్ ప్రస్తావన తరచూ వస్తోంది. పైగా ఈ వ్యాఖ్యలు రెచ్చగొట్టేవి కావు. సానుకూలంగా ఉన్నవే. భారత్‌తో కనీస స్థాయి సంబంధాలు కలిగి ఉండాలన్న వాదన వినిపించే భారమిప్పుడు ఈయనే మోస్తున్నారని చెప్పాలి. ఇది షరీఫ్ బలమని కొందరి నమ్మకం. కొందరు బలహీనతగానూ చూస్తున్నారు. ఈ చర్చలో మనమూ భాగస్వాములం కాగలమా? ఎన్నికల ఫలితాల తరువాత కానీ అర్థం కాదు. భారత్, పాక్ సంబంధాలిప్పుడు కీలక దశలో ఉన్నాయని మాత్రం చెప్పవచ్చు. ఈసారి ఉగ్రవాదం, కశ్మీర్, వ్యూహాత్మకంగా ఇరుదేశాల మధ్య ఉన్న అపనమ్మకం వంటివి మునుపటిలాగానే సమస్యను పీటముడి స్థాయికి తీసుకొచ్చాయి. ఇరువైపుల నుంచి చొరవ, చేతలు రెండూ ఉంటేగానీ ఈ పీటముడి విడిపడదు. ఒక్కటైతే నిజం. ఈ పీటముడి పూర్తిగా విడిపోకపోయినా, కనీసం కొంత వదులుగానైతే తప్పకుండా మారాలి. ఈ దిశగా భారత దేశమే చొరవ తీసుకోవాల్సి ఉంటుంది. ఇచ్చిపుచ్చుకునే ధోరణి కనపరచాలి. దక్షిణాసియా రాజకీయాల్లో, భారత పాకిస్తాన్ చరిత్రలోనూ ఇదేమీ తెలియని అంశమైతే కాదు.

వ్యాసకర్త పాకిస్తాన్‌లో భారత మాజీ హై కమిషనర్
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

బాలీవుడ్‌లో అంతే!



ఒక సినిమా ప్రమోషన్‌లో భాగంగా మార్కెటింగ్ షూట్‌కు వెళ్లాను. కెమెరాలు రోల్ కావడానికి పది నిమిషాల ముందు నటుడి (వారసుడు) మేనేజర్ పరుగెత్తుకొచ్చాడు: 'కొంచెం స్క్రిప్టులో ఎక్కువ ఇంగ్లిష్ ఉండేట్టు మార్చరా? సర్‌కు హిందీ రాదు.' ఇంతకీ మేము చేస్తున్నది హిందీ సినిమా.

– హార్దిక్ రాజ్‌గోర్, రచయిత

ప్రాణాలు చవకా?



ఇజ్రాయెల్ కోసం చవగ్గా కార్మికులను రిక్రూట్ చేస్తోంది ప్రభుత్వం. పాలస్తీనియన్లను చంపడం వల్ల ఈ కొరత ఏర్పడింది. జనం పోయి చావాలని వాళ్లు కోరుకుంటున్నారు. కానీ ఉద్యోగం ఇస్తున్న క్రెడిట్ కావాలి. ఇది దారుణం. సిగ్గుచేటు.

– షాహిద్ సిద్దిఖీ, ఆర్‌ఎల్‌డీ నేత

వాళ్లేం చేయలేదు



నేను ఒక కుర్దును అయినప్పటికీ ఇజ్రాయిల్‌కు ఎందుకు మద్దతిస్తాను? 1920ల నుంచి అరబ్బులు చంపిన కుర్దుల సంఖ్య: 3 లక్షలు. తుర్కులు చంపిన కుర్దుల సంఖ్య: 15 లక్షలు. పర్షియన్లు చంపిన కుర్దుల సంఖ్య: లక్ష. యూదులు చంపిన కుర్దుల సంఖ్య: 0.

– హివ్మాద్ ముస్తఫా, పరిశోధకుడు

లింగ న్యాయం



భర్త కంటే పది నిమిషాలు ఆలస్యంగా నిద్రలేస్తే, దాదాపు మధ్యాహ్నం లేచినట్టే. పైగా 'లేట్ లతీఫ్' అన్న పేరు! అదే భర్త గంటలు వెనక లేచినా, అది ఎలా జరిగిందో ఆయనకు తెలీదు; ఏమో అలసిపోయి ఉండొచ్చు. అదే చట్టం.

– హనా మొహిసిన్ ఖాన్, పైలట్

అంతటా వాళ్లే!



మీరు ఏ కొత్త ప్రదేశానికి వెళ్లినా అక్కడి స్థానిక భాషను నేర్చుకోండి: నేను సౌదీ అరేబియాలో ఉన్నప్పుడు స్థానిక భాష అయిన మలయాళం నేర్చుకున్నట్టుగానే.

– అహ్మద్ షరీఫ్, కమెడియన్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్ బాక్స్

సోషలిస్టు ఆధునికీకరణ బాటలో...

చైనా దేశం ఆర్థిక సంస్కరణలను, 'ఓపెన్ డోర్ పాలసీ'ని చేపట్టి నేటికి 45 సంవత్సరాలు పూర్తయ్యింది. 1978 డిసెంబరు 18న కామ్రేడ్ డెంగ్ జియావో పింగ్ నాయకత్వంలోని చైనా కమ్యూనిస్టు పార్టీ 11వ కేంద్ర కమిటీ 3వ ప్లీనరీ ఈ విధానాన్ని చేపట్టింది. ఈ 45 ఏళ్ళలో చైనా ఎన్నో సవాళ్ళను, కష్టాలను ఎదుర్కొని నేడు అన్ని రంగాలలో అనూహ్యమైన అభివృద్ధిని సాధించి పేద వ్యవసాయక దేశాన్ని నూతన అంతర్జాతీయ శక్తిగా మార్చివేసింది. 1978లో చైనా జీడీపీ 149.54 బిలియన్ డాలర్లు (ప్రపంచ జీడీపీలో 1.75 శాతం) కాగా 2022 నాటికి 18 ట్రిలియన్ డాలర్ల (ప్రపంచ జీడీపీలో 18.6 శాతం)కు చేరింది. ఈ 45 ఏళ్ళలో దేశంలోని 800 మిలియన్ల ప్రజలను (80 కోట్లు) కటిక దారిద్ర్యం నుంచి బయటపడవేసింది. ఈ గణాంకాలన్నీ ప్రపంచ బ్యాంకు తెలిపినవే.

ఈ కాలంలో చైనా ప్రజల జీవన ప్రమాణాలు గణనీయంగా పెరిగాయి. 1978లో చైనాలోని పట్టణ ప్రాంత తలసరి ఆదాయం కేవలం 343 యువాన్లు కాగా 2022లోఅది 36,883 యువాన్లు. 2012 నుంచి చైనా ప్రపంచంలోనే రెండవ పెద్ద ఆర్థిక శక్తిగా, ప్రపంచంలోనే అతిపెద్ద ఉత్పత్తి శక్తిగా, అతిపెద్ద ట్రేడర్‌గా కొనసాగుతున్నది. అనేక రంగాలలో ముఖ్యంగా ఫార్చ్యూన్ 500 కంపెనీలలో, 5జీ స్టేషన్ల సంఖ్యలో, బ్రాడ్ బాండ్ యూజర్ల సంఖ్యలో, హైస్పీడ్ రైల్వేల, హైవేల పొడవులో నేడు చైనా ముందంజలో వుంది.


చైనా సాధిస్తున్న ఈ అద్భుత పురోగతి అంతర్జాతీయ అభివృద్ధికి కూడా చాలా ఎక్కువగా తోడ్పడుతున్నది. చైనా ఆధునికీకరణ అమెరికా, పశ్చిమదేశాల వాటికంటే విభిన్నమైనది. ఇతరులకు హాని జరుగకుండా, యుద్ధాలు చేయకుండా, ప్రజలను దోపిడీ చేయకుండా... అంటే వలసవాద, సామ్రాజ్యవాద విధానాలకు పూర్తిగా భిన్నమైన విధానాలను అనుసరించి చైనా ఈ ప్రగతిని సాధించింది. చైనా దేశ అభివృద్ధి ప్రజలందరి ఉమ్మడి సౌభాగ్యానికి ఉద్దేశించబడినది. అమెరికా, పశ్చిమ దేశాల అభివృద్ధి ఇందుకు పూర్తిగా భిన్నంగా వ్యక్తిగత ఆస్తికి ప్రాముఖ్యతనిస్తూ అసమాన సంపద పంపిణీతో ధనిక, పేదల మధ్య అంతరాన్ని పెంచేదిగానూ, సమాజంలో అసమానతలను సృష్టించేదిగానూ ఉంటుంది.

అంతేగాక చైనా అభివృద్ధి 140 కోట్లు గల అత్యధిక జనాభాకు సంబంధించినది. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన అన్నిదేశాల జనాభాకంటె ఎక్కువ జనాభాకలిగి వున్న చైనాదేశం అభివృద్ధి అంతర్జాతీయ అభివృద్ధి రూపురేఖలను పూర్తిగా మార్చివేయగలిగింది. ఒక్కమాటలో చెప్పాలంటే చైనా అభివృద్ధి శాంతియుత అభివృద్ధిగా వుంటూ, ప్రపంచానికి అనేక అవకాశాలు కల్పించే అందరి ప్రజల ప్రయోజనాలకు అనుగుణ్యమైనది. ఈ విధంగా చైనా సోషలిస్టు ఆధునీకీకరణ మార్గంలో అప్రతిహతంగా ముందుకుపోతుంటే చైనా ఆర్థికవ్యవస్థ కుప్పకూలుతుందనీ, సోవియట్ రష్యా మాదిరిగా విఫలమవుతుందనీ... ఈ 45 ఏండ్లలో పశ్చిమదేశాల ఆర్థికవేత్తలు కొందరు అనేక విధాలుగా దుష్ప్రచారం సాగించారు. ఈ 'ఆర్థిక'వేత్తల చైనా 'విఫల' సిద్ధాంతాలన్నీ ఇంతకాలం ఘోరంగా విఫలమయ్యాయి.

– సి. భాస్కర్, యూసీసీఆర్ఐ (ఎం–ఎల్)
(చైనా సంస్కరణలకు 45 ఏళ్లు)

గుణాత్మక మార్పులే రక్ష

అభిప్రాయం



డా॥ కాలువ మల్లయ్య

సామాజిక, ఆర్థిక అంతరాలకు అతీతంగా 18 సంవత్సరాలు నిండినవారికి ఓటు హక్కుందీ దేశంలో. ఓటు అనేది ప్రజల చేతుల్లో ఉన్న బలమైన సాధనం. ఓటుతో ప్రజలు తమ ఇష్టమున్న వ్యక్తిని, పార్టీని అధికారంలోకి తీసుకురావచ్చనేది వాస్తవం. కాని ప్రజలను భ్రమల్లో ముంచి, వాగ్దానాల జడివానలో తడిపి అధికారంలోకి వచ్చిన నాయకులూ మనకున్నారు. గెలిచిన తర్వాత వాగ్దానాల విషయాన్ని గాలికొదిలి కాలం గడిపిన చంద్రబాబు లాంటి వారున్నారు. ఇచ్చిన వాగ్దానాలను అమలు పరచడమే లక్ష్యంగా పాలన సాగించిన, సాగిస్తున్న వైఎస్ రాజశేఖర రెడ్డి, జగన్ లాంటివారూ ఉన్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను తొమ్మిదేళ్ళు, విభజిత ఆంధ్రప్రదేశ్‌ను ఐదేళ్ళు పాలించిన నాయకుడు మీడియాను ఉపయోగించుకొని ప్రచారార్భాటం చేయడం తప్ప తెలుగు రాష్ట్రాలకు చేసిందేమీ లేదు. ఏ మౌలిక మార్పుకూ శ్రీకారం చుట్టిందీ లేదు. ముఖ్యమంత్రిగా జగన్ మోహన్ రెడ్డి విద్య, వైద్యం, సేద్యం, సామాజిక న్యాయరంగాలలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి సుపరిపాలన నందించారు. అందిస్తున్నారు.

పవన్‌కల్యాణ్ ఒకచోట బీజేపీతో, మరో చోట తెలుగుదేశంతో అనైతిక, అవకాశవాద పొత్తులు పెట్టుకోవడం... గొంతుచించుకుని అరిస్తే గెలుస్తామనుకోవడం అత్యాశే అవుతుంది. ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేయడం, ప్రభుత్వ సంస్థలను మూసివేయడం, విద్య, వైద్యం, న్యాయాది సర్వ వ్యవస్థలను అస్మదీయ ప్రైవేట్ వ్యక్తులకు అప్పచెప్పడం, బలహీనవర్గాలపై ఆధిపత్యం ... ఇవీ చంద్రబాబు చేసింది. ఇక ఆయన చేయబోయేదీ ఏమీ లేదు. అటువంటి బాబు ప్రజలను రెచ్చగొట్టి ప్రభుత్వ వ్యతిరేక ఓట్లతో గెలువాలనుకోవడం అత్యాశే అవుతుంది. రాజశేఖర్‌రెడ్డి పాలనలో కంటె కూడా ఎక్కువ సంక్షేమ పథకాలు అమలు జరపడమే కాకుండా ఆంధ్రప్రదేశ్‌లో గుణాత్మక మార్పులు తీసుకొచ్చే అనేక చర్యలు చేపట్టారు జగన్. అందులో అతిముఖ్యంగా



చెప్పుకోదగింది ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేయడం. ప్రైవేటీకరణను గణనీయంగా తగ్గించడం. ప్రభుత్వరంగం బలోపేతమైతే ఆ ఫలాలు ప్రజలకు దక్కుతాయి. కానీ ప్రైవేట్ రంగం వల్ల ఎవరికి లాభం? అటు బీజేపీ ఇటు టీడీపీ ప్రైవేట్ రంగాన్ని బిగియారా కౌగిలించుకున్నవే. విద్య, వైద్యం తదితర విషయాలన్నిటినీ కార్పొరేట్ శక్తుల కప్పగించి ప్రజలను వీటికి దూరం చేసింది టీడీపీ. ప్రభుత్వ పాఠశాలలను, కళాశాలలను, విశ్వవిద్యాలయాలను బలోపేతం చేసి పేదలకు ఖరీదైనదిగా మారిన విద్యను అందరికీ అందిస్తున్నారు జగన్. ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు అడ్మిషన్లు దొరకడం కష్టమవుతుందంటే అంతకంటే కావాల్సిందేముంది! ఇది జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన అతిగొప్ప గుణాత్మక మార్పు.


ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మాధ్యమం ప్రవేశపెట్టి నాణ్యమైన విద్యనందిస్తూ బహుజనుల చిరకాల చదువు స్వప్నాన్ని సాకారం చేశారు జగన్. ప్రభుత్వ ఆసుపత్రులను అన్ని వసతులు గలవిగా మార్చడం, మెడికల్ కాలేజీలు పెంచడం, ఆరోగ్యశ్రీని అనేక జబ్బులకు వర్తింపజేయడం విప్లవాత్మక చర్యే. ప్రతి పేదా ఆరోగ్యశ్రీతో ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్య సౌకర్యం పొందుతున్నాడు. వ్యవసాయ రంగంలోనూ గణనీయమైన మార్పులు చేసి చంద్రబాబు దండగన్న వ్యవసాయాన్ని పండుగ చేశారు.

సామాజిక న్యాయానికి దూరంగా బతుకుతున్న దళిత, బహుజనులకు అధికారంలోనూ, పథకాల కేటాయింపులోనూ తగిన వాటా ఇస్తున్నారు జగన్. అంతేకాదు, ఏపీలో మూడు ప్రాంతాల అభివృద్ధిలో ఉన్న అంతరాలను తగ్గించడానికి మూడు రాజధానుల ప్రతిపాదన చేశారు. ఒక పార్టీలో గెలిచిన వారు తమ పార్టీలోకి రావాలంటే గెలిచిన పదవికి రాజీనామా చేయాలని నియమం విధించారు. దాన్ని పాటిస్తూ నైతిక రాజకీయాలకు నూతన ఒరవడి దిద్దారు. ఇలా విద్య, వైద్యం, సేద్యం, సామాజిక న్యాయరంగాలలో గుణాత్మక మార్పులు వచ్చే విధంగా ఆంధ్రప్రదేశ్‌లో కమిట్‌మెంట్ రాజకీయాలను నడుపుతున్న జగన్ అజేయుడు.

వ్యాసకర్త ప్రముఖ కథా రచయిత
మొబైల్: 91829 18567

సమత్వానికి సజీవరూపం

తమిళనాడులోని తిరుచ్చుళి గ్రామంలో 1879 డిసెంబర్ 30న జన్మించారు రమణ మహర్షి (వెంకట్రామన్). పదహారేళ్ల వయసులోనే మోక్షజ్ఞానము పొంది తిరువణ్ణామలై లోని అరుణాచల పర్వతాలపై స్థిరపడ్డారు. ఆయన తనను తాను'అతియాశ్రమి'గా ప్రకటించుకున్నారు. 'మౌనము' లేదా 'మౌన ముద్ర' లోనే ఎక్కువగా బోధించేవారు. తన మౌనముతో సందేశం పొందలేని వారికి మాత్రమే మాటల ద్వారా మార్గం చూపేవారు. ఆత్మజ్ఞానం పొందేందుకు 'నేనెవడను'? అనే ప్రశ్నతో చేసే విచారణ అతి ముఖ్యమని వారు బోధించేవారు. 'జ్ఞానికి ముఖ్యమైన గుర్తు సమత్వం అనీ, సమత్వం జ్ఞానమునకు మొదలు, చివర కూడా' అని బోధించేవారు.



ఆయన వద్దకు అన్ని కులాల ప్రజలు వచ్చేవారు. తను ఏనాడూ కుల స్పృహతో జీవించలేదు. ఆశ్రమంలో కులం, వర్ణం, మతం, దేశం– పేరిట భేద భావాలకు తావు లేదు. ఆశ్రమంలో ఎవరి ప్రవేశానికి నిషేధం లేదు. సకల జీవులు ఆత్మ స్వరూపులే అని మహర్షి బోధించేవారు. తక్కువ కులం వాడినని దూరదూరంగా ఉంటున్న నిమ్న కులస్థుని ఒక రోజు ఆశ్రమంలోకి స్వాగతించి, ఆత్మన్యూనత తొలగించారు. 'శివ శివ' అనమని.. 'నీకు మంత్రోపదేశం అయ్యింది' అని అతడ్ని ఉద్ధరించిన రమణ మహర్షి సమతాజ్ఞానం అజరామరం.

వారి కరుణ, ప్రేమ మానవులకే పరిమితం కాలేదు. కోతులు, కుక్కలు, పక్షులు, ఆవులు, నెమళ్ళు, ఉడతలు, పాములు– ఇలా అన్నీ ఆశ్రమ వాసులే. అన్ని రమణ మహర్షికి ఆత్మీయములే. అందుకే కావ్యకంఠ గణపతి మహాముని 'శ్రీ రమణ మహిమానుకీర్తనం' అనే స్తోత్రంలో 'బెదురుల యందును భీరుల యందును, / జడమతుల యందును దుష్టాత్ముల యందు, /... సమదృష్టి కలిగిన సచ్చరితుండు / సమబుద్ధి సమవర్తి సద్వ్రతధారి' అని అభివర్ణించారు.

'శ్రీ రమణ మహర్షి చూపించినంతటి సమత్వాన్ని ఇప్పటిదాకా ఈ భూమండలం మీద అవతరించిన ఏ రుషీ చూపలేదు' అంటారు వినోబా భావే. 'శ్రీ రమణ గీత'లో సంఘ విద్య అనే అధ్యాయంలో రమణులు 'వ్యక్తులు సమాజమునకు అవయముల వంటి వారు. సమాజ శ్రేయస్సుకై పాటుబడే వ్యక్తులు ఉన్నతిని పొందుతారు. వ్యక్తియొక్క మనఃశుద్ధి కొరకు శాంతి, సమాజాభివృద్ధి కొరకు శక్తి కావాలి. సంఘ జీవితంలో సమత్వము, సౌభ్రాత్రము నెలకొల్పి అనగా అందరు అన్యోన్యముగా సోదర భావముతో జీవిస్తే... వసుధైక కుటుంబ భావన వెల్లి విరుస్తుంది' అని పేర్కొన్నారు.

1950 ఏప్రిల్ 14న తన దేహాన్ని విడిచిపెట్టారు. ఆయన బోధనల సారాన్ని ఆచరణలోకి తీసుకొచ్చి సమతాయుక్త సమాజాన్ని నిర్మిద్దాం.

– భారతి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, తిథి: బ.తదియ ఉ.8.18 వరకు, తదుపరి చవితి, నక్షత్రం: ఆశ్లేష తె.4.43 వరకు (తెల్లవారితే ఆదివారం), తదుపరి మఖ, వర్జ్యం: సా.4.28 నుండి 6.12 వరకు, దుర్ముహూర్తం: ఉ.6.29 నుండి 8.02 వరకు, అమృతఘడియలు: రా.3.37 నుండి 4.46 వరకు; రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు, యమగండం: మ.1.30 నుండి 3.00 వరకు, సూర్యోదయం: 6.34, సూర్యాస్తమయం: 5.32.

కోడెల శివరామ్ వేధింపులతోనే మా బిడ్డ ఆత్మహత్య

- కొద్ది రోజులుగా కోడెల అనుచరుడు నాయక్ మా బిడ్డను వేధించాడు
- దీంతో మనస్తాపంతో ఆత్మహత్య
- మృతుడి తల్లి ఆవేదన


ఆత్మహత్యకు పాల్పడిన ఫణీంద్రసాయి


మృతుడి తల్లి నాగమణి

పట్నంబజారు: కోడెల శివరామ్ వేధింపులు భరించలేకే తమ బిడ్డ ఆత్మహత్య చేసుకున్నాడంటూ గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం పేరేచర్లకు చెందిన మృతుడి తల్లి విలపిస్తున్నారు. మేడికొండూరు పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పేరేచర్లకు చెందిన కొల్లోజు ఫణీంద్రసాయి(22) నాలుగేళ్ల కిందట గుంటూరు నాజ్‌సెంటర్ డీమార్ట్‌లో గేట్ ఇన్‌చార్జిగా పనిలో చేరి సూపర్‌వైజర్‌గా ఎదిగాడు. కోడెల శివరామ్‌కు సంబంధించి వ్యక్తిగత పనులు కూడా చూస్తుండేవాడు. నగదుకు సంబంధించిన లావాదేవీలతో పాటు గుంటూరు, విజయవాడ ప్రాంతాల్లోని కన్‌స్ట్రక్షన్‌లకు చెందినవి కూడా చూస్తుంటాడు. కొంతకాలం కిందట ఆరోగ్యం సరిగా లేకపోవడంతో సెల్ స్విచ్ఛాఫ్ చేసి విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో కంపెనీకి సంబంధించిన డబ్బులు తీసుకుని వెళ్లిపోయాడంటూ కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో డీమార్ట్ నిర్వాహకులు ఫిర్యాదు చేశారు. ఆరోగ్యం కుదుటపడ్డాకవచ్చిన ఫణీంద్రసాయి.. రూ.2 లక్షలను తిరిగి ఇచ్చారని సాటి ఉద్యోగులు చెబుతున్నారు. అనంతరం పలు కారణాల రీత్యా ఫణీంద్ర అక్కడ ఉద్యోగం మానేశాడు. కొద్ది రోజుల తర్వాత యాజమాన్యం పిలిపించి తిరిగి ఉద్యోగంలో పెట్టుకుంది. ఈ నెల ప్రారంభంలో తిరిగి అనారోగ్యం తిరగబెట్టడంతో చికిత్స పొంది.. ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో కోడెల శివరామ్ అనుచరుడైన నాయక్ నాలుగు రోజులుగా ఇంటికి వచ్చి ఫణీంద్రను భయభ్రాంతులకు గురిచేయడం ప్రారంభించాడు. ఉద్యోగానికి రావాలని లేకుంటే సార్ ఊరుకోరని వేధిస్తున్నాడు. ఈ క్రమంలో ఫణీంద్ర గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. కోడెల శివరామ్, నాయక్‌లు అకారణంగా వేధింపులకు గురిచేయడంతోనే తమ బిడ్డ మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని తల్లి కొల్లోజు నాగమణి ఆరోపిస్తున్నారు. నిత్యం నాయక్ వచ్చి, కోడెల శివరామ్ పేరు చెప్పి బెదిరింపులకు పాల్పడే వాడంటూ ఆమె విలపించారు. తన కుమారుడి మృతికి కారణమైన కోడెల శివరామ్, అతని అనుచరుడు నాయక్‌లపై చర్యలు తీసుకోవాలని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు చెప్పారు.

స్టూడెంట్ నం.1

జైలు నుంచే చదువు.. పీజీ గోల్డ్ మెడల్ కైవశం

- హత్య కేసులో యావజ్జీవ కారాగారం.. కడప జైలులో శిక్ష
- బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో పీజీ
- ఎంఏ సోషియాలజీలో తెలుగు రాష్ట్రాల్లో మొదటి ర్యాంకు
- నంద్యాల జిల్లా యువకుడు మహమ్మద్ రఫీ ఘనత
- 4 రోజుల బెయిల్‌పై హైదరాబాద్‌కు..
- గోల్డ్ మెడల్‌తో సత్కరించిన యూనివర్సిటీ అధికారులు



అంబేద్కర్ యూనివర్సిటీలో గోల్డ్‌మెడల్ అందుకుంటున్న మహమ్మద్ రఫీ

కోవెలకుంట్ల: జైలు శిక్షపడిన యువ ఖైదీ అక్కడి అధికారుల సహకారం, పట్టుదలతో లా కోర్సు చదివి న్యాయవాద పట్టాతో తన తండ్రిని నిర్దోషిగా నిరూపించేందుకు న్యాయస్థానంలో వాదించి గెలిచిన ఘటనను 20 ఏళ్ల క్రితం స్టూడెంట్ నంబర్ -1 సినిమాలో చూశాం. అదే తరహాలో యావజ్జీవ కారాగార శిక్షపడిన ఓ యువకుడు నిజ జీవితంలో విజయం సాధించి రియల్ హీరోగా పేరు తెచ్చుకున్నాడు. నంద్యాల జిల్లా సంజామల మండలం పేరుసోముల గ్రామానికి చెందిన దూదేకుల నడిపి మాబుసా, మాబున్నీ కుమారుడు మహమ్మద్ రఫీ 2014లో బీటెక్ చదివేవాడు. ఆ సమయంలో ప్రేమ వ్యవహారంలో ఇదే గ్రామానికి చెందిన ఓ యువతి హత్యకు కారకుడని భావించి ఆ యువకుడిపై పోలీస్‌స్టేషన్‌లో హత్యకేసు నమోదైంది. కోర్టులో విచారణ అనంతరం 2019 జూలై నెలలో రఫీకి జీవితఖైదు విధించారు. అప్పటి నుంచి కడప కేంద్ర కారాగారంలో జైలు శిక్ష అనుభవిస్తున్నాడు. ఖైదీలను సైతం అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో అక్కడి జైలు అధికారులు చదువుపై ఆసక్తి ఉన్న వారిని గుర్తించారు. పది చదివిన వారిని దూర విద్య కోర్సుల ద్వారా పై చదువులకు ప్రోత్సహించారు. శిక్షపడే నాటికే డిగ్రీ పూర్తి చేసిన మహమ్మద్ రఫీకి చదువుపై ఉన్న మక్కువను గుర్తించి అప్పటి జైలు సూపరింటెండెంట్ ప్రకాశ్, ఇతర జైలు అధికారులు ప్రోత్సాహమందించారు. 2020లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో పీజీ చేసేందుకు అవకాశం కల్పించారు.

తెలుగు రాష్ట్రాల్లో మొదటి ర్యాంకు

మహమ్మద్ రఫీ ఎంఏ సోషియాలజీలో అడ్మిషన్ పొందాడు. వివిధ రకాల పుస్తకాలు, స్టడీ మెటీరియల్‌ను సమకూర్చుకుని జైలులోనే నాలుగు గోడల మధ్య కష్టపడి చదివాడు. కోర్టు ఆదేశాల మేరకు జైలు అధికారులు 2022లో పరీక్షలకు అనుమతి ఇచ్చారు. అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకుని యూనివర్సిటీ పరిధిలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించి ఎంఏ సోషియాలజీలో మొదటి ర్యాంకుతో గోల్డ్ మెడల్ కైవశం చేసుకున్నాడు. జైలులో ఉంటున్న రఫీకి పీజీ పట్టా గోల్డ్ మెడల్ ప్రదానం చేయాలని యూనివర్సిటీ అధికారులు ఇటీవల జైలు అధికారులకు సమాచారం అందించారు. కోర్టు అనుమతితో నాలుగు రోజులు బెయిల్ మంజూరు కావడంతో గురువారం హైదరాబాద్‌లోని అంబేద్కర్ యూనివర్సిటీలో వైస్ చాన్సలర్ జగదీశ్ ఆధ్వర్యంలో గోల్డ్‌మెడల్ బహూకరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ తన జీవితం జైలు పాలైనప్పటికీ చదువుపై ఉన్న మమకారంతో పట్టుదలతో పీజీ సాధించానన్నారు. తన తల్లిదండ్రులకు ఈ గోల్డ్‌మెడల్ అంకితం చేస్తున్నట్లు తెలిపారు.

సత్యదేవుని దర్శించిన హైకోర్టు న్యాయమూర్తి


సత్యదేవుని సన్నిధిలో జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు

అన్నవరం: కాకినాడ జిల్లా అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు కుటుంబ సభ్యులతో కలసి శుక్రవారం దర్శించుకున్నారు. తొలుత ఆలయం వద్ద వారికి పండితులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం పండితులు వేద ఆశీర్వచనం చేయగా, స్వామివారి ప్రసాదాలను ఆలయ ఏఈవో పాలంకి జగ్గారావు అందజేశారు.

కొలికపూడి, టీవీ5 సాంబశివరావుపై కేసు నమోదు చేయాలి

వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం డిమాండ్

తాడేపల్లిరూరల్: టీవీ షోలో ఇష్టమొచ్చినట్లు రెచ్చిపోయి ఆర్జీవీని చంపేందుకు సుపారీ ఇస్తామన్న కొలికపూడి శ్రీనివాసరావుపై, ఆ డిబేట్ నిర్వహించిన టీవీ-5 సాంబశివరావుపై వెంటనే కేసు నమోదు చేయాలని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జేఏసీ విభాగం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఈ మేరకు ఫిర్యాదు చేశారు. విద్యార్థి సంఘం నాయకులు సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. రామ్‌గోపాల్ వర్మ తల నరికి తెచ్చిన వారికి రూ. కోటి ఇస్తానని కొలికపూడి చెప్పడాన్ని ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఖండించాలని కోరారు. విద్యార్థి సంఘం నాయకులు ఫణికుమార్, సంతోష్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

కులవాదులను తరిమికొట్టడమే లక్ష్యం

1,188వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



తాడికొండ: వేళ్లూనుకుపోయిన కుల వ్యవస్థను కాపాడుకుంటూ మనుగడ సాగిస్తున్న బాబు, పవన్ కళ్యాణ్ అండ్‌కో కులవాదులను రాష్ట్రంనుంచి తరిమికొడతామని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హెచ్చరించారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శుక్రవారం నాటికి 1,188వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడుతూ.. స్వార్థ రాజకీయాలకు అలవాటు పడిన గత పాలకులు పేదలకు రాజ్యాంగబద్ధంగా అందాల్సిన ఫలాలను దొడ్డిదారిలో దోచేస్తూ తమ ప్రయోజనాలకు గండికొట్టారన్నారు. రాష్ట్రంలో రాజకీయ దొంగలు పడ్డారని, రాష్ట్రంలో సంచరిస్తూ అలవికాని హామీలతో మోసగించేందుకు చేస్తున్న ప్రయత్నాలు సాగనిచ్చేది లేదని హెచ్చరించారు నాయకులు ఈపూరి ఆదాం, పులిదాసు, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

రూ.418 కోట్లతో 'అచ్యుతం, శ్రీపథం'

- తిరుపతిలో 2 వసతి సముదాయాలకు ఈవోతో కలిసి శంకుస్థాపన చేసిన టీటీడీ చైర్మన్
- సామాన్య భక్తులకు సౌకర్యాలకే ప్రాధాన్యం: భూమన


అచ్యుతం, శ్రీపథం నిర్మాణ శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్ కరుణాకరరెడ్డి

తిరుపతి (అలిపిరి): తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు తిరుపతిలో మరింత సౌకర్యవంతంగా వసతి కల్పించేందుకు అచ్యుతం, శ్రీపథం వసతి సముదాయాలు నిర్మిస్తున్నట్లు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి చెప్పారు. తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి (రెండు), శ్రీ కోదండరామ స్వామి (మూడు) సత్రాల స్థానంలో అచ్యుతం, శ్రీపథం వసతి సముదాయాల నిర్మాణానికి ఆయన ఈవో ఎ.వి.ధర్మారెడ్డితో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ సామాన్య భక్తులకు ప్రాధాన్యం ఇస్తూ ఎలాంటి అసౌకర్యం కలగకుండా శ్రీవారి దర్శనం, అన్నప్రసాదం, బస తదితర సౌకర్యాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. భక్తులకు మరింత మెరుగ్గా బస కల్పించడంలో భాగంగా తిరుమల, తిరుపతిలో ఉన్న విశ్రాంతి గృహాల్లో అవసరమైన వాటిని ఆధునికీకరిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా తిరుపతిలో దాదాపు 70 సంవత్సరాల కిందట నిర్మించిన శ్రీగోవిందరాజస్వామి సత్రం (రెండోసత్రం) స్థానంలో రూ.209 కోట్లతో అచ్యుతం వసతి సముదాయం, శ్రీకోదండరామ స్వామి సత్రం (మూడోసత్రం) స్థానంలో రూ.209 కోట్లతో శ్రీపథం వసతి సముదాయం నిర్మిస్తున్నట్లు వివరించారు. ఒక్కో బ్లాకులో 4,100 మంది చొప్పున మొత్తం 8,200 మంది భక్తులు ఇక్కడ బసచేసే అవకాశముందన్నారు. ఇందులో 200కు పైగా కార్లు, ద్విచక్రవాహనాల పార్కింగ్‌కు అవకాశం ఉందని చెప్పారు. ఒక్కో వసతి సముదాయాన్ని 7.04 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఎనిమిది అంతస్తులతో నిర్మిస్తామన్నారు. మొదటి ఫ్లోర్‌లో రిసెప్షన్, ఎస్ఎస్‌డీ టోకెన్ కౌంటర్లు, స్టోర్ రూమ్ ఉంటాయని వివరించారు. రెండు, మూడు అంతస్తుల్లో అన్నప్రసాదం హాలు, 500 మంది యాత్రికులు బసచేసేందుకు వీలుగా 23 డార్మిటరీ హాళ్లు, జనరల్ టాయిలెట్లు నిర్మిస్తామన్నారు. నాలుగు నుంచి ఎనిమిదో అంతస్తు వరకు మొత్తం 540 గదులు ఉంటాయని వివరించారు. మూడేళ్లలో వీటి నిర్మాణం పూర్తవుతుందని ఆయన చెప్పారు.

ఆవిష్కరణల ఏడాది



- ఎప్పటికీ గుర్తుండిపోనున్న 2023
- కీలక ఆవిష్కరణలు, ఘనతలు
- అనూహ్య శాస్త్ర, సాంకేతిక ప్రగతి
- ప్రాకృతిక ఉత్పాతాల్లోనూ రికార్డే

అంతరిక్ష అన్వేషణ నుంచి ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ దాకా, గ్లోబల్ వార్మింగ్ నుంచి పలు మానవ వికాసపు మూలాల దాకా శాస్త్ర సాంకేతిక రంగాల్లో 2023లో పలు నూతన ఆవిష్కరణలు చోటుచేసుకున్నాయి. ప్రపంచం దృష్టిని తమవైపుకు తిప్పుకోవడమే గాక భవిష్యత్తుపై కొంగొత్త ఆశలు కూడా కల్పించాయి. వినాశ హేతువైన గ్లోబల్ వార్మింగ్‌లో కొత్త రికార్డులకూ ఈ ఏడాది వేదికైంది! 2023లో టాప్ 10 శాస్త్ర సాంకేతిక, పర్యావరణ పరిణామాలను ఓసారి చూస్తే...

- సాక్షి, నేషనల్ డెస్క్

1. చంద్రయాన్



దశాబ్దాల కృషి అనంతరం భారత్ ఎట్టకేలకు చందమామను చేరింది. తద్వారా చంద్రయాన్-3 ప్రయోగం చరిత్ర సృష్టించింది. పైగా ఇప్పటిదాకా ఏ దేశమూ దిగని విధంగా చంద్రుని దక్షిణ ధ్రువం వైపు చీకటి ఉపరితలంపై దిగిన రికార్డును కూడా చంద్రయాన్-3 సొంతంచేసుకుంది. ఇంతటి ప్రయోగాన్ని ఇస్రో కేవలం 7.5 కోట్ల డాలర్ల వ్యయంతో దిగ్విజయంగా నిర్వహించడం ప్రపంచాన్ని అబ్బురపరిచిందనే చెప్పాలి. చంద్రుని ఉపరితలంపై సల్ఫర్ జాడలున్నట్టు చంద్రయాన్-3 ప్రయోగం ధ్రువీకరించింది. రెండు వారాల పాటు చురుగ్గా పని చేసి దాన్ని ప్రయోగించిన లక్ష్యాన్ని నెరవేర్చింది.

2. కృత్రిమ మేధ



ఈ రంగంలో కీలక ప్రగతికి 2023 వేదికైంది. 2022 చివర్లో ఓపెన్ఏఐ విడుదల చేసిన ఏఐ చాట్‌బాట్ చాట్‌జీపీటీ ఈ ఏడాది అక్షరాలా సంచలనమే సృష్టించింది. ఆకాశమే హద్దుగా అన్ని రంగాల్లోకి చొచ్చుకుపోయింది. లీవ్ లెటర్లు ప్రిపేర్ చేసినంత సులువుగా సృజనాత్మకమైన లవ్ లెటర్లనూ పొందికగా రాసి పెడుతూ వైవిధ్యం చాటుకుంది. అప్పుడప్పుడూ తడబడ్డా, మొత్తమ్మీద అన్ని అంశాల్లోనూ అపారమైన పరిజ్ఞానం, నైపుణ్యంతో యూజర్ల మనసు దోచుకుంది. గూగుల్ తదితర దిగ్గజాలు కూడా సొంత ఏఐ చాట్‌బోట్లతో బరిలో దిగుతుండటంతో ఏఐ రంగంలో మరిన్ని విప్లవాత్మక పరిణామాలు వచ్చేలా ఉన్నాయి.

3. ఆదిమ 'జాతులు'!



మనిషి పుట్టిల్లు ఏదంటే తడుముకోకుండా వచ్చే సమాధానం... ఆఫ్రికా. అంతవరకూ నిజమే అయినా, మనమంతా ఒకే ఆదిమ జాతి నుంచి పుట్టుకొచ్చామని ఇప్పటిదాకా నమ్ముతున్న సిద్ధాంతం తప్పని 2023లో ఓ అధ్యయనం చెప్పింది. మన మూలాలు కనీసం రెండు ఆదిమ జాతుల్లో ఉన్నట్టు తేల్చింది! 10 లక్షల ఏళ్ల కింద ఆఫ్రికాలో ఉనికిలో ఉన్న పలు ఆదిమ జాతులు హోమోసెపియన్ల ఆవిర్భావానికి దారి తీసినట్టు డీఎన్ఏ విశ్లేషణ ఆధారంగా అది చెప్పడం విశేషం! మూలవాసులైన అమెరికన్లు దాదాపు 20 వేల ఏళ్ల కింద ఉత్తర అమెరికాకు వలస వెళ్లి యురేషియాకు తిరుగు పయనమైనట్టు మరో అధ్యయనం తేల్చింది.

4. గ్రహశకలం ఓసిరిస్



నాసా ప్రయోగించిన ఓసిరిస్ రెక్స్ రోబోటిక్ అంతరిక్ష నౌక ఏడేళ్ల ప్రయాణం అనంతరం బెన్నూ గ్రహశకలంపై దిగింది. అక్కడి దాదాపు పావు కిలో పరిమాణంలో రాళ్లు, ధూళి నమూనాలను సేకరించి భూమికిపైకి పంపింది. అవి సెప్టెంబర్ 24న అమెరికాలోని ఉటా ఎడారి ప్రాంతంలో దిగాయి. వాటిని విశ్లేషించిన సైంటిస్టులు నీటితో పాటు భారీ మొత్తంలో కార్బన్ జాడలున్నట్టు తేల్చారు. బెన్నూ గ్రహశకలం భూమి కంటే పురాతనమైనది. దాని నమూనాల విశ్లేషణ ద్వారా భూమిపై జీవం ఆవిర్భావానికి సంబంధించిన కీలకమైన రహస్యాలు వెలుగు చూడవచ్చని భావిస్తున్నారు.

5. అత్యంత వేడి ఏడాది



చరిత్రలో ఇప్పటిదాకా నమోదైన అత్యంత వేడి ఏడాదిగా 2023 ఓ అవాంఛనీయ రికార్డును సొంతం చేసుకుంది. ఏప్రిల్ నుంచి నవంబర్ దాకా ప్రతి నెలా ఇప్పటిదాకా అత్యంత వేడిమి మాసంగా నమోదవుతూ వచ్చింది! ఫలితంగా ఏడాది పొడవునా లిబియా నుంచి అమెరికా దాకా తీవ్ర తుఫాన్లు, వరదలు, కార్చిచ్చులు ఉత్పాతాలు సృష్టిస్తూనే వచ్చాయి. పైగా నవంబర్‌లో అయితే 17వ తేదీన భూ తాపంలో చరిత్రలోనే తొలిసారిగా 2 డిగ్రీల పెరుగుదల నమోదైంది! 2 డిగ్రీల లక్ష్మణ రేఖను తాకితే సర్వనాశనం తప్పదని సైంటిస్టులు ఎప్పటినుంచో హెచ్చరిస్తున్న నేపథ్యంలో ఈ పరిణామం వణికిస్తోంది.

6. సికిల్ సెల్‌కు తొలి జన్యుచికిత్స



సికిల్ సెల్, బెటా థలసీమియా వ్యాధులకు తొలిసారిగా జన్యు చికిత్స అందుబాటులోకి వచ్చింది. వాటికి చికిత్స నిమిత్తం కాస్‌జెవీ 9(క్రిస్పర్ కేస్9) జన్యు ఎడిటింగ్ టూల్ వాడకానికి బ్రిటన్ ఔషధ నియంత్రణ సంస్థ ఆమోదం లభించింది. ఈ థెరపీ ద్వారా రోగులకు నొప్పి నిదానించిందని, ఎర్ర రక్త కణాల మార్పిడి ఆవశ్యకత కూడా తగ్గుముఖం పట్టిందని తేలింది. కాకపోతే ఈ చికిత్స ఖరీదే ఏకంగా 20 లక్షల డాలర్లు! పైగా భద్రత అంశాలు, దీర్ఘకాలిక పనితీరు తదితరాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

7. ఊబకాయానికి మందు




మధుమేహానికి ఔషధంగా పేరుబడ్డ వెగోవీ ఊబకాయాన్ని తగ్గించే మందుగా కూడా తెరపైకి వచ్చి సంచలనం సృష్టించింది. బరువును తగ్గించడం మాత్రమే గాక గుండె పోటు, స్ట్రోక్ తదితర ముప్పులను కూడా ఇది బాగా తగ్గిస్తుందని తేలడం విశేషం. వీటితో పాటు పలురకాల అడిక్షన్లకు చికిత్సగా కూడా వెగోవీ ప్రభావవంతంగా ఉపయోగపడుతోందని తేలింది. అయితే దీని వాడకం వల్ల థైరాయిడ్ క్యాన్సర్ వంటి సైడ్ ఎఫెక్టులు రావచ్చంటున్నారు!

8. పాపం పక్షిజాలం



ప్రపంచవ్యాప్తంగా జంతుజాలానికి, మరీ ముఖ్యంగా పక్షిజాలానికి మరణశాసనం రాసిన ఏడాదిగా 2023 నిలిచింది! ప్రపంచ వ్యాప్తంగా లక్షల కొద్దీ పక్షి జాతుల జనాభాలో ఈ ఏడాది విపరీతమైన తగ్గుదల నమోదైనట్టు సైంటిస్టులు తేల్చారు. గత నాలుగు దశాబ్దాలుగా పెరుగుతూ వస్తున్న ఈ ధోరణి 2023లో బాగా వేగం పుంజుకున్నట్టు పలు పరిశోధనల్లో తేలింది. పురుగుమందుల విచ్చలవిడి వాడకమే పక్షుల మనుగడకు ముప్పుగా మారిందని తేలింది!

9. మూల కణాధారిత పిండం



అండం, శుక్ర కణాలతో నిమిత్తం లేకుండానే కేవలం మూల కణాల సాయంతో మానవ పిండాన్ని సృష్టించి ఇజ్రాయెల్ సైంటిస్టులు సంచలనం సృష్టించారు. అది కూడా మహిళ గర్భంతో నిమిత్తం లేకుండా ప్రయోగశాలలో వారీ ఘనత సాధించారు. ఈ నమూనా పిండం ప్రయోగశాలలో 14 రోజుల పాటు పెరిగింది. ఆ సమయానికి సహజంగా తల్లి గర్భంలో ఎలా ఉంటుందో అచ్చం అలాగే ఎదిగిందని తేలింది. మానవ పునరుత్పత్తి రంగంలో దీన్ని కీలక మైలురాయిగా భావిస్తున్నారు. ఇలాంటి మరిన్ని ప్రయోగాలకు ఇది ప్రేరణగా నిలుస్తుందని భావిస్తున్నారు.

10. కార్చిచ్చులు



2023లో కార్చిచ్చులు కొత్త రికార్డులు సృష్టించాయి. ముఖ్యంగా కెనడాలోనైతే పెను వినాశనానికే దారి తీశాయి. వీటి దెబ్బకు అక్కడ గత అక్టోబర్ నాటికే ఏకంగా 4.5 కోట్ల ఎకరాలు బుగ్గి పాలయ్యాయి! అక్కడ 1989లో నమోదైన పాత రికార్డుతో పోలిస్తే ఇది ఏకంగా రెట్టింపు విధ్వంసం. అమెరికా, బ్రిటన్, స్పెయిన్, నార్వే వంటి పలు ఇతర దేశాల్లోనూ కార్చిచ్చులు విధ్వంసమే సృష్టించాయి. వీటి దెబ్బకు జూన్ నెలంతా అమెరికాలో వాయు నాణ్యత ఎన్నడూ లేనంతగా తగ్గిపోయింది. హవాయి దీవుల్లో కార్చిచ్చుకు ఏకంగా 100 మంది బలయ్యారు.



అయోధ్యలో కొత్తగా నిర్మించిన మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయంలో కనువిందు చేస్తున్న రామాయణ గాథకు సంబంధించిన కుడ్య చిత్రాలు

నేడు అయోధ్యకు మోదీ

- అంతర్జాతీయ విమానాశ్రయం, ఆధునీకరించిన రైల్వే స్టేషన్‌ను ప్రారంభించనున్న ప్రధాని
- కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసిన అధికారులు

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని ఆధ్యాత్మిక నగరం అయోధ్యలో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని, ఆధునీకరించిన రైల్వే స్టేషన్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించనున్నారు. మోదీ పర్యటన నేపథ్యంలో నగరంలో అధికారులు భద్రతను పటిష్టం చేశారు. డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్‌తో అణువణువూ తనిఖీ చేస్తున్నారు. డ్రోన్లతో నిఘా పెంచారు. అయోధ్యలో రూ.1,450 కోట్లతో ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నిర్మించారు. 6,500 చదరపు మీటర్ల విస్తీర్ణంలో టెర్మినల్ భవనం సిద్ధమైంది. ఇక్కడి నుంచి ఒకేసారి 600 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించవచ్చు. ఈ విమానాశ్రయానికి 'మహర్షి వాల్మీకి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ అయోధ్యధామం' అనే పేరు ఖరారు చేశారు. గతంలో 'మర్యాద పురుషోత్తమ్ శ్రీరామ్ అయోధ్య అంతర్జాతీయ విమానాశ్రయం'గా వ్యవహరించేవారు. అయోధ్యలో ఆధునీకరించిన రైల్వే స్టేషన్‌కు 'అయోధ్య ధామ్ జంక్షన్'గా నామకరణం చేశారు. శ్రీరాముడి స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ పలు కట్టడాలను సుందరంగా నిర్మించారు. శిఖరం, విల్లు బాణం వంటివి శ్రీరాముడిని గుర్తుకు తెస్తున్నాయి. నాలుగు ఎత్తయిన గోపురాలతో 11,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ స్టేషన్ విస్తరించి ఉంది. ఈ స్టేషన్‌ను రైల్వే శాఖ అనుబంధ సంస్థ అయిన రైల్ ఇండియా టెక్నికల్, ఎకనామిక్ సర్వీస్ లిమిటెడ్(రైట్స్) అభివృద్ధి చేసింది. మరోవైపు అయోధ్యలో భవ్య రామమందిర ప్రారంభోత్సవ ఏర్పాట్లు ఊపందుకుంటున్నాయి.

డామిట్! కథ అడ్డం తిరిగింది

నితీశ్‌ను తప్పించబోయి చిత్తయిన లలన్

- సీఎంగా తేజస్వి, తనకు రాజ్యసభ సీటు
- ఆర్జేడీ చీఫ్ లాలుప్రసాద్‌తో రహస్య ఒప్పందం
- జేడీ(యూ) ఎమ్మెల్యేల ఫిరాయింపుకు స్కెచ్
- పదవి లాక్కుని మొగ్గలోనే తుంచేసిన నితీశ్



కొద్ది నెలల క్రితం నుంచే...

న్యూఢిల్లీ/పట్నా: బిహార్‌లో అధికార కూటమి భాగస్వామి అయిన జేడీ(యూ)లో తెర వెనక 'తిరుగుబాటు'కు ఎట్టకేలకు తెర పడింది. పార్టీలో అధ్యక్ష మార్పు తప్పదన్న ఊహాగానాలే నిజమయ్యాయి. మీడియా కథనాలను నిజం చేస్తూ లలన్‌సింగ్‌ను తప్పించి పార్టీ అధ్యక్ష పగ్గాలను సీఎం నితీశ్‌కుమార్ లాంఛనంగా తన చేతుల్లోకి తీసుకున్నారు. శుక్రవారం జరిగిన పార్టీ జాతీయ కౌన్సిల్ భేటీ ఇందుకు వేదికైంది. పార్టీ అధ్యక్షునిగా నితీశ్ పేరును సభ్యులంతా ముక్త కంఠంతో సమర్థించారు. ఆ వెంటనే లలన్ రాజీనామా, అధ్యక్షునిగా నితీశ్ బాధ్యతల స్వీకరణ చకచకా జరిగిపోయాయి. అయితే ఈ పరిణామం వెనక నిజానికి చాలా పెద్ద కథే నడిచినట్టు తెలుస్తోంది. లలన్ తిరుగుబాటు యత్నమే దీనంతటికీ కారణమని సమాచారం. నితీశ్ స్థానంలో డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్‌ను ముఖ్యమంత్రిని చేసేందుకు లలన్ చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టి చివరికి ఆయన ఉద్వాసనకు దారితీసినట్టు చెబుతున్నారు!

ఆర్జేడీతో, ఆ పార్టీ చీఫ్ లాలుప్రసాద్ యాదవ్‌తో లలన్‌సింగ్ సాన్నిహిత్యం ఇప్పటిది కాదు. నితీశ్ కూడా దీన్ని చూసీ చూడనట్టే పోయేవారు. అయితే విశ్వసనీయ వర్గాల కథనం మేరకు... లాలు కుమారుడు తేజస్వికి సీఎం పదవి అప్పగించి నితీశ్ డిప్యూటీ సీఎంగా కొనసాగాలంటూ కొద్దికాలం క్రితం లలన్ ప్రతిపాదించారు. 18 ఏళ్లపాటు సుదీర్ఘంగా సీఎం పదవిలో కొనసాగినందున అధికార మహాఘట్‌బంధన్ సంకీర్ణంలో పెద్ద భాగస్వామి అయిన ఆర్జేడీకి సీఎం అవకాశమిస్తే బాగుంటుందని సూచించారు. దీన్ని నితీశ్ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు.

లాలు-లలన్ ప్లాన్

నితీశ్ నిరాకరించినా తేజస్విని ఎలాగైనా సీఎం చేసేందుకు లాలు, లలన్ ఒక పకడ్బందీ ప్రణాళిక రూపొందించారు. అందులో భాగంగా జేడీ(యూ)ను చీల్చి కనీసం ఒక డజను మంది ఎమ్మెల్యేలను ఆర్జేడీలోకి పంపేందుకు లలన్ ఒప్పుకున్నారు. బదులుగా వచ్చే ఏప్రిల్లో ఆర్జేడీ నుంచి ఖాళీ అవుతున్న రాజ్యసభ స్థానాన్ని ఆయనకిచ్చేలా అంగీకారం కుదిరింది. 243 మంది సభ్యుల బిహార్ అసెంబ్లీలో జేడీ(యూ)తో నిమిత్తం లేకుండా ప్రభుత్వ ఏర్పాటుకు తేజస్వికి కేవలం మరో ఏడుగురు ఎమ్మెల్యేల మద్దతు చాలు. కానీ 45 మంది జేడీ(యూ) ఎమ్మెల్యేల్లో డజను మందే పార్టీ ఫిరాయిస్తే వారిపై అనర్హత వేటు ఖాయం. తన అధ్యక్ష పదవి సాయంతో ఈ ముప్పు తప్పించేలా లలన్ ఎత్తే వేశారు. అందులో భాగంగా వారిని పార్టీ నుంచి ఆయనే సస్పెండ్ చేస్తారు. అప్పుడిక వారికి అనర్హత నిబంధన వర్తించదు. ఆనక 12 మంది ఎమ్మెల్యేలూ ఆర్జేడీకి మద్దతు పలికేలా, నితీశ్ సర్కారు కుప్పకూలి తేజస్వి గద్దెనెక్కేలా వ్యూహరచన జరిగింది. ఈ మేరకు 12 మంది జేడీ(యూ) ఎమ్మెల్యేలతో కొద్ది వారాల క్రితం లలన్ గుట్టుగా మంతనాలు కూడా జరిపారు. వారందరికీ మంత్రి పదవులు ఆశ చూపారు. ఆర్జేడీకి చెందిన స్పీకర్ అవధ్ బిహారీ చౌధరి ఇందుకు పూర్తిగా సహకరిస్తారని చెప్పారు. అయితే సదరు ఎమ్మెల్యేల్లో తన వీర విధేయుడైన సభ్యుడొకరు దీనిపై ఉప్పందించడంతో నితీశ్ అప్రమత్తమయ్యారు. సైలెంట్‌గా వారం క్రితం 'ఆపరేషన్ లాలన్'కు తెర తీశారు. ఎమ్మెల్యేలతో పాటు పార్టీ నేతలందరితోనూ విడివిడిగా మాట్లాడి వారంతా తనకే విధేయులుగా ఉండేలా చర్యలు తీసుకున్నారు. అలా పావులు కదుపుతూ శుక్రవారం కథను క్లైమాక్స్‌కు తెచ్చారు. విషయం అర్థమైన లాలన్‌సింగ్ అస్త్రసన్యాసం చేశారు. అధ్యక్ష పదవికి తానే నితీశ్ పేరును సూచించి తప్పుకున్నారు!

అసోంలో ఇక శాంతి పవనాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో శాంతి ఒప్పందంపై 'ఉల్ఫా' సంతకం

న్యూఢిల్లీ: దశాబ్దాలుగా వేర్పాటువాద ఉద్యమాలతో అట్టుడికిపోతున్న అసోంలో శాంతి సుస్థిరతలు నెలకొనే దిశగా అడుగులు పడ్డాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై శాంతి ఒప్పందంపై వేర్పాటువాద సంస్థ యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అసోం(ఉల్ఫా) సంతకం చేసింది. ఇకపై హింసకు దూరంగా ఉంటామని, ప్రజాస్వామ్య ప్రక్రియలో పాలుపంచుకుంటామని ప్రకటించింది. శుక్రవారం ఢిల్లీలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, అసోం ముఖ్యమంత్రి హిమంతబిశ్వ శర్మ సమక్షంలో ఉల్ఫా శాంతి ఒప్పందం కుదుర్చుకుంది. అసోం ప్రజలకు ఇదొక మరుపురాని గొప్ప రోజు అని అమిత్ షా చెప్పారు. హింసాకాండ వల్ల అసోం ప్రజలు ఎంతగానో నష్టపోయారని, 1979 నుంచి 10 వేల మంది ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. హింసను విడనాడేందుకు ఉల్ఫా అంగీకరించిందని తెలిపారు. శాంతి ఒప్పందంలో భాగంగా రాష్ట్రానికి భారీ అభివృద్ధి ప్యాకేజీ ఇవ్వబోతున్నట్లు వెల్లడించారు. ఒప్పందంలోని ప్రతి అంశాన్నీ పూర్తిస్థాయిలో అమలు చేస్తామన్నారు. శాంతి ఒప్పందం చరిత్రాత్మకమని సీఎం హిమంతబిశ్వ వర్మ అభివర్ణించారు. ప్రధానమంత్రి నరంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా చొరవతో ఈ ఒప్పందం కార్యరూపం దాల్చిందని హర్షం వ్యక్తం చేశారు.

ఏమిటీ ఉల్ఫా?

'సార్వభౌమత్వ అస్సాం' అనే డిమాండ్‌తో 1979 ఏప్రిల్ 7న ఉల్ఫా ఏర్పాటయ్యింది. డిమాండ్‌ను నెరవేర్చుకొనేందుకు ఉల్ఫా హింసాకాండనే నమ్ముకుంది. 1990లో ఈ సంస్థపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. ఉల్ఫాలోని అరబిందా రాజ్‌ఖోవా వర్గం 2011 సెప్టెంబర్ 3 నుంచి శాంతి చర్చలు కొనసాగిస్తోంది. ఎట్టకేలకు ఒప్పందం కుదిరింది. అయితే, ఉల్ఫాలో పరేశ్ బారువా నేతృత్వంలోని మరో వర్గం ఈ ఒప్పందంలో భాగస్వామిగా చేరలేదు. పరేశ్ బారువా ప్రస్తుతం చైనా-మయన్మార్ సరిహద్దుల్లోని ఓ గ్రామంలో నివసిస్తున్నట్లు సమాచారం.

డొనాల్డ్ ట్రంప్‌నకు మరో షాక్

పోర్ట్‌ల్యాండ్: అమెరికా మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ నేత డొనాల్డ్ ట్రంప్‌నకు మరో షాక్ తగిలింది. వచ్చే ఏడాది జరిగే అధ్యక్ష ఎన్నికల్లో పోటీ పడేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్న ఆయనకు దారులు క్రమంగా మూసుకుపోతున్నాయి. కొలరాడో రాష్ట్రంలో అధ్యక్ష అభ్యర్థిత్వానికి(ప్రైమరీ ఎన్నికలో) పోటీ చేసేందుకు ట్రంప్ అనర్హుడని 2021 జనవరి 6న జరిగిన క్యాపిటల్ హిల్‌పై దాడి కేసులో కొలరాడో సుప్రీంకోర్టు ఇటీవల తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. కొలరాడో రాష్ట్ర ప్రైమరీ ఎన్నికలో పోటీ చేయకుండా ఆయనపై అనర్హత వేటు వేసింది. తాజాగా మెనె రాష్ట్రంలోనూ ట్రంప్‌నకు పరాభవం ఎదురైంది. రాష్ట్రంలో ప్రైమరీ ఎన్నికలో పోటీ చేయకుండా బ్యాలెట్ నుంచి ట్రంప్ పేరును తొలగిస్తున్నట్లు మెనె రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి షెన్నా బెల్లోస్ గురువారం ప్రకటించారు. ఈ మేరకు ఉత్తర్వు జారీ చేశారు. ఈ ఉత్తర్వుపై న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశాన్ని ట్రంప్‌నకు కల్పించారు. కొలరాడో సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో మెనె రాష్ట్రంలో ప్రైమరీ ఎన్నికలో ట్రంప్ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ కొందరు అప్పీళ్లు దాఖలు చేశారు. ఆయనకు ఇక్కడి నుంచి ప్రైమరీలో పోటీ చేసే అవకాశం ఇవ్వొద్దని కోరారు. వీటిని పరిగణనలోకి తీసుకున్న షెన్నా బెల్లోస్ ప్రైమరీ బ్యాలెట్ నుంచి ట్రంప్ పేరును తొలగించారు. అధ్యక్ష ఎన్నికల్లో పోటీ పడుతున్న అభ్యర్థి పేరును ఒక రాష్ట్రంలో ఇలా బ్యాలెట్ నుంచి తొలగించడం అమెరికా చరిత్రలో ఇదే మొదటిసారి కావడం గమనార్హం.

జార్ఖండ్‌లో 50 ఏళ్లకే పెన్షన్

గిరిజనులు, దళితులకు లబ్ధి: సీఎం హేమంత్ సోరెన్

రాంచీ: పెన్షన్ల మంజూరు విషయంలో జార్ఖండ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గిరిజనులు, దళితులకు పెన్షన్ అర్హత వయసును 60 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు తగ్గించింది. 50 ఏళ్ల వయసు రాగానే పెన్షన్ ప్రయోజనాలు అందుకోవచ్చని ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ శుక్రవారం ప్రకటించారు. రాష్ట్రంలో జేఎంఎం కూటమి ప్రభుత్వం నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గిరిజనులు, దళితుల్లో మరణాల రేటు అధికంగా ఉందని, 60 ఏళ్లు దాటాక వారికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించడం లేదన్నారు.

ఉక్రెయిన్‌పై మళ్లీ నిప్పుల వర్షం

122 క్షిపణులు, 36 డ్రోన్లు ప్రయోగించిన రష్యా సైన్యం

కీవ్: ఉక్రెయిన్‌పై రష్యా సైన్యం మరోసారి భీకర స్థాయిలో విరుచుకుపడింది. చాలా రోజుల తర్వాత అతిపెద్ద దాడికి పాల్పడింది. గురువారం రాత్రి నుంచి ఉక్రెయిన్‌లోని కీలకమైన లక్ష్యాలపై ఏకంగా 122 క్షిపణులు, 36 డ్రోన్లు ప్రయోగించింది. 18 గంటలపాటు జరిగిన ఈ దాడుల్లో 24 మంది సాధారణ పౌరులు మృతి చెందారని, దాదాపు 130 మంది గాయపడ్డారని ఉక్రెయిన్ అధికార వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. ఉక్రెయిన్-రష్యా యుద్ధం మొదలైన తర్వాత ఉక్రెయిన్‌పై ఇదే అతిపెద్ద వైమానిక దాడి అని పేర్కొన్నాయి. రష్యా సైన్యం ప్రయోగించిన బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణులు, షాహెద్ డ్రోన్లను చాలావరకు కూల్చివేశామని ఉక్రెయిన్ సైనికాధికారి ఒకరు పేర్కొన్నారు. 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్-రష్యా నడుమ యుద్ధం ప్రారంభమైన సంగతి తెలిసిందే.

ఉత్తరాదిని కమ్మేసిన దట్టమైన పొగమంచు

దేశవ్యాప్తంగా 274 విమానాలు, 80కి పైగా రైళ్లు ఆలస్యం

సాక్షి, న్యూఢిల్లీ: ఉత్తర భారతదేశాన్ని దట్టమైన పొగమంచు కమ్మేసింది. రహదారులపై వాహనాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్నిచోట్ల ప్రయాణాలు నిలిచిపోయాయి. దేశ రాజధాని ఢిల్లీతోపాటు హరియాణా, పంజాబ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో మరో రెండు రోజులపాటు పొగమంచు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ ప్రకటించింది. ఈ నాలుగు రాష్ట్రాలలో రెడ్ అలర్ట్ జారీ చేసింది. పొగమంచు కారణంగా శుక్రవారం దేశవ్యాప్తంగా 274 విమానాలు ఆలస్యంగా నడిచాయి. 80కి పైగా రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి.



సీఐఎస్ఎఫ్ తొలి మహిళా డైరెక్టర్ జనరల్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరిస్తున్న ఐపీఎస్ అధికారి నీనా సింగ్

- ప్రత్యేక కథనం ఫ్యామిలీలో

చెక్ బౌన్స్ కేసులో దోషిగా మంత్రి

- రూ.6.96 కోట్లు కట్టండి
- బంగారప్పకు కోర్టు ఆదేశం

బెంగళూరు: కర్ణాటక పాఠశాల విద్య, అక్షరాస్యత శాఖ మంత్రి మధు బంగారప్పను చెక్ బౌన్స్ కేసులో ప్రత్యేక కోర్టు దోషిగా తేల్చింది. ఫిర్యాదుదారులైన రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ సంస్థకు రూ.6.96 కోట్లు జరిమానాగా చెల్లించాలని ఆయనను ఆదేశించింది. మరో రూ.10 వేలను కర్ణాటక ప్రభుత్వానికి చెల్లించాలని స్పష్టం చేసింది. జరిమానా చెల్లించకపోతే ఆరు నెలలపాటు సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తేల్చిచెప్పింది. ఈ మేరకు ఇటీవల తీర్పు వెలువరించింది. ఈ కేసులో ఆకాశ్ ఆడియో-వీడియో ప్రైవేట్ లిమిటెట్‌ను మొదటి నిందితులుగా, ఆకాశ్ ఆడియో-వీడియో ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ మధు బంగారప్ప రెండో నిందితుడిగా కోర్టు గుర్తించింది. రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ సంస్థ నుంచి మధు బంగారప్ప రూ.6 కోట్లు డిపాజిట్ రూపంలో తీసుకున్నారు. చాలా రోజులు తిరిగి చెల్లించలేదు. గట్టిగా నిలదీయగా చెక్కు ఇచ్చారు. బ్యాంకు ఖాతాలో నగదు లేకపోవడంతో అది బౌన్స్ అయ్యింది. దాంతో రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ సంస్థ కోర్టును ఆశ్రయించింది.

ఒక్కరోజులో 797 కరోనా కేసులు

162కు చేరిన జేఎన్.1 ఉప వేరియంట్ కేసులు

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. ముఖ్యంగా జేఎన్.1 ఉప వేరియంట్ వేగంగా వ్యాప్తి చెందుతోంది. దేశవ్యాప్తంగా గత 24 గంటల్లో మొత్తం 797 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయని కేంద్ర ఆరోగ్య శాఖ శుక్రవారం వెల్లడించింది. ఒకేరోజులో ఈ స్థాయిలో కేసులు నమోదు కావడం గత ఏడు నెలల్లో ఇదే మొదటిసారి. మొత్తం యాక్టివ్ కేసుల 4091కి చేరుకుంది. ఇప్పటివరకు జేఎన్.1 వేరియంట్ బారినపడిన బాధితుల సంఖ్య 162కు చేరింది. అత్యధికంగా కేరళలో 83 కేసులు, గుజరాత్‌లో 34 జేఎన్.1 కేసులు వెలుగుచూశాయి. గోవా, కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్తాన్, తమిళనాడు, తెలంగాణ, ఢిల్లీలో జేఎన్.1 ఉప వేరియంట్ కేసులు నమోదైనట్లు ఇండియన్ సార్స్-కోవ్-2 జినోమిక్స్ కన్సార్టియం(ఇన్సాకాగ్) శుక్రవారం తెలియజేసింది. ఇదిలా ఉండగా, గత 24 గంటల్లో కరోనా కాటుకు ఐదుగురు బలయ్యారు.

ప్రపంచంలోకెల్లా సంపన్నురాలు

- 'లో రియాల్' వైస్ ప్రెసిడెంట్ ఫ్రాంకోయిస్ రికార్డు
- 100 బిలియన్ డాలర్లు దాటిన సంపద
- ఆ ఘనత సాధించిన తొలి మహిళ ఆమే

న్యూఢిల్లీ: కాస్మటిక్స్ దిగ్గజం లోరియాల్ వ్యాపార సామ్రాజ్య వారసురాలు ఫ్రాంకోయిస్ బెటెన్‌కోర్ట్ మేయర్స్ ప్రపంచంలో అత్యంత సంపన్న మహిళగా చరిత్ర సృష్టించారు. అలాగే ఏకంగా 100 బిలియన్ డాలర్ల పై చిలుకు సంపదను ఆర్జించిన తొలి మహిళగా కూడా ఆమె నిలిచారు. అంతేగాక ప్రపంచ కుబేరుల జాబితాలో ముకేశ్ అంబానీ, గౌతం అదానీ, అమానికో ఒర్టెగా వంటి వ్యాపార దిగ్గజాలను వెనక్కు నెడుతూ 12వ స్థానానికి ఎగబాకారని బ్లూంబర్గ్ బిలియనీర్ల ఇండెక్స్ ప్రకటించింది! 70 ఏళ్ల మేయర్స్ 268 బిలియన్ డాలర్ల విలువైన లో రియాల్ వ్యాపార సామ్రాజ్యానికి వైస్ ప్రెసిడెంట్ హోదాలో ఉన్నారు. ఆమె కుటుంబానికి కంపెనీలో 35 శాతం దాకా వాటాలున్నాయి. 2017లో మేయర్స్ తల్లి మరణానంతరం అపారమైన ఆస్తి, కంపెనీ వాటాలు ఆమెకు వారసత్వంగా దక్కాయి. తాజాగా కంపెనీ వాటాల విలువ ఒక్కసారిగా చుక్కలనంటడంతో మేయర్స్ సంపద బిలియన్ డాలర్ల మార్కును దాటేసింది. మీడియాకు దూరంగా రోజూ గంటల తరబడి పియానో వాయిస్తూ గడుపుతుంటారామె.



ముంబై నుంచి అసోంకు ట్రక్కుపై తరలిస్తున్న పాత విమానం శుక్రవారం బిహార్‌లోని మోతిహారీ వద్ద ఇలా బ్రిడ్జి కింద ఇరుక్కుపోయింది.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

శనివారం । 30 । డిసెంబర్ । 2023



దుర్గమ్మ సేవలో..
ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె. నారాయణస్వామి శుక్రవారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు.



ప్రజారోగ్య ల్యాబ్ ప్రారంభం
లబ్బీపేట: విజయవాడలోని పాత ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం సమీకృత ప్రజారోగ్య లేబొరేటరీల ప్రారంభోత్సవ కార్యక్రమాలకు కేంద్ర మంత్రి మన్సూక్ మాండవీయ హాజరయ్యారు.

క్రైం ఏసీపీగా స్రవంతి
విజయవాడ స్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ క్రైం ఏసీపీగా కె.స్రవంతిరాయ్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు తీసుకున్నారు. తెనాలి సబ్ డివిజన్ డీఎస్పీగా పని చేస్తున్న ఆమె ఇటీవల కమిషనరేట్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సీపీ టి.కె.రాణాను మర్యాదపూర్వకంగా కలిశారు.



న్యూస్‌రీల్

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌కు సన్మానం



ఇబ్రహీంపట్నం: మండలం పరిధి గ్రామాల్లో లంకభూములు పట్టాల పంపిణీ చేసిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావును ఇబ్రహీంపట్నం మండల లంకభూముల లబ్ధిదారులు, వైఎస్సార్ సీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన కార్యాలయం శుక్రవారం మెమెంటో అందజేసి శాలువాతో సత్కరించారు. నదీ పరీవాహక ప్రాంత గ్రామాల పరిధిలో 1,200 మందికి పట్టాలు పంపిణీ చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కొండపల్లి మునిసిపాలిటీ సచివాలయాల కో ఆర్డినేటర్ లంకే అంకమోహనరావు, ప్రధానమంత్రి మత్స్య శాఖ యోజన జిల్లా డైరెక్టర్ లంకే గోవిందరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు ప్రకాశ్, వసంతరావు, పండు, రాజేష్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేడు జాతీయ రంగస్థల పురస్కార మహోత్సవం
పెనమలూరు: యనమలకుదురులో శనివారం గుమ్మడి కళాపీఠం ఆధ్వర్యంలో దివంగత గుమ్మడి జైరాజ్ 15వ జాతీయ స్మారక రంగస్థల పురస్కార మహోత్సవం నిర్వహిస్తున్నామని వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు, గుమ్మడి జైరాజ్ కళాపీఠం నిర్వాహకుడు గుమ్మడి విజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం యనమలకుదురులో జరిగిన విలేకరుల సమావేశంలో విజయ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. యనమలకుదురు పంచాయతీ గ్రౌండ్స్‌లో శనివారం సాయంత్రం 6.30 గంటలకు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. రంగస్థల నటి కె.వనజకుమారికి గుమ్మడి జైరాజ్ 15వ జాతీయ స్మారక రంగస్థల జాతీయ పురస్కారం అందజేస్తామన్నారు. అలాగే 25 మంది సీనియర్ కళాకారులకు సత్కారం చేస్తామని వివరించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, తూర్పు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి దేవినేని అవినాష్, తెలంగాణ ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, పలువురు ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు.

దుర్గమ్మ నిత్యాన్నదానానికి పలువురు విరాళాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి విజయవాడ బృందావనం కాలనీకి చెందిన దరిశి రవి, లీలావతి రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. అలాగే ఆస్ట్రేలియాలోని విక్టోరియాకు చెందిన జి.వాసుదేవరెడ్డి కుటుంబం అమ్మవారికి బంగారం, వజ్రాలు పొదిగిన నత్తును కానుకగా సమర్పించింది. సుమారు 7.1 గ్రాముల బంగారంతో తయారు చేసిన నత్తును ఆలయ సూపరిండెంటెంట్ జగదీష్‌కు అందజేసింది. అదే విధంగా గుడివాడ ఎర్రబడ్డీ సెంటర్‌కు చెందిన ఎస్.దీపిక పేరిట కుటుంబ సభ్యులు రూ. 1.02 లక్షలు విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం తర్వాత దాతలకు ఆలయ ఈఈ కోటేశ్వరరావు, తేజావో రమేష్ బాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేష వస్త్రాలను బహూకరించారు.

జగద్గురువు ఆదిశంకర బోధనలు సదా ఆచరణీయం
ఏపీ హైకోర్ట్ జడ్జి కృష్ణమోహన్



విజయవాడ కల్చరల్: జగద్గురువు ఆదిశంకరుల బోధనలు సదా ఆచరణీయమని ఏపీ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ బి. కృష్ణమోహన్ అన్నారు. శృంగేరీ పీఠాధిపతులు జగద్గురు భారతీ తీర్థ మహాస్వామి సన్యాశ్రమ స్వీకార స్వర్ణోత్సవాల ముగింపు సందర్భంగా శివరామ కృష్ణ క్షేత్రంలో 50 రోజులుగా శృంగేరీ పీఠాధిపతుల వైభవం అంశంగా నిర్వహించిన ఆధ్యాత్మిక ప్రసంగాలు శుక్రవారం ముగిశాయి. జస్టిస్ కృష్ణమోహన్ మాట్లాడుతూ జగద్గురువుల సనాతన ధర్మరక్షణకు కృషి చేశారని అదే సంప్రదాయాన్ని పీఠాధిపత్యం వహించిన వారు సంరక్షిస్తున్నారని కొనియాడారు. శృంగేరీ పీఠ ప్రతినిధి తంగిరాల శివకుమార్, ఆధ్యాత్మిక వేత్త మల్లాది వేంకట రామనాథ శర్మ ప్రసంగించారు. రామనాథశర్మ, జడ్జి బి. కృష్ణమోహన్‌ను పీఠ నిర్వాహకులు సత్కరించారు.



సాహితీ వేడుక..
సగర్వ వేదిక
కొలువుదీరిన పుస్తక వనం

పుస్తకం పిలుస్తోంది.. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకూ, సామాన్యుల నుంచి కవులు, రచయితల వరకూ అందరికీ ఆహ్వానం పలుకుతోంది. కమనీయ కథలు, పురాణ గాథలు, సాహిత్య స్రవంతులు.. నిశీధి నుంచి నింగిలో జాబిలి వరకూ అణువణువూ అవలోకనం చేసే విజ్ఞాన నిధులు ఒక్కచోట చేరి రారమ్మని స్వాగతం పలుకుతున్నాయి.

- ఆహ్వానం పలుకుతున్న విజయవాడ బుక్ ఫెస్టివల్
- దక్షిణాది రాష్ట్రాల్లో అతి పెద్ద మహోత్సవం
- మూడు దశాబ్దాలకు పైగా ఆదరణ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలో ప్రతి ఏటా నిర్వహించే విజయవాడ పుస్తక మహోత్సవం కొలువుదీరింది. విజయవాడ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణ వేదికగా గురువారం ప్రారంభమైన పుస్తక మహోత్సవం జనవరి ఏడో తేదీ వరకూ కొనసాగనుంది. కేవలం రాష్ట్రానికి చెందిన ప్రచురణ కర్తలే కాకుండా దేశ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ ప్రచురణ సంస్థలు, ప్రఖ్యాత విశ్వ విద్యాలయాలు, బహుళ జాతి సంస్థలు సైతం ఈ పుస్తక మహోత్సవంలో తమ స్టాల్స్‌ను ఏర్పాటు చేశాయి. సాహిత్య అకాడమీ, నేషనల్ బుక్ ట్రస్ట్ తదితర ప్రభుత్వ విభాగాలకు చెందిన స్టాల్స్ పాఠకులను ఆకట్టుకుంటున్నాయి. దక్షిణాది రాష్ట్రాల్లో అత్యంత పెద్దదిగా పేరుగాంచిన విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ 33 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుని 34వ సంవత్సరంలోకి అడుగు పెట్టింది.

204 స్టాల్స్..

1989లో నగరానికి చెందిన ప్రచురణ కర్తలు నేషనల్ బుక్ ట్రస్ట్ సహకారంతో తొలిసారిగా 89 స్టాల్స్‌తో ప్రారంభించిన పుస్తక మహోత్సవం 370 దుకాణాలను సైతం నిర్వహించింది. అయితే పార్కింగ్‌కు, ఇతర సదుపాయాలకు స్థలాన్ని కేటాయించడంతో స్టాల్స్ తగ్గించి వసతుల పెంపునకు నిర్ణయించారు. అందులో భాగంగా ఈ ఏడాది బుక్ ఫెస్టివల్ ప్రాంగణాన్ని మార్పు చేయడంతో 204 స్టాల్స్‌కు పరిమితమైంది.

ఒక్క చోటకు చేరే పుస్తక ప్రియులు..

కేవలం పుస్తకాలను చదివే పాఠకులు మాత్రమే ఈ పుస్తక మహోత్సవంలో కనపడరు.. సాహిత్యాన్ని అందించే ప్రఖ్యాత సాహితీవేత్తలు, పుస్తకాలను ప్రచురించే పుస్తక ప్రచురణకర్తలు, వాటిని ప్రోత్సహించే సంస్థలు, పుస్తకాలకు అండగా నిలిచే ప్రభుత్వ శాఖలు ఇలా అందరూ విజయవాడ పుస్తక మహోత్సవంలో కలుస్తుంటారు. ప్రఖ్యాత కవులు, రచయితలు ఈ ప్రాంగణంలో కలియతిరుగుతూ పాఠకులను చూసి పరవశలవుతుంటారు. అంతేకాక పుస్తకాల ఆవిష్కరణ సభల్లో జరిగే ప్రసంగాలు, సాహితీవేత్తల శతజయంతులు, ప్రముఖుల సంతాప కార్యక్రమాలు ఇలా అనేక కార్యక్రమాలతో ఈ ప్రాంగణం 11 రోజుల పాటు కళకళలాడుతూ దర్శనమిస్తుంది.

ఎన్ని మాధ్యమాలు ఉన్నా..

విజయవాడ పుస్తక మహోత్సవం కోసం పుస్తక ప్రియులు, సాహితీప్రియులు ఏటా ఎదురు చూస్తుంటారు. జనవరి ఒకటో తేదీన ప్రారంభమయ్యే మహోత్సవం కొన్ని కారణాల రీత్యా ఈ ఏడాది డిసెంబర్ 28వ తేదీన ప్రారంభమైంది. కృష్ణాజిల్లానే కాకుండా యావత్ కోస్తా జిల్లాలకు చెందిన విద్యార్థులు, సాహితీవేత్తలు, సాహితీప్రియులు, విద్యాసంస్థల ప్రతినిధులు పుస్తక మహోత్సవానికి విచ్చేసి కొనుగోలు చేస్తుంటారు. ఇంటర్నెట్ వంటి ఆధునిక సాంకేతిక ప్రచార మాధ్యమాలు అభివృద్ధి చెందుతున్నా పుస్తక పఠనానికి ఏమాత్రం ఆదరణ తగ్గలేదన్న విషయాన్ని గత పుస్తకమహోత్సవాల విజయవంతం కావటం ద్వారా రుజువు చేశాయి.



కోల్‌కతా బుక్ ఫెయిర్‌తో ప్రేరణ..

కోల్‌కతాలో జరిగే బుక్ ఫెయిర్‌ను చూసి ఇక్కడ కూడా నిర్వహించాలని భావించాం. తొలి రోజుల్లో అనేక వ్యయ ప్రయాసలకోర్చి నేషనల్ బుక్ ట్రస్ట్ సహకారంతో తొలి సారిగా విజయవాడలో పుస్తక మహోత్సవాన్ని నిర్వహించాం. ఆ తరువాత సభ్యులందరి కృషితో సొసైటీ అన్ని అవాంతరాలను ఎదుర్కొంటూ 33 సంవత్సరాల ప్రస్థానాన్ని పూర్తి చేసుకోవడం ఆనందంగా ఉంది.

– బెల్లపు బాబ్జీ, బుక్ ఫెస్టివల్ సొసైటీ గౌరవాధ్యక్షుడు



ఈ ఏడాది రెండు సార్లు నిర్వహిస్తున్నాం..

ఏటా ఒకసారి విజయవాడలో పుస్తక మహోత్సవం నిర్వహిస్తుంటాం. కానీ ఈ ఏడాది క్యాలెండర్ సంవత్సరంలో రెండు సార్లు నిర్వహిస్తున్నాం. పుస్తక ప్రచురణకర్తలే కాకుండా సాహితీవేత్తలు, ఇతర కళాసంస్థల నిర్వాహకులు, సాహితీ అభిమానులు, నగర ప్రముఖులు ఇలా ప్రతి ఒక్కరూ పుస్తక మహోత్సవం విజయవంతానికి అండగా నిలిచారు. ప్రభుత్వ శాఖలు సైతం ఈ ఏడాది అపూర్వమైన సహకారాన్ని అందిస్తున్నాయి.

– విజయకుమార్, ఎమెస్కో అధినేత



అపూర్వ ఆదరణ..

దేశంలో చాలా ప్రాంతాల్లో పుస్తక మహోత్సవాలు జరుగుతుంటాయి. అయితే దక్షిణాది రాష్ట్రాల్లో విజయవాడ పుస్తక మహోత్సవానికి అపూర్వమైన ఆదరణ ఉంటుంది. దేశంలోని ప్రచురణకర్తలందరూ ఇక్కడకు రావటానికి ఆసక్తి చూపుతుంటారు. అలాగే ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి సైతం పెద్ద సంఖ్యలో పాఠకులు ఇక్కడకు వస్తుంటారు. ప్రతి ఏడాది క్రమం తప్పకుండా పుస్తక మహోత్సవాన్ని తిలకించే వారు చాలా మంది ఉన్నారు.

– టి. మనోహరనాయుడు, అధ్యక్షుడు, బుక్ ఫెస్టివల్ సొసైటీ

దరఖాస్తులు పెండింగ్ లేకుండా పరిష్కరిస్తున్నాం
ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ–2024లో భాగంగా జనవరి 22న ప్రచురించనున్న తుది జాబితాకు నమోదవుతున్న దరఖాస్తులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు. సచివాలయంలోని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి శుక్రవారం ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ 2024లో భాగంగా నమోదవుతున్న దరఖాస్తులు, అభ్యంతరాలు, పోలింగ్ కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతులు, అధికారులు, సిబ్బంది తదితర అంశాలపై రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలోని కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సబ్ కలెక్టర్ అదితి సింగ్, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు హాజరయ్యారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో 1781 పోలింగ్ స్టేషన్లు గుర్తించామని, అన్ని మౌలిక వసతులు కల్పించి సిద్ధంగా ఉంచామని కలెక్టర్ వివరించారు.

యార్డులో 47,192 బస్తాల మిర్చి
కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 45,336 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 47,192 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.22,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 24,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,000 నుంచి రూ.22,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,000 నుంచి 23,300 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 25,990 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కె.శ్రీనివాసరావు తెలిపారు.

దీవెన.. భవితకు ఉద్దీపన



విద్యార్థులకు చెక్ అందజేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, చిత్రంలో డెప్యూటీ మేయర్ శ్రీశైలజారెడ్డి, తదితరులు

జగనన్న విద్యా దీవెన నిధులు విడుదల
- ఎన్టీఆర్ జిల్లాలో 31,482 మందికి రూ. 25.53 కోట్లు
- జిల్లా స్థాయి కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు
- విద్యార్థులకు చెక్కు పంపిణీ

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): గతంలో ఎన్నడూలేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం విద్య కోసం ఎక్కువ మొత్తంలో ఖర్చు చేస్తోందని.. దీనిని సద్వినియోగం చేసుకుని కెరీర్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీ రావు విద్యార్థులకు సూచించారు. 2023 జూలై–సెప్టెంబర్ త్రైమాసికానికి సంబంధించి జగనన్న విద్యా దీవెన కింద పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ నగదును నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి భీమవరంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్, ప్రజాప్రతినిధులు, విద్యార్థులతో కలిసి ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య ఆవశ్యకతను గుర్తించి ఈ రంగంలో విప్లవాత్మక కార్యక్రమాలు, పథకాలను అమలు చేస్తోందన్నారు. పేద కుటుంబాల్లోని పిల్లల చదువులకు పేదరికం అడ్డుకాకూడదనే ఉద్దేశంతో జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన తదితర పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.

క్రమం తప్పకుండా..

జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే పేద విద్యార్థులు కాలేజీలకు చెల్లించాల్సిన పూర్తి ఫీజుల మొత్తాన్ని క్రమం తప్పకుండా కుటుంబంలో ఎంత మంది పిల్లలుంటే అంత మంది పిల్లలకు ఇచ్చేలా వారి తల్లుల ఖాతాల్లో నేరుగా ప్రభుత్వం జమ చేస్తోందని కలెక్టర్ వివరించారు. జగనన్న విద్యా దీవెన పథకం కింద 2023, జూలై–సెప్టెంబర్ త్రైమాసికానికి జిల్లాలో 31,482 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, ముస్లిం మైనారిటీ, కాపు, క్రిస్టియన్ మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ. 25.53 కోట్లు జమ చేశామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో విజయవాడ నగరపాలక సంస్థ డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ టి.జమల పూర్ణమ్మ, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు తోలేటి శ్రీకాంత్, ఎం.శివరామకృష్ణ, కూరపాటి గీతాంజలి, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి బీవీ విజయభారతి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఎం.రుక్మాంగదయ్య పాల్గొన్నారు.

ఎవరికి ఎంతంటే..

ఎస్సీ విద్యార్థులు 9,735 మందికి రూ. 7.18 కోట్లు, ఎస్టీ విద్యార్థులు 1,083 మందికి రూ. 88.95 లక్షలు, బీసీ విద్యార్థులు 11,759 మందికి రూ. 9.50 కోట్లు, ఈబీసీ విద్యార్థులు 4,031 మందికి రూ. 3.95 కోట్లు, ముస్లిం విద్యార్థులు 1,948 మందికి రూ. 1.52 కోట్లు, కాపు విద్యార్థులు 2726 మందికి రూ. 2.28 కోట్లు, క్రిస్టియన్ మైనార్టీ విద్యార్థులు 200 మందికి రూ. 18.65 లక్షలు మేర లబ్ధి చేకూరినట్లు కలెక్టర్ ఢిల్లీరావు వివరించారు. అనంతరం విద్యార్థులకు చెక్‌ను అందజేశారు.

టీడీపీకి పశ్చిమం ఆరోవేలేనా!

- తెలుగుదేశం పార్టీకి విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ఆరో వేలితో సమానమా.. అనే ప్రశ్నకు అవుననే సమాధానం వస్తోంది.
- నియోజకవర్గ నాయకుల మధ్య నిత్యం రగడ రగులుకుంటూ ఉండటానికి కారణం అధిష్టానమా... అంటే అదే నిజమనిపిస్తోంది.
- కేశినేని శ్రీనివాస్ (నాని), బుద్దా వెంకన్న, నాగుల్‌మీరా తదితర నాయకులు, వారి బృందాలు వైరి వర్గాలుగా కొనసాగుతుండటానికి బాధ్యులెవరంటే .. అన్ని వేళ్లూ అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్‌ల వైపే.. అని ఆ పార్టీ సీనియర్లు, రాజకీయ విశ్లేషకులు స్పష్టంగా అంటున్నారు. టీడీపీ విజయవాడ పశ్చిమ నియోజకవర్గాన్ని అవసరం లేనిది(ఆరోవేలు) గానే చూస్తుంటుందనేది జవాబు.

- పొగ పెట్టేది.. మంట రాజేసేది బాబే?
- విజయవాడ వెస్ట్‌లో అందరున్నా ఎంపీకి బాధ్యతేల అంటున్న క్యాడర్
- కేశినేనితో బుద్దా, మీరా బృందాలకు తొలి నుంచి పేచీలే
- వామపక్షాలు జతకలిస్తే జనసేనకు మొండి చెయ్యేనా?
- ముందు చూపుతోనే గొడవలకు అధిష్టానం ఆజ్యం పోసిందా?

సాక్షి, విజయవాడ: ఎన్టీఆర్‌ను తోసేసి పార్టీని ఆక్రమించేసుకున్నప్పటి నుంచి పశ్చిమ నియోజకవర్గం బాబుకు ఒక ఆప్షన్ మాత్రమే అనేది నిరూపితమైనదే. ఏ పార్టీతో రాజకీయ అవగాహన కుదిరినా ఆ స్థానాన్ని అలవోకగా కేటాయించేస్తున్నారు. ఆ స్థానాన్ని ఆశించే పార్టీల వాస్తవ బలాబలాలు ఎలాగున్నా.. రెండు పరస్పర వైరి సిద్ధాంతాలు కలిగిన పార్టీలకైనా సరే ఇచ్చేస్తున్నారు. వామపక్షాలకు, బీజేపీకి పశ్చిమాన్ని ఇచ్చేయడమే ఇందుకు నిదర్శనం. రానున్న ఎన్నికల్లో తమకు ఈ సీటు దాదాపు రిజర్వు అయ్యిందనేది జనసేన నుంచి బలంగా వినిపిస్తున్న మాట. రాజకీయవర్గాల్లో విస్తృతంగా జరుగుతున్న ప్రచారం కూడా.

తాంబూలాలిచ్చాం.. తన్నుకు చావండి..

పశ్చిమ నియోజకవర్గంలోని నాయకుల మధ్య తగువులు పెట్టేది, వారిని ప్రోత్సహించేది అధిష్టానమే అన్నది ఉమ్మడి కృష్ణాలోని టీడీపీ నాయకులకు తెలియని అంశమేమీ కాదు. నియోజకవర్గం పరిధిలో సీనియర్ నాయకులు ఎందరున్నా వారిని పక్కనపెట్టి విజయవాడ ఎంపీ కేశినేనికి రెండేళ్ల కిందట కో ఆర్డినేటర్ బాధ్యతలను చంద్రబాబు అప్పగించారు. పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్‌మీరా, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఫతావుల్లా, వాణిజ్య విభాగ రాష్ట్ర అధ్యక్షుడు దూండి రాకేష్ తదితరులు ఉన్నారు. బుద్దా వెంకన్న ఎమ్మెల్సీగానే కాకుండా నగర పార్టీ అధ్యక్షుడిగా, ప్రభుత్వ విప్‌గా, రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా పని చేశారు. నాగుల్‌మీరా గతంలో పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జిగా, నూర్‌బాషా సంఘం రాష్ట్ర నాయకుడిగా ఉన్నారు. నియోజకవర్గంపై పార్టీ దృష్టి ఏమాత్రం ఉన్నా ఇందరు నాయకుల్లో ఎవరో ఒకరికి బాధ్యతలు అప్పగించి పార్టీని గాడిలో పెట్టి ఉండవచ్చు. తక్షణ అవసరంగా ఎంపీకి పశ్చిమ కో ఆర్డినేటర్ బాధ్యతలను అప్పగించినా రెండేళ్లుగా అలాగే కొనసాగించాల్సిన అవసరం ఏంటనేది స్వపక్షీయుల ప్రశ్న. ఎంపీకి నేతృత్వం అప్పగించినా తమందరినీ పక్కనపెట్టి ఏ పదవీలేని ఎం.ఎస్. బేగ్‌కు అంత ప్రాధాన్యం ఎలా ఇస్తారనేది ప్రధాన వాదన. యువగళం ముగింపు సభలో మైనార్టీల తరఫున ప్రసంగించే అవకాశాన్ని బేగ్‌కు ఇవ్వడంపైనా రగడ జరిగిన సంగతి తెలిసిందే. పశ్చిమ నేతల మధ్య రగడకు స్క్రీన్‌ప్లే, దర్శకత్వం అధిష్టానిదేనని, తగువు పెట్టాం తన్నుకు చావండని ప్రోత్సహిస్తోందని పార్టీ సీనియర్ల విశ్లేషణ.

ఒంటరిగా ఎన్నికలకు వెళ్లలేమనే..

ఎన్నికల్లో ఒంటరిగా పోటీచేసి గెలవలేమని, ఎన్ని పార్టీలతోనైనా సీట్ల బేరసారాల ఒప్పందాలు కుదుర్చుకుంటామనే అంచనాలతోనే పశ్చిమ నియోజకవర్గం ఆప్షన్‌ను అలాగే ఉంచుకున్నట్లు స్పష్టమవుతోంది. రానున్న ఎన్నికల్లో కుదిరే ఒప్పందాల ఆధారంగా జనసేన/సీపీఐ/బీజేపీ.. కేటాయించే అవకాశాలు లేకపోలేదని సీనియర్లు ముక్తాయిస్తున్నారు.

గాడిలో పెట్టే యోచన ఏది..?

నియోజకవర్గంలో పార్టీని పటిష్ట పరచాలన్నా, గాడిన పెట్టాలన్నా అధిష్టానం దృష్టి సారిస్తుంది. ఇది ఏ పార్టీకైనా సాధారణం, అవసరం కూడా. నిత్యం పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని, వివాదాస్పద వ్యాఖ్యలు చేసేవారిని, జిల్లా పార్టీ అధ్యక్షుడు, కో ఆర్డినేటర్‌కు వ్యతిరేకంగా వ్యవహరించేవారి పట్ల చర్యలు తీసుకోవాలి. అలా వీలుకాని పక్షంలో కో ఆర్డినేటర్‌ను మార్చుకుని చక్కదిద్దగలిగే వారికి బాధ్యతలు అప్పగించడం పరిపాటి. అలాంటివేమీ చేయడం లేదంటే పశ్చిమ నియోజకవర్గంను అధిష్టానం ఆరోవేలుగా పరిగణిస్తున్నట్లుగా అర్థం చేసుకోవాలని పరిశీలకుల అభిప్రాయం.

భిన్న ధృవాలైన సీపీఐ, బీజేపీలకు..

చంద్రబాబు టీడీపీ పగ్గాలను చేజిక్కించుకున్నప్పటి నుంచి ఒంటరిగా పోటీ చేసిన దాఖలాలు లేవు. 1998 పార్లమెంటు ఉప ఎన్నికలు మొదలు 1999, 2004, 2009, 2014 ఎన్నికల్లో వామపక్షాలు, బీజేపీ, మహా కూటమి, జనసేనలతో కలిసే టీడీపీ పోటీ చేసింది. 2019లో ఒంటరిగా చేసినా ఫ్రెండ్లీ కంటెస్ట్ (లోగుట్టు ఒప్పందం) ముసుగులో కొనసాగినవే. టీడీపీ ఆవిర్భావం నుంచి 1983లో మాత్రమే గెలుపొందింది. నేరుగా పోటీచేసిన 2004, 2009, 2019లో ఓటమి చవిచూసింది. తక్కిన ఎన్నికల్లో సీపీఐ, బీజేపీలకు కేటాయించింది. అందుకే తమ పార్టీకి పశ్చిమ నియోజకవర్గం ఆరోవేలు అనేది స్వపక్షీయుల విశ్లేషణ.

విజయవాడ మీదుగా అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు

నేడు ప్రారంభించనున్న ప్రధాని నరేంద్రమోదీ

రైల్వేస్టేషన్ (విజయవాడపశ్చిమ): అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును విజయవాడ డివిజన్ మీదుగా నడపనున్నట్లు విజయవాడ రైల్వే డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్ తెలిపారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం మాల్దా టౌన్ నుంచి బెంగళూరు వరకు వెళ్లే ఈ సూపర్‌ఫాస్ట్ ప్యాసింజర్ రైలుతో పాటు వందేభారత్ రైలును ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ప్రారంభిస్తారని చెప్పారు. శుక్రవారం డీఆర్‌ఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అమృత్ఎక్స్‌ప్రెస్ రైలులో 22 ఎల్‌హెచ్‌బీ కోచ్‌లలో 12 నాన్ ఎయిర్ కండిషన్డ్ స్లీపర్ క్లాస్‌లు, 8 జనరల్ అన్‌రిజర్వుడ్ కోచ్‌లతో అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. సౌకర్యవంతమైన సీట్లు, పబ్లిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్, సీసీ టీవీ, పరిశుభ్రత, ఆధునిక టాయిలెట్లు తదితర ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. విజయవాడ డివిజన్‌లోని తుని, సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు స్టేషన్లలో రైలు ఆగుతుందన్నారు. ఏడీఆర్‌ఎం డి.శ్రీనివాసరావు, సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు, పీఆర్వో నుస్రత్ మంద్రూప్కర్ పాల్గొన్నారు.



డీఆర్‌ఎం నుంచి ఐఎస్‌ఓ సర్టిఫికెట్‌లు అందుకున్న పలు స్టేషన్‌ల అధికారులు

20 స్టేషన్‌లకు ఐఎస్‌ఓ సర్టిఫికెట్‌లు

విజయవాడ రైల్వే డివిజన్‌లో 20 స్టేషన్‌లు ఐఎస్ఓ సర్టిఫికెట్‌లు సాధించడం డివిజన్‌కే గర్వకారణమని డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్ పేర్కొన్నారు. శుక్రవారం విజయవాడలోని డివిజనల్ కార్యాలయంలో ఆయా రైల్వే స్టేషన్‌ల ఇన్‌చార్జ్‌లు, హెల్త్ ఇన్‌స్పెక్టర్లకు డీఆర్‌ఎం చేతుల మీదుగా సర్టిఫికెట్‌లను అందజేశారు. విజయవాడ, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, తుని, అనకాపల్లి, గుడివాడ, భీమవరం టౌన్, భీమవరం జంక్షన్, నర్సాపూర్, కాకినాడ టౌన్, కాకినాడ పోర్టు స్టేషన్‌లలో సీపీసీబీ మార్గదర్శకాలకు అనుగుణంగా 2019–20లో చేపట్టిన పర్యావరణ ప్రమాణాలు పాటించడం ద్వారా సర్టిఫికెట్‌లు సాధించినట్లు డీఆర్‌ఎమ్ తెలిపారు. ఈ సందర్భంగా డివిజనల్ ఎన్విరాన్మెంట్, హౌస్ కీపింగ్ మేనేజర్ ఎమ్.శ్రీకాంత్‌ను అభినందించారు. ఏడీఆర్‌ఎం డి.శ్రీనివాసరావు, సీనియర్ డీఓఎం నరేంద్ర వర్మ తదితరులు పాల్గొన్నారు.

భవానీ దీక్ష విరమణ ఏర్పాట్లు పరిశీలన


హోమగుండాలను పరిశీలిస్తున్న డీసీపీ విశాల్‌గున్ని, ఈఈ రమాదేవి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): జనవరి 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నిర్వహించే భవానీ దీక్ష విరమణ ఏర్పాట్లను డీసీపీ విశాల్‌గున్ని శుక్రవారం పరిశీలించారు. కనకదుర్గ నగర్, మహామండపం వద్ద హోమ గుండాలు, ఇరుముడులను సమర్పించే కౌంటర్లతో పాటు క్యూలైన్లను నిశితంగా గమనించారు. తొలుత సీతమ్మ వారి పాదాల వద్ద కేశఖండనశాల, స్నాన ఘాట్లలో షవర్ల ఏర్పాటు గురించి ఆలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మహా మండపం వద్దకు చేరుకున్న అనంతరం అక్కడి పరిసరాల్లో చేస్తున్న ఏర్పాట్లపై వివరాలు సేకరించారు. భవానీలు అమ్మవారిని దర్శించుకున్న తర్వాత కొండ దిగువకు చేరుకునే మార్గాలను పరిశీలించి దేవస్థాన అధికారులకు పలు సూచనలు చేశారు. గోశాల వద్ద నిర్మిస్తున్న నాల్గో హోమగుండం నిర్మాణ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. పనులు తుది దశకు వచ్చినట్లు దుర్గగుడి ఈఈ ఎల్.రమాదేవి పేర్కొన్నారు. దీక్ష విరమణలకు విచ్చేసే భవానీలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెస్ట్ ఏసీపీ హనుమంతరావు, దేవస్థాన ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో నలుగురికి కరోనా

మచిలీపట్నంటౌన్: జిల్లా కేంద్రంలోని ఈడేపల్లి జట్టి నరసింహం ప్రభుత్వ వృద్ధాశ్రమంలో ఉంటున్న 70 ఏళ్ల వృద్ధుడికి వైరస్ సోకినట్లు గురువారం నిర్ధారణ అయ్యింది. దీంతో ఆశ్రమంలోని వృద్ధుల నుంచి శాంపిళ్లను సేకరించారు. శుక్రవారం నలుగురికి వైరస్ సోకినట్లు నిర్ధారణ అయింది. నగరానికి చెందిన మరో వ్యక్తి లక్షణాలతో ప్రభుత్వాసుపత్రిలో చేరగా ఆయనకు కూడా వైరస్ సోకినట్లు తేలింది. ఈయనను ప్రత్యేక వార్డులో ఉంచి వైద్య సేవలు అందిస్తున్నారు.

అనువాదాలతో జాతీయ సమైక్యత

ప్రముఖ రచయిత యార్లగడ్డ లక్ష్మీప్రసాద్



సాహిత్య వేదికపై పుస్తకాలు ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

పస్‌టౌన్(విజయవాడపశ్చిమ): అనువాదాలతో జాతీయ సమైక్యత సాధ్యమైందని ప్రముఖ రచయిత, అనువాదకులు పద్మవిభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. ఏ భారతీయ భాషా రచన అయినా జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతి దక్కించుకోవాలంటే దానిని హిందీలోకి అనువదించాలని తెలిపారు. విజయవాడ పుస్తక మహోత్సవ ప్రాంగణంలో కేతు విశ్వనాథ రెడ్డి సాహిత్య వేదికపై శుక్రవారం సాయంత్రం డాక్టర్ వెన్నా వల్లభరావు తెలుగులోకి అనువదించిన అశోక శోకం హిందీ నాటకాన్ని యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఆవిష్కరించారు. వల్లభరావు తెలుగులో రాసి ఆంగ్లంలోకి అనువదించిన 'పింగళి వెంకయ్య, డిజైనర్ ఆఫ్ ట్రైకలర్' పుస్తకాన్ని మైనారిటీ సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి ఇంతియాజ్ అహ్మద్ ఆవిష్కరించారు. అనంతరం యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా అత్యంత పూజ్యనీయులైన ఐదుగురిలో శ్రీకృష్ణుడు, మహ్మద్ ప్రవక్త, ఏసుక్రీస్తు, బుద్ధ భగవానుడు, మహాత్మాగాంధీలలో ముగ్గురు భారతీయులు కావడం మనకు గర్వకారణమని చెప్పారు. వీరిలో బుద్ధభగవానుడికి ప్రపంచ ఖ్యాతి రావడానికి అశోకుడు కారణమన్నారు. వెన్నా వల్లభరావు అశోకుడిని తెలుగువారికి పరిచయం చేయడానికి ఈ గ్రంథం ఉపకరిస్తుందన్నారు. మైనారిటీ సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ మూలరచనకు వన్నె తెచ్చేలా అనువాదం చేయడం వల్లభరావు గొప్పతనమని పేర్కొన్నారు. పింగళి వెంకయ్య చరిత్రను, త్యాగాలను సాధికారికంగా అందరికీ పరిచయం చేసినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. పుస్తకాన్ని సాహితీ పోషకులు గోళ్ల నారాయణరావు, 'పింగళి వెంకయ్య' పుస్తకాన్ని ప్రచురణకర్త నండూరి రాజగోపాల్ సభకు పరిచయం చేశారు. వర్తమానానికీ, గతానికీ మధ్య నిరంతర సంభాషణే చరిత్ర కనుక దానిని మరింత చక్కగా అర్థం చేసుకొనేందుకు వెన్నా వల్లభరావు పుస్తకాలు ఉపయోగపడతాయని వివరించారు. సాహితీవేత్త కొచ్చెర్లకోట వెంకటసుబ్బారావు రచయితల విశిష్టతను వివరించారు.

ముస్లిం వైతాళికులలో అగ్రగణ్యుడు హమీద్ దల్వాయి

దేశంలో ముస్లిం వైతాళికులలో అగ్రగణ్యుడు హమీద్ దల్వాయి అని ప్రముఖ కవి ఖాదర్ మొహిద్దీన్ అన్నారు. ప్రముఖ మరాఠీ రచయిత హమీద్ దల్వాయి అనువాద కథా సంపుటిని కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై శుక్రవారం సాయంత్రం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సమాజంలో బలహీనులకు అండగా రచనలు, సామాజిక ఉద్యమాలు చేసిన వ్యక్తి హమీద దల్వాయి అన్నారు. ఆయన స్వాతంత్ర దేశపు తొలి తరపు ముస్లిం రచయితల్లో ఒకరన్నారు. మెజారిటీ దృష్టితో మైనారిటీలను చూసి అర్థం చేసుకోవాలని, దాన్ని ముస్లింలకు వివరించి, రెండు వర్గాలకు మధ్య సయోధ్య కుదర్చాలని ఆయన రచనల ద్వారా, కార్యకలాపాల ద్వారా ప్రయత్నించారన్నారు. ఎలమి ప్రచురణలు వారు ముద్రించిన ఈ పుస్తకాన్ని రచయిత వెంకట నారాయణ గుండ్ల సమీక్షించారు. ప్రచురణ సంస్థ అధినేత పూర్ణిమా తమ్మిరెడ్డి, ప్రయోక్త మీనా సభను నిర్వహించారు. సాహితీ వేదికపై నిర్వహించిన మూడో సభలో ఎం.ప్రభాకర్ రాసిన 'పుణ్యభూమి', 'విధ్వంసం, వీరులు, వైద్యులు' పుస్తకాలను మొండెపు ప్రసాద్ ఆవిష్కరించారు.

అండర్-14 క్రికెట్ జిల్లా జట్టు ఎంపిక

విజయవాడ స్పోర్ట్స్: సెంట్రల్ జోన్ అంతర జిల్లాల అండర్-14 బాలుర క్రికెట్ మ్యాచ్‌లకు ప్రాతినిధ్యం వహించే ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు కృష్ణా జిల్లా క్రికెట్ అసోసియేషన్ అడహక్ కమిటీ చైర్మన్ టి.త్రినాథ్‌రాజు తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఎంపిక పోటీల్లో అత్యుత్తమ క్రీడా నైపుణ్యం ప్రదర్శించిన టి. హర్షసాయిసాత్విక్ (కెప్టెన్), సుయిన్‌బర ద్వాజ్ (కీపర్), బి. ఆకర్ష్, యజ్ఞ వల్క, బి.ప్రణీత్, డి.భానుచంద్‌యాదవ్, టి.భానుచైతన్య, ఎ.మైఖేల్, ఎస్.ధ్రువచంద్ర, కె.సాయిఅస్విత్, ఎం.రణదీర్, డి.సంజయ్, కె.తమన్‌సాయి, వై.లలిత్, ప్రబాల్‌రెడ్డి, పరమధామ, స్టాండ్‌బైగా పి.జె.అభిరామ్‌నిహాల్, జి.గౌతమ్, షేక్ నహీద్‌బాదరి, జి.సాయిసహర్ష, ఎ.అభిషేక్‌రత్న, ఎస్.హర్ష ఎంపికైనట్లు వివరించారు. జట్టుకు కోచ్‌గా ఎన్.జ్యోతిసాయికృష్ణ వ్యవహరిస్తారన్నారు. జనవరి మూడు నుంచి ఐదో తేదీ వరకు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పేరేచర్ల, నరసరావుపేటలో జరిగే పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందన్నారు.

మెడికల్ షాపులో చోరీకి పాల్పడిన వ్యక్తికి జైలు

విజయవాడ స్పోర్ట్స్: మెడికల్ షాపులో చోరీకి పాల్పడిన వ్యక్తికి నాలుగు నెలలు జైలు శిక్ష విధిస్తూ మూడో అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎస్.జ్యోతి శుక్రవారం తీర్పు చెప్పారు. సత్యనారాయణపురం ప్రాంతంలో ఓ మహిళ మెడికల్ షాపును నిర్వహించేంది. ప్రతి రోజూ మాదిరిగానే 2023 జూలై 27వ తేదీ రాత్రి షాపును మూసివేసి ఇంటికి వెళ్లింది. మరుసటి రోజు ఉదయం షాపు వద్దకు వచ్చిన ఆమె షట్టర్ తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించి పోలీసులను ఆశ్రయించింది. ఆగస్టు 22వ తేదీన రైల్వే స్టేషన్ ప్రాంతంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న షేక్ హుస్సేన్‌సాగర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించడంతో వెంటనే కోర్టులో హాజరుపర్చారు. ప్రాసిక్యూషన్ తరుపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉమావతి కోర్టుకు వాదనలు వినిపించారు.

ఏపీపీఎస్సీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించండి

డీఆర్వో పెద్ది రోజా


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో పెద్ది రోజా

చిలకలపూడి(మచిలీపట్నం): ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు సంబంధించిన పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా అన్నారు. పెనమలూరు మండలం కానూరులోని సైలేష్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కార్యాలయంలో కంప్యూటర్ పరీక్ష శనివారం నిర్వహించనున్నారని చెప్పారు. ఈ పరీక్షకు 355 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు ఎటువంటి సెల్‌ఫోన్స్, కాలుక్యులేటర్, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకుండా సిబ్బంది, అధికారులు గమనించాలని ఆదేశించారు. ఎవరైనా వికలాంగులు ఉంటే ఎటువంటి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అభ్యర్థులను హాల్ టిక్కెట్లను పరిశీలించి పరీక్షా కేంద్రంలోకి అనుమతించాలన్నారు. సమావేశంలో కలెక్టరేట్ కో-ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ ఎం.సురేష్, పెనమలూరు తహసీల్దార్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఢిల్లీరావుకు తెలుగు మహాసభల ఆహ్వానం


జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావుకు ఆహ్వాన పత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు అనురాధ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తెలుగు భాష వైభవాన్ని విశ్వ వ్యాప్తం చేసే దిశగా జనవరి 5వ తేదీ నుంచి మూడు రోజులపాటు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నిర్వహించే రెండో అంతర్జాతీయ తెలుగు మహాసభలకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావును ఆహ్వానించారు. కలెక్టర్ ఢిల్లీరావుకు గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి కొడాలి అనురాధ ఆహ్వాన పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆహ్వాన కమిటీ సభ్యులు అనురాధ మాట్లాడుతూ జనవరి 5 నుంచి 7వ తేదీ వరకు మూడు రోజులు పాటు శ్రీ రాజరాజ నరేంద్రుల వారి పట్టాభిషేక మహోత్సవ సహస్రాబ్ది సందర్భంగా సాంస్కృతిక రాజధానిలో అంతర్జాతీయ తెలుగు మహాసభలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించామని చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని గోదావరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రాంగణంలో అంతర్జాతీయ తెలుగు మహాసభలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ వేదికపై హరికథ, బుర్రకథ, యక్షగానం, అవధానం, పౌరాణిక, సాంఘిక నాటకం, వాగ్గేయకార సంగీతం, లలిత చలనచిత్ర జానపద సంగీతం, ఆంధ్ర నాట్యం, కూచిపూడి నృత్యాలు, సంచారజాతుల కళా ప్రదర్శనలు ఉంటాయని వివరించారు.

మహాశక్తిమంత దేశంగా భారత్

వికసిత భారత్ జిల్లా ప్రభరీ అధికారి రామచంద్రుడు


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న రామచంద్రుడు, నాగేశ్వరనాయక్, ఇతర అధికారులు

పమిడిముక్కల(పామర్రు): ప్రపంచంలో భారత్ మహా శక్తిమంత దేశంగా నిలవనుందని వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జిల్లా ప్రభరీ అధికారి ఎం.రామచంద్రుడు తెలిపారు. మండలంలోని చోరగుడి, పమిడిముక్కల గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచంద్రుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు పథకాలున్నాయని, వాటి గురించి తెలుసుకుని అందరూ లబ్ధి పొందాలని సూచించారు. సామాజిక, విద్యా, ఆరోగ్య, ఆర్థిక పరంగా ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వర నాయక్ మాట్లాడుతూ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు క్యాలెండర్, బుక్‌లెట్స్ అందజేస్తున్నట్లు చెప్పారు. తొలుత పీఎం మోడీ సందేశం విన్పించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఆయుష్మాన్ భారత్ కార్డులు, గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేసి లబ్ధిదారుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. క్యాలెండర్, బుక్‌లెట్, బ్రోచర్లను ప్రజలకు అందజేశారు. మెడికల్, పోస్టల్, గ్యాస్ ఏజెన్సీ, ప్రకృతి వ్యవసాయ వనరుల స్టాల్స్ పరిశీలించారు. అనంతరం డ్రోన్‌పై రైతులకు, మహిళలకు అవగాహన కల్పించారు. డ్వాక్రా మహిళలకు 80 శాతం సబ్సిడీపై, రైతులకు 50 శాతం సబ్సిడీపై డ్రోన్ అందజేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమాన్ని బాగా నిర్వహించిన సర్పంచ్, కార్యదర్శిని రామచంద్రుడు ప్రత్యేకంగా అభినందించారు. సర్పంచులు కందిమళ్ల పూర్ణకుమారి, ముళ్లపూడి సునీత, ఎంపీటీసీ మర్రి దుర్గారావు, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, ఎంపీడీఓ విఠల్‌పాల్, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఈవోఆర్డీ వెంకటేశ్వరరావు, డీఎల్‌పీఓ సంపత్‌కుమారి, ఏఓ గణేష్‌రెడ్డి, వైద్యులు సైరా కటూన్, ఏఈలు భవానీ ప్రసాద్, వెంకటేశ్వరరావు, ఏపీఎం వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

మినీ ఫ్లై ఓవర్ నిర్మాణంతో ట్రాఫిక్ సమస్యలకు చెక్


పూర్తయిన మినీ ఫ్లై ఓవర్ నిర్మాణం


ఎయిర్‌పోర్ట్ ఎదురుగా నిర్మిస్తున్న బస్టాప్

విమానాశ్రయం(గన్నవరం): అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారిపై చేపట్టిన మినీ ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయింది. కాంట్రాక్ట్ సంస్థ కేవలం 15 నెలల్లోనే నిర్మాణ పనులను వేగంగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం తుది మెరుగులు దిద్దుకుంటున్న మినీ ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవానికి నేషనల్ హైవే అథారిటీ అధికారులు సిద్ధం చేస్తున్నారు. కేసరపల్లి నుంచి విమానాశ్రయం వరకు ఎదురవుతున్న ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు ఫ్లై ఓవర్ నిర్మాణానికి ఎన్‌హెచ్‌ఏఐ ముందుకొచ్చింది.

రూ. 24 కోట్లతో నిర్మాణం....

సుమారు రూ. 24 కోట్లు వ్యయంతో గన్నవరం నుంచి విజయవాడ వెళ్లే రూటులో కిలోమీటర్ పొడవునా మినీ ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టారు. నూతనంగా ఏర్పాటు చేయనున్న విమానాశ్రయ ముఖద్వారం వద్ద అండర్ బ్రిడ్జి నిర్మించారు. ఈ బ్రిడ్జికి ఇరువైపులా అప్రోచ్ వాల్ నిర్మాణం పూర్తి కావడంతో అనుసంధాన ప్రక్రియ ముగిసింది. ఫ్లై ఓవర్‌పై రెండు లైన్ల రహదారి నిర్మాణం పూర్తిచేసి వాహనాల రాకపోకలకు మార్గం సుగమం చేశారు. ఇటీవల మినీ ఫ్లై ఓవర్‌పై లోడ్ టెస్ట్ కోసం ట్రయిల్ రన్ సైతం విజయవంతంగా నిర్వహించారు. ఇంకా రహదారిపై మార్కింగ్, విద్యుత్ దీపాల ఏర్పాటు, వెటర్నరీ కళాశాల, ఎయిర్‌పోర్ట్ వద్ద బస్టాప్‌ల నిర్మాణ పనులను పూర్తిచేయాల్సి ఉంది. వీటిని కూడా జనవరి నాటికి పూర్తిచేసి మినీ ఫ్లై ఓవర్‌ను జాతికి అంకితం చేసే దిశగా ఎన్‌హెచ్‌ఏఐ, కాంట్రాక్ట్ సంస్థ సమాయత్తమవుతుంది.

వాహనం విలువ వడ్డీతో సహా చెల్లించండి

వినియోగదారుల కమిషన్ తీర్పు

చిలకలపూడి(మచిలీపట్నం): మరమ్మతులకు గురవుతున్న వాహనాన్ని స్వాధీనం చేసుకుని ప్రత్యామ్నాయంగా మరో వాహనాన్ని ఇవ్వాలని లేదా వాహనం విలువతో పాటు వడ్డీని కూడా చెల్లించాలని వినియోగదారుల కమిషన్ చైర్మన్ చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యులు నందిపాటి పద్మారెడ్డి, శ్రీలక్ష్మీరాయల శుక్రవారం తీర్పు చెప్పారు. పామర్రుకు చెందిన కొల్లారెడ్డి సఖిత హోండా యాక్టివా స్కూటర్‌ను 2022 ఫిబ్రవరి 5వ తేదీన సంతోష్ ఆటోమోటివ్స్‌లో కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన మూడు నెలల నుంచి వాహనం మరమ్మతులకు గురవ్వటంతో పాటు సడన్‌గా ఆగిపోతోంది. ఎన్నిసార్లు సర్వీస్ సెంటరులో చూపినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. 2022 నవంబరు 25వ తేదీన కొనుగోలు చేసిన సంతోష్ ఆటోమోటివ్స్‌లో వాహనాన్ని అప్పజెప్పినప్పటికీ ఈ రోజు వరకు రిపేరు చేసి తిరిగి ఇవ్వలేదు. దీంతో కొల్లారెడ్డి సఖిత వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. పూర్వాపరాలు విచారించిన అనంతరం కమిషన్ సభ్యులు వినియోగదారునికి మరమ్మతులు చేసిన వాహనాన్ని అప్పగించాలని లేదా అదే మోడల్ గల వాహనాన్ని ఇవ్వాలని లేదా వాహనం విలువ 9 శాతం వడ్డీతో 2023 జనవరి 17వ తేదీ నుంచి చెల్లించాలన్నారు. మానసిక వేదనకు గురిచేసినందుకు రూ. 50 వేలు, ఖర్చుల నిమిత్తం రూ. 5 వేలు కూడా తీర్పు వెలువడిన 30 రోజుల్లోగా చెల్లించాలన్నారు.

ఉపాధి పథకంలో లంక భూముల అభివృద్ధి

పమిడిముక్కల: గతంలో ఏవిధమైన గుర్తింపు లేని లంక భూములకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్టాలిచ్చారని, ఆ భూములను ఉపాధి పథకంలో అభివృద్ధి చేసుకోవాలని డ్వామా పీడీ సూర్యనారాయణ తెలిపారు. మండల పరిషత కార్యాలయం వద్ద శుక్రవారం ఉపాధి హామీ పథకం ప్రజావేదిక నిర్వహించారు. గత ఏడాది గ్రామాల్లో నిర్వహించిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీలో గుర్తించిన అంశాలపై ప్రజావేదికలో చర్చించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఉపాధి పథకం పేదలకు వరం లాంటిదన్నారు. లంక భూములపై రైతులకు హక్కులు దక్కిన నేపథ్యంలో ఉద్యాన, అంతర్ పంటలు సాగు చేసుకొంటే ఉపాధి పథకం ద్వారా సహకారం అందిస్తామని చెప్పారు. ఏపీడీలు నాంచారరావు, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనకు జిల్లా ప్రాజెక్టులు


ఎంపికైన విద్యార్థులు, ఉపాధ్యాయుడితో జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ జాకీర్ అహ్మద్

కంకిపాడు: రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో కృష్ణా జిల్లా సత్తా చాటింది. వ్యక్తిగత, గ్రూపు, ఉపాధ్యాయ విభాగాల్లో ఇచ్చిన ప్రదర్శన దక్షిణ భారత స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యాయి. ఈ మేరకు జిల్లా సైన్సు అధికారి మహమ్మద్ జాకీర్ అహ్మద్ శుక్రవారం సాక్షితో మాట్లాడారు. కడపలోని సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారన్నారు. ప్రదర్శనలో కృష్ణా జిల్లా నుంచి వ్యక్తిగత, గ్రూపు, ఉపాధ్యాయ కేటగిరీల్లో తయారుచేసిన ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయి ప్రదర్శనల్లో ప్రదర్శించారని చెప్పారు. వ్యక్తిగత విభాగంలో బంటుమిల్లి మండలం కంచడం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన సీహెచ్ విశ్వనాథ్ ప్రదర్శించిన లిక్విడ్ ట్రీ ప్రాజెక్టు నమూనా, గ్రూపు కేటగిరీలో పమిడిముక్కల మండలం మేడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.గోపాలకృష్ణ, వి.జితేంద్రనాగపవన్‌లు రూపొందించిన లై-ఫై ప్రాజెక్టు నమూనా, ఉపాధ్యాయ విభాగంలో పమిడిముక్కల మండలం కపిలేశ్వరపురం జిల్లా పరిషత్ పాఠశాల సైన్సు ఉపాధ్యాయుడు ఎస్.శ్యాంకుమార్ రూపొందించిన అగ్ని ప్రమాదం నుంచి ఇల్లు..ఆఫీసును రక్షించుకునే ప్రాజెక్టు నమూనాలు దక్షిణభారత స్థాయి సైన్సు ప్రదర్శనకు ఎంపికయ్యాయని వెల్లడించారు. వీరి ప్రాజెక్టు నమూనాలు జనవరిలో విజయవాడ కేంద్రంగా జరగనున్న దక్షిణభారత స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రదర్శిస్తారన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులు, ఉపాధ్యాయుడు, వారికి మార్గనిర్దేశం చేసిన గైడ్ ఉపాధ్యాయులు నాగమల్లేశ్వరరావు, నాగార్జునలను డీఈఓ తాహెరా సుల్తానా, డీవైఈఓలు యువి సుబ్బారావు, ఐ.పద్మారాణి ప్రత్యేకంగా అభినందించారు.

క్లుప్తంగా

పోలీస్ వెల్ఫేర్ డే స్పందనలో 31 ఫిర్యాదులు



విజయవాడ స్పోర్ట్స్: పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమాన్ని కాంక్షిస్తూ జరిగిన స్పందనలో 31 ఫిర్యాదులు అందినట్లు పోలీస్ కమిషనర్ టి.కె.రాణా తెలిపారు. విజయవాడలోని జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో పోలీసు అధికారులు, సిబ్బంది నుంచి శుక్రవారం ఫిర్యాదులు స్వీకరించారు. విధి నిర్వహణలో పోలీసులు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ఫిర్యాదులను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని సీపీ రాణా అన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 15 మంది ఎంపిక



లబ్బీపేట(విజయవాడతూర్పు): నలంద డిగ్రీ కళాశాలలో టీసీఎస్ (బీపీఎస్) కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 15 మంది ఉద్యోగార్హత సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ శుక్రవారం తెలిపారు. ఆ కంపెనీ హెచ్ఆర్ ప్రతినిధులు ప్రాసెస్ అసోసియేట్ పోస్టులను రెండు రౌండ్లలో ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. 65 మంది హాజరవ్వగా, వారిలో 15 మంది ఉద్యోగార్హత సాధించినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ అనురాధ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి.చంద్రగిరి పాల్గొన్నారు.

రమణ మహర్షి బోధనలు అనుసరణీయం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రమణ మహర్షి బోధనలు అనుసరణీయమని ఆధ్యాత్మిక ప్రసంగీకుడు బ్రహ్మశ్రీ పసుమర్తి కామేశ్వరశర్మ అన్నారు. రమణ మహర్షి సేవా సంస్థ ఆధ్వర్యంలో రమణుల జయంతి ఉత్సవాన్ని పాత బస్తీలోని కుసుమహరనాథ మందిరంలో వైభవంగా నిర్వహించారు. రెండు రోజులుగా జరుగుతున్న ఉత్సవం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రసంగం జరిగింది. రమణులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండు రోజుల పాటు విశేష జ్యోతులు వెలిగించి పూజలను కొనసాగించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు కోటేశ్వరరావు, రామకృష్ణ, మారెళ్ల శ్రీనివాసు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

కార్మికులకు మాస్కుల పంపిణీ



ఆటోనగర్(విజయవాడతూర్పు): జమాక్ స్టోర్స్ మాజీ అధ్యక్షుడు కత్తిక శివనాగేశ్వరరావు శుక్రవారం కార్మికులకు మాస్కులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివనాగేశ్వరరావు మాట్లాడుతూ కరోనా గురించి భయపడనవసరం లేదన్నారు. బయటకు వెళ్లినప్పుడు మాస్కును తప్పనిసరిగా ధరించాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జెడ్‌సీ బెవర నాగేశ్వరరావు, జమాక్ అధ్యక్షుడు త్రిపురనేని హనుమాల్ నాగచంద్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభం



పటమట(విజయవాడతూర్పు): ఎంజీ రోడ్డులోని శేషసాయి కల్యాణ మండపంలో నేషనల్ ఎక్స్‌పో ప్రారంభమైంది. శుక్రవారం నుంచి జనవరి 3వ తేదీ వరకు జరిగే ఎక్స్‌పోలో వివాహాది శుభకార్యాలకు భారతీయ సంప్రదాయ దుస్తుల ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. దీనిలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి మగ్గాలపై నేసిన ఎన్నో రకాల ఉత్పత్తులు ఉంటాయన్నారు. ప్రధానంగా నేత కార్మికులు తాము ఉత్పత్తి చేసిన సిల్క్ కాటన్ వస్త్రాలపై 40 శాతం తగ్గింపుతో విక్రయిస్తున్నామని, డిజైనర్ వస్త్రాలు, డిజైనర్ బ్లౌజులు, కుర్తాలపై ప్రత్యేక తగ్గింపు ఉంటుందని పేర్కొన్నారు. రోజూ ఉదయం 11 నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రదర్శన ఉంటుందన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఓట్ల రాజకీయాలను పక్కన పెట్టి ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ చెప్పారు. స్థానిక ఆరో డివిజన్ పరిధిలో శుక్రవారం చలసాని వారి వీధి, గంగానమ్మ గుడి వీధి కొండ పై ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఆ ప్రాంతాల్లో దేవినేని అవినాష్ పర్యటించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేశారు. అవినాష్ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని అర్హులకు సంక్షేమ పథకాలను అందజేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ అండగా ఉండాలని కోరారు. గత ప్రభుత్వంలో డివిజన్ సమస్యల పరిష్కారానికి స్థానిక ఎమ్మెల్యే నిధులు ఇవ్వకుండా అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొండ ప్రాంతాల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు అర్హులై ఉండీ ఆ పథకాలు అందకపోతే తనకుగానీ డివిజన్‌లోని ప్రజా ప్రతినిధులు, నాయకుల దృష్టికి తీసుకొస్తే వెంటనే అధికారులతో మాట్లాడి లబ్ధి అందేలా చూస్తానని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అమర్, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఇజ్జాడ తేజ, పార్టీ డివిజన్ అధ్యక్షుడు లంకా అబ్బినాయుడు, పార్టీ నాయకులు వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, అప్పారావు, శ్రీను, అంజి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేసి మాట్లాడుతున్న దేవినేని అవినాష్

కృత్రిమ మేధస్సుతో నూతన ఆవిష్కరణలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): కృత్రిమ మేధస్సు సాంకేతిక పరిజ్ఞానాన్ని (ఏఐ టెక్నాలజీ) ఉపయోగించి ఏ రంగంలోనైనా నూతన ఆవిష్కరణలు కచ్చితత్వంతో సులభంగా జరుగుతున్నాయని ఇండియన్ సర్వర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ డి.సాయిసతీష్ చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్స్ పీజీ విభాగం ఆధ్వర్యాన శుక్రవారం కృత్రిమ మేధస్సుతో నూతన ఆవిష్కరణలు అంశంపై కళాశాల ఆవరణలోని వెబ్‌నార్ హాలులో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ పరీక్షల్లో విద్యార్థులు రాసిన జవాబుపత్రాన్ని పరిశీలించి ఎన్ని మార్కులు వస్తాయో కృత్రిమ మేధస్సు టెక్నాలజీ ద్వారా తెలుసుకోవచ్చని చెప్పారు. దీనిద్వారా కవితలు, కథలు రూపొందించవచ్చని తెలిపారు. వివిధ ప్రోగ్రామ్ లాంగ్వేజ్‌లను ఉపయోగించి అతి తక్కువ సమయంలో మానవాళి అవసరాలను తీర్చడానికి ఏమి చేయాలనే అంశంపై కంప్యూటర్ ప్రోగ్రామర్లు పరిశోధనలు జరిపి వాటి ప్రకారం ఈ ఏఐ టెక్నాలజీని అభివృద్ధి చేశారని చెప్పారు. వైద్య రంగంలో అతి క్లిష్టమైన శస్త్ర చికిత్సను కూడా ఈ టెక్నాలజీ ద్వారా విజయవంతంగా పూర్తి చేయవచ్చునని చెప్పారు. యువత తమలోని నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, కళాశాల డీన్ రాజేష్ సీ జంపాల, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ టీఎస్ రవికిరణ్‌తో పాటుగా అధ్యాపకులు, విద్యార్థులు సదస్సులో పాల్గొన్నారు.

సలీం బహిష్కరణ పొడిగింపు

విజయవాడ స్పోర్ట్స్: టు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిట్టినగర్‌కు చెందిన షేక్ సలీం నేర ప్రవృత్తిలో మార్పు రాకపోవడంతో అతని నగర బహిష్కరణను మరో ఆరు నెలలు పొడిగిస్తున్నట్లు జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనేక కేసుల్లో నిందితుడుగా ఉన్న సలీం పలుమార్లు జైలు జీవితం అనుభవించాడని, ఆ తరువాత అతని ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో నగరం నుంచి బహిష్కరించామని పేర్కొన్నారు. ప్రస్తుతం బహిష్కరణలో ఉన్న సలీం జీవన శైలిలో ఎలాంటి మార్పు రాలేదని వచ్చిన పక్కా సమాచారం మేరకు బహిష్కరణను పొడిగిస్తున్నట్లు స్పష్టం చేశారు.

ఏపీపీడీఈఏ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్(ఏపీపీడీఈఏ) 2024 టెక్నికల్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం విద్యుత్ సౌధలో జరిగింది. విద్యుత్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ విజయానంద్ డైరీని ఆవిష్కరించారు. జేఎండీ (విజిలెన్స్) మల్లారెడ్డి టేబుల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి. శేషారెడ్డి మాట్లాడుతూ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న విజయానంద్, మల్లారెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విద్యుత్ సంస్థల పరిరక్షణకు సభ్యులు పని చేయాలని పిలుపునిచ్చారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమానికి డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.వి.మహేశ్వరరెడ్డి, రాష్ట్ర ముఖ్య సలహాదారు ఎ.సుబ్బారావు, కార్య నిర్వాహక అధ్యక్షులు హుస్సేన్ ఖాన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ విజయానంద్

ఆదివారం కూడా పన్నులు చెల్లించవచ్చు

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థకు నగరవాసులు కట్టాల్సిన పన్నులను ఆదివారం కూడా చెల్లించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్పొరేషన్‌కు చెల్లించాల్సిన ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను, తాగునీరు, డ్రైనేజీ పన్నులను డిసెంబర్ 31, 2023 లోగా చెల్లించాలని, ఈ మేరకు నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలో ఉన్న పన్ను చెల్లింపు క్యాష్ కౌంటర్లు ఆదివారం కూడా పని చేస్తాయని వివరించారు. ఆయా ప్రాంతాల్లోని క్యాష్ కౌంటర్లు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తాయని తెలిపారు.

పుస్తక ప్రియుల ఉత్సవం



నగరంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న పుస్తక మహోత్స ఆవరణ శుక్రవారం పుస్తక ప్రియులతో నిండిపోయింది. ఆధ్యాత్మిక, మానసిక వికాసం, ఇతిహాసం, సమయం సద్వినియోగం తదితర పుస్తకాలను పిన్న, పెద్ద కొనుగోలు చేశారు. ఆ ప్రాంగణంలో పలు పుస్తకాలను అతిథులు ఆవిష్కరించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





నేడు పుస్తక మహోత్సవంలో కార్యక్రమాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడ పుస్తక మహోత్సవంలో భాగంగా శనివారం సాయంత్రం 6.00 గంటలకు విశాలాంధ్ర పబ్లిషర్స్ వారి పుస్తకావిష్కరణ సభ జరుగుతుంది. 'జనాభా సంఖ్య–అపోహలు – భారత రాజకీయాలు' పుస్తకాన్ని భారత మాజీ ప్రధాన ఎన్నికల అధికారి వైఎస్ ఖురేషి ఆవిష్కరిస్తారు. ముఖ్యఅతిథులుగా మైనారిటీ సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి ఇంతియాజ్ అహ్మద్, బాపట్ల కలెక్టర్ రంజిత్ బాషా, మాజీ ఎమ్మెల్యే, విశాలాంధ్ర సంపాదకమండలి అధ్యక్షుడు కె.రామకృష్ణ, విశాలాంధ్ర విజ్ఞాన సమితి పాలకమండలి అధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సంపాదకులు గడ్డం కోటేశ్వరరావు తదితరులు పాల్గొంటారు. శ్రీరమణ ప్రతిభా వేదికపై సాయంత్రం 5 నుంచి 8గంటల వరకూ సైన్స్ ప్రయోగాలను విద్యార్థుల అవగాహన కోసం ప్రదర్శిస్తారు.

వేంపల్లె పుస్తకావిష్కరణ..

శనివారం సాయంత్రం ఐదు గంటలకు సీనియర్ జర్నలిస్టు, కథా రచయిత డాక్టర్ వేంపల్లె షరీఫ్ రాసిన 'టీవీ ప్రకటనల్లో భాషా సంస్కృతులు' పుస్తకం ఆవిష్కరణ జరగనుంది. షరీఫ్ మీడియాతో మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో ఎక్కడ చూసినా విజృంభిస్తున్న ప్రకటనల వెనుక వేల కోట్లాది రూపాయల వ్యాపారం ఉందని దాని కోసం అవి మన మీద ఎలాంటి భాషని, సంస్కృతిని రుద్దుతాయో తాను ఈ పుస్తకంలో వివరించానన్నారు. ఆవిష్కరణకు ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య టి.హేమచంద్రారెడ్డి, అధికార భాషా సంఘం సభ్యులు పి.విజయబాబు, సాహితీ విమర్శకులు చినుకు రాజగోపాల్ తదితరులు పాల్గొంటారని చెప్పారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలంలోని పోలింగ్ కేంద్రాలను మండల తహసీల్దార్, సహాయ ఎన్నికల నమోదు అధికారి కె.లక్ష్మి శుక్రవారం తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సదుపాయం, ఫర్నిచర్, దివ్యాంగులకు కల్పించిన ర్యాంపు నిర్మాణాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో గన్నవరం నియోజకవర్గానికి సంబంధించి నున్న, పాతపాడు, పి.నైనవరం, అంబాపురం, రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లో 82 పోలింగ్ కేంద్రాలున్నాయని, దాదాపు 80 వేల పైచిలుకు ఓటర్లున్నారని తెలిపారు. ఓట్ల నమోదు ప్రక్రియ నిరంతరం జరిగేది కాబట్టి మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని చెప్పారు. జనవరి 22వ తేదీన ఓటర్ల తుది జాబితా వెలువడే అవకాశం ఉందని పేర్కొన్నారు.

139 మందికి ఉచిత వైద్య సేవలు

పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం శుక్రవారం జరిగింది. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ఆయుష్, ఆయుర్వేద శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి, డాక్టర్ ఎన్ఆర్ఎస్ ఆయుర్వేద కాలేజీ సంయుక్తంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో 139 మందికి బీపీ, షుగర్ తదితర వ్యాధులకు ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గంటూరు శ్రీనివాసాచౌదరి, ఈఓ పద్మావతిదేవి, డాక్టర్ పి.రాజరాజేశ్వరి, డాక్టర్ పి.కృష్ణవేణి, డాక్టర్ పద్మ, డాక్టర్ నీలిమ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'కల్యాణమస్తు'ను సద్వినియోగం చేసుకోవాలి

పుల్లూరు(మైలవరం): అర్హులైన లబ్ధిదారులు కల్యాణమస్తు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి తెలిపారు. మైలవరం మండలం పుల్లూరు పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సమితి ద్వారా 180 రోజులకు గాను 180 రోజులు పాలు పోసిన పాల ఉత్పత్తిదారుడు వెలుగు పుల్లయ్య కుమార్తెకు రూ.20 వేలు విలువ గల బంగారు నాణాన్ని శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో కొత్తగూడెం పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే చర్యలు

ట్రాఫిక్ డీసీపీ చక్రవర్తి

విజయవాడ స్పోర్ట్స్: రోడ్డు మార్జిన్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ డీసీపీ కె.చక్రవర్తి ఏలూరు రోడ్డులోని వ్యాపారస్తులను హెచ్చరించారు. జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా ఆదేశాల మేరకు ఏలూరు రోడ్డులోని వ్యాపార, వాణిజ్య సముదాయాల యజమానులతో శుక్రవారం వ్యాస్ కాంప్లెక్స్‌లోని సమావేశ మందిరంలో డీసీపీ సమావేశమయ్యారు. ఏలూరు రోడ్డులోని ట్రాఫిక్ సమస్యను పూర్తిగా పరిశీలించానని, రోడ్డుకు రెండువైపులా వ్యాపారులు విక్రయాల నిమిత్తం వస్తువులను ఉంచుతున్నట్లు గుర్తించానన్నారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ట్రాఫిక్ సమస్యకు కారణమవుతున్నారన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తూ ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. షాప్‌లకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏడీసీపీ ప్రసాద్, ఏసీపీలు రామచంద్రరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై రద్దీ సాధారణం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో శుక్రవారం రద్దీ సాధారణంగా కనిపించింది. ఉదయం 6 గంటల నుంచి ఓ మోస్తరుగా ఉన్న రద్దీ మధ్యాహ్నం కాస్త పెరిగింది. అమ్మవారికి మహా నివేదన సమర్పించడానికి అరగంట అన్ని దర్శనాలు నిలిపివేశారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు రద్దీ కొనసాగింది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈఈ కోటేశ్వరరావు, ఏఈవో ఎస్.రమేష్‌బాబులు క్యూలైన్లను పర్యవేక్షించారు.

నేడు కానుకల లెక్కింపు

దుర్గగుడిలో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలు, మొక్కుబడులను శనివారం లెక్కించనున్నారు. మహా మండపం ఆరో అంతస్తులో కానుకలు లెక్కిస్తారని అధికారులు పేర్కొన్నారు.



దుర్గగుడిలో క్యూలైన్లను పర్యవేక్షిస్తున్న ఆలయ ఏఈవో

క్యాన్సర్ సోకిన 13 ఏళ్ల బాలుడికి అరుదైన చికిత్స

లబ్బీపేట(విజయవాడతూర్పు): శరీరంలోని మృదు కణజాలాల్లో సోకే రాబ్డోమియా సార్కోమా (ఆర్ఎంఎస్)తో బాధపడుతున్న 13 ఏళ్ల బాలుడికి విజయవంతంగా చికిత్స చేసినట్లు కానూరులోని అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ సాయికృష్ణ కొల్లూరు తెలిపారు. విజయవాడకు చెందిన 13 ఏళ్ల బాలునికి మార్చి 2022 నుంచి ఎడమ కంటిలోపలి భాగంలో కంటి కాంతస్ (కనురెప్పల చివరిభాగం) వద్ద నొప్పిలేకుండా ఉన్న కణితి వచ్చింది. అది క్యాన్సర్ గడ్డగా నిర్ధారించడంతో చికిత్స నిమిత్తం తమ ఆస్పత్రికి వచ్చినట్లు డాక్టర్ సాయికృష్ణ తెలిపారు. నిపుణుల సంరక్షణలో కీమోథెరపీ, రేడియోథెరపీతో కూడిన సమగ్ర చికిత్సను విజయవంతంగా అందించినట్లు తెలిపారు. రోగి వయస్సు 13 ఏళ్లు కావడంతో అత్యంత నైపుణ్యంతో కూడిన చికిత్స చేసి మెరుగైన ఫలితం సాధించినట్లు చెప్పారు. ఆర్ఎంఎస్ అనేది క్యాన్సర్ అరుదైన రూపంగా పేర్కొన్నారు. ఇది మృదుకణజాలాల్లో, ముఖ్యంగా పక్కటెముకల కండరాల్లో, కొన్నిసార్లు మూత్రాశయం, గర్భాశయం వంటి బోలు అవయవాల్లో కూడా వచ్చే అవకాశం ఉన్నట్లు డాక్టర్ సాయికృష్ణ కొల్లూరు తెలిపారు.

నిజాయతీ చాటుకున్న ఆటోడ్రైవర్

మధురానగర్(విజయవాడసెంట్రల్): తన ఆటోలో మరిచిపోయిన సుమారు రూ. 8లక్షల విలువైన బంగారు ఆభరణాలను ఆటో డ్రైవర్ పోలవరపు నాగేశ్వరరావు తిరిగి అప్పగించి నిజాయతీని చాటుకున్నారు. వారం క్రితం తన ఫ్రెండు పెళ్లికి వెళ్లిన సందర్భంగా చేవూరి నవీన ఆటోలో కూర్చుని బిడ్డకు పాలిస్తూ ఆటోలో 8 తులాల బంగారం మర్చిపోయింది. ఆ బంగారాన్ని డ్రైవర్ నాగేశ్వరరావు నవీన కుటుంబానికి అందజేశారు. దాని విలువ రూ. 8లక్షల ఉంటుందని వారు తెలిపారు. నాగేశ్వరావుకు కతజ్ఞతలు తెలుపుతూ శుక్రవారం రైల్వే స్టేషన్ పార్సిల్ ఆఫీస్ గేట్ వద్ద నవీన అన్న చేవూరి సాగర్ ఆటోడ్రైవర్ నాగేశ్వరరావు రూ. 10వేలు నగదు అందజేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సి.హెచ్ బాబురావు నాగేశ్వరరావును సత్కరించారు.



నాగేశ్వరరావును సత్కరిస్తున్న దృశ్యం

క్రీడా నైపుణ్యం వెలికితీసేందుకే ..

భవానీపురం(విజయవాడపశ్చిమ): క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని చేపట్టారని పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. విద్యాధరపురంలో నిర్మాణంలో ఉన్న స్టేడియంలో జరుగుతున్న 'ఆడుదాం ఆంధ్రా' పోటీలను శుక్రవారం వెలంపల్లి శ్రీనివాసరావు, యూత్ అడ్వాన్స్‌మెంట్ టూరిజం అండ్ కల్చరల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ వుండ్కర్, డీఎస్ఓ అజీజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ నియోజకవర్గంలో స్టేడియం నిర్మించాలన్నది క్రీడాకారుల చిరకాల కోరిక అన్నారు. వారి కోరికను సాకారం చేస్తూ స్టేడియం నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని చెప్పారు. అనంతరం ఆయన కొద్దిసేపు క్రీడాకారులతో క్రికెట్ ఆడి వారిని ప్రోత్సహిస్తూ పోటీల్లో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. యూత్ అడ్వాన్స్‌మెంట్ టూరిజం అండ్ కల్చరల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న ఆడదాం ఆంధ్ర పోటీల నిర్వహణను పరిశీలించారు. ఎన్ని మ్యాచ్‌లు జరగాలి..ఎన్ని మ్యాచ్‌లు జరిగాయి వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. 'ఆడుదాం ఆంధ్రా పోటీల నిర్వహణ తీరును మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ వుండ్కర్ పరిశీలించి పోటీలు షెడ్యూల్ ప్రకారం జరుగుతున్నాయా లేదా, క్రీడాకారులు సిద్ధంగా ఉన్నారా లేదా, సిబ్బంది క్రీడాకారులను పర్యవేక్షిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సబ్ కలెక్టర్ అదితిసింగ్, వీఎంసీ అడిషనల్ కమిషనర్లు కె.శకుంతల, కేవీ సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు, సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, డెప్యూటీ సిటీ ప్లానర్ జుబిన్ సిరస్ రాయ్, ఈఈ నారాయణమూర్తి, కార్పొరేటర్లు యరడ్ల ఆంజనేయరెడ్డి, ఎండీ ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.




ఆడుదాం ఆంధ్రా పోటీలపై ప్రద్యుమ్నకు వివరిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ వుండ్కర్



క్రికెట్ ఆడుతున్న వెలంపల్లి

హక్కులపై అవగాహన ఉండాలి

మైలవరం: విద్యార్థులు వినియోగదారుల హక్కులపై అవగాహన ఉండాలని మైలవరం జూనియర్ సివిల్ కోర్టు న్యాయవాది పీవీ సాంబశివరావు తెలిపారు. స్థానిక డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో వినియోగదారుల హక్కుల పరిరక్షణ అనే అంశంపై శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం 219ను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. నేటి సమాజంలో వస్తు సేవలను విక్రయించేటపుడు వస్తు సేవలపై సమగ్ర పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. ఎటువంటి దోపిడీకి గురికాకుండా వినియోగదారులు మేల్కోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవి మాట్లాడుతూ వినియోగదారులు అవగాహనను పెంపొందించుకోవాలన్నారు. కామర్స్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ శ్రీనివాసరావు, సీనియర్ ఫ్యాకల్టీ ఫణికుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయవాది సాంబశివరావు

● ఆత్మీయ సమ్మేళనం

గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు వీకేఆర్ కళాశాలలో జనవరి 7వ తేదీన పూర్వ విద్యార్థులు, అధ్యాపకుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీఎల్ ప్రసాద్, ఎన్‌బీఎం మురళీకృష్ణ తెలిపారు. కళాశాలలో శుక్రవారం వారు మాట్లాడుతూ.. కళాశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థులు, అధ్యాపకులను భాగస్వాములు చేసేందుకు సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు.

ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

పైసా ఖర్చు లేకుండా లక్షల విలువైన చికిత్స



గుంటూరు కలెక్టరేట్ ఆవరణలో రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు టీ విక్రయిస్తే గానీ కుటుంబ పోషణ జరగదు. దాదాపు 33 ఏళ్లుగా ఇదే నా దినచర్య. నాకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. టీ బండిపై వచ్చే ఆదాయంతోనే పెద్ద కుమార్తెకు పెళ్లి చేసి అత్తారింటికి పంపించాను. చిన్నమ్మాయి డీ ఫార్మా పూర్తి చేసింది. ఈ ఏడాది ఏప్రిల్ 21న ఉన్నట్టుండి నాకు నరాల సమస్య వచ్చింది. నిలబడలేని పరిస్థితి ఏర్పడింది. దిక్కుతోచని స్థితిలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లాం. రోజుకు 5 ఇంజక్షన్లు చొప్పున 5 రోజులపాటు కోర్సు వాడాలని వైద్యులు చెప్పారు. ఇంజక్షన్ల కోసమే రూ.4 లక్షలకు పైగా వెచ్చించాలని, వైద్యానికి అదనంగా ఖర్చవుతుందని చెప్పారు. అసలే అంతంత మాత్రపు బతుకులు కావడంతో వైద్యానికి అంతమొత్తం చెల్లించుకోలేక దిగులు చెందాం. ఆ సమయంలో సచివాలయ అధికారుల ద్వారా ఆరోగ్య శ్రీ కార్డును తీసుకుని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆరోగ్య మిత్రను కలవడంతో తక్షణమే స్పందించి ఆరోగ్యశ్రీపై 25 ఇంజక్షన్లకు రూ.1.40 లక్షలు మంజూరు చేశారు. 5 రోజులు 25 ఇంజక్షన్లు చేయడంతో నా ఆరోగ్యం మెరుగు పడింది. ఆరోగ్యశ్రీ ఉండడం వల్లే ఖరీదైన చికిత్స ఉచితంగా చేశారు. కొద్ది రోజులు విశ్రాంతి తీసుకుని, చిన్న చిన్న వ్యాయామాలు చేస్తూ చిన్నగా నడవడం ప్రారంభించాను. తర్వాత తిరిగి టీ వ్యాపారం చేసుకుంటున్నాను.

– మహ్మద్ బాజీత్ ఖాన్, మహబూబ్ నగర్, ఏటీ అగ్రహారం, గుంటూరు
(ఎస్‌కే సుభాని, విలేకరి, లక్ష్మీపురం గుంటూరు)

ఒంటరిగా ఉన్న నన్ను ప్రభుత్వమే ఆదుకుంది



నా భర్త అనారోగ్యంతో చాలా కాలం క్రితమే మృతి చెందాడు. నాకు ఒకే కూతురు. ఆమె కూడా చనిపోయింది. అల్లుడు, వారి పిల్లలు దూరంగా వేరే ప్రాంతంలో ఉంటున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరులో నేను ఒంటరిగా నివసిస్తున్నాను. కూలి పనులకు వెళ్లి సంపాదించుకునేందుకు వయసు, ఆరోగ్యం సహకరించడం లేదు. ఈ సమయంలో నా అదృష్టం కొద్దీ వైఎస్ జగన్ ప్రభుత్వం రావడంతో దరఖాస్తు చేసిన వెంటనే వృద్ధాప్య పింఛన్ మంజూరైంది. ఆర్థికంగా ఇతరత్రా ఎలాంటి ఆదాయం లేకపోవడంతో కేవలం పింఛను సొమ్మే నాకు ఆధారంగా మారింది. ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లారేసరికి రూ.2,750 నా చేతిలో పెడుతున్నారు. తెల్ల రేషన్ కార్డు ఉండడంతో ఉచితంగానే బియ్యం ఇస్తున్నారు. ఆరోగ్యశ్రీ కార్డు కూడా ఇచ్చారు. అనారోగ్య సమస్యలు వస్తే ఉచితంగానే మందులు ఇస్తున్నారు. వచ్చే నెల నుంచి పింఛన్ రూ.3 వేలు ఇస్తారంట. నాలాంటి ఒంటరి మహిళలకు పింఛను సొమ్ము ఎంతో భరోసాగా నిలుస్తోంది. ప్రస్తుతం నేను పూరి గుడిసెలో ఉంటున్నాను. మా ఊరు పోలవరం ముంపు ప్రాంతంలో ఉన్నందున, నిర్వాసితులందరికీ వేరే చోట ఇళ్లు కట్టిస్తున్నారు.

– బిత్తరి సత్యవతి, చింతూరు
(మొహమ్మద్ షౌఖత్ అలీ, విలేకరి, చింతూరు)

సర్కారు సాయంతో హాయిగా వ్యవసాయం



మాది వ్యవసాయాధారిత కుటుంబం. కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం యండపల్లి గ్రామంలోని మా పొలంలో వరి, పామాయిల్ పంటలు పండిస్తుంటాను. ప్రతిసారీ పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సి వచ్చేది. పంటలు సరిగ్గా పండనప్పుడు, పరిస్థితులు అనుకూలించనప్పుడు అప్పు తీర్చలేక మాటలు పడాల్సి వచ్చేది. కానీ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వచ్చాక రైతులకు ఆర్థిక భరోసా కల్పించడం ఊరటనిస్తోంది. గత నాలుగేళ్లుగా ఏడాదికి రూ.13.500 చొప్పున మొత్తం రూ.54 వేలు రైతు భరోసా కింద నా ఖాతాలో జమయ్యాయి. ప్రభుత్వ పథకాలు ప్రవేశ పెట్టడం ఒక ఎత్తు అయితే, వాటిని అమలు చేయడం మరో ఎత్తు. సీఎం వైఎస్ జగన్ వచ్చాక ఒక్క రూపాయి లంచం, రాజకీయ నేతల సిఫార్సులు లేకుండానే లబ్ధిదారునికే నేరుగా ఫలాలు అందుతున్నాయి. అర్హత ప్రాతిపదికగా నాకు లబ్ధి చేకూరింది. ఇలా ఏ ప్రభుత్వం ఆదుకోలేదు. ఇప్పుడు ప్రతి రైతు ధైర్యంగా వ్యవసాయం చేసుకోగలుగుతున్నాడు. రైతు భరోసా కేంద్రాల వల్ల అన్నీ గ్రామంలోనే అందుతున్నాయి. అధికారులు మా చెంతకే వచ్చి సూచనలు, సలహాలు ఇస్తున్నారు. పంట వేసిన నాటి నుంచి పంటలు అమ్ముకునే వరకు అండగా ఉంటున్నారు. ఉద్యానవన పంటల్లో భాగంగా జాజికాయ, జాపత్రి, పామాయిల్‌లో అంతర పంటలు వేయడంతో ఉద్యానవన శాఖ పలు ప్రోత్సాహకాలు అందిస్తోంది. పలు రాయితీలు కల్పిస్తున్నారు.

– గుండ్ర అంబయ్య, యండపల్లి
(ఎం.వి.వి.రమణ, విలేకరి, కొత్తపల్లి)

జగన్నినాదాలతో హోరెత్తిన అరకు లోయ

- హుకుంపేటలో వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర
- ప్రభంజనంలా తరలివచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు
- జై జగన్ అంటూ నినదించిన గిరిజనం
- వైఎస్సార్‌సీపీ పాలనలోనే గిరిజనాభివృద్ధి
- వైఎస్ జగన్‌ను మరోసారి గెలిపించి రుణం తీర్చుకోవాలి
- పిలుపునిచ్చిన నేతలు



మాట్లాడుతున్న ఎంపీ గొడ్డేటి మాధవి


హుకుంపేటలో జరిగిన సామాజిక సాధికార సభకు హాజరైన అశేష జనసందోహంలో ఒక భాగం

సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): జగన్నినాదాలతో అరకు లోయ నియోజకవర్గం శుక్రవారం హోరెత్తిపోయింది. హుకుంపేట మండల కేంద్రంలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రకు ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీలు పోటెత్తారు. గిరిజనం ప్రభంజనంలా తరలివచ్చారు. దీంతో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. జై జగన్ అంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేశారు. పాడేరు–హుకుంపేట రోడ్డులోని బర్మన్‌గుడ జంక్షన్ నుంచి సభావేదిక వరకు సుమారు వెయ్యి బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన వైఎస్సార్‌సీపీ నేతలు వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుని ఆయన రుణం తీర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఆయన సంక్షేమ పాలనలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు మేలు జరిగిందన్నారు.

గడప గడపకు సంక్షేమ పథకాలు

చంద్రబాబు ప్రభుత్వం అరకులోయ నియోజకవర్గ అభివృద్ధిని తీవ్ర నిర్లక్ష్యం చేసిందని ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ విమర్శించారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కాగానే ఎంతో అభివృద్ధి సాధ్యమైందని కొనియాడారు. గడప గడపకు సంక్షేమ పథకాలు అందాయన్నారు. నవరత్న పథకాల ద్వారా నియోజకవర్గంలోని 2.41 లక్షల మందికి రూ.2 వేల కోట్ల వరకు లబ్ధి చేకూరిందని తెలిపారు. అలాగే మారుమూల గ్రామాలతో పాటు అన్ని ప్రధాన గ్రామాలకు రోడ్లు, గెడ్డలపై వంతెనలు, ఇతర మౌలిక సదుపాయాలకు మరో రూ.2 వేల కోట్లు ప్రభుత్వం ఖర్చుపెడుతోందన్నారు. సెల్ టవర్ల నిర్మాణాలు, తాగునీటి పథకాలు, నాడు–నేడుతో పాఠశాలలు, ఆస్పత్రుల అభివృద్ధికి రూ.వందలాది కోట్లు వ్యయం చేసిందన్నారు.

జగన్ పాలనలోనే సామాజిక న్యాయం

సీఎం జగన్ పాలనలోనే గిరిజనుల సమగ్రాభివృద్ధి సాధ్యమైందని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు కొనియాడారు. పాడేరు, పార్వతీపురంల్లో వైద్య కళాశాలలు, సాలూరులో గిరిజన విశ్వవిద్యాలయం, కురుపాంలో ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణాల ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. చంద్రబాబు గిరిజనులను చిన్నచూపు చూశారని, రాజ్యాంగ పదవులకు దూరం చేశారని మండిపడ్డారు. గిరిజన ఎమ్మెల్యేలకు మంత్రి పదవి కూడా ఇవ్వలేకపోయారన్నారు. సామాజిక న్యాయం జగన్ పాలనలోనే సాధ్యమైందన్నారు. గిరిజనులకు డిప్యూటీ సీఎం పదవులు ఇచ్చి తనతో సమానంగా చూశారని కొనియాడారు. తన పాలనలో 3.46 లక్షల ఎకరాల అటవీ భూములను గిరిజనులకు పంపిణీ చేశారన్నారు.

ఆదివాసీలకు సామాజిక న్యాయం

ఆదివాసీలకు సీఎం జగన్ పాలనలోనే సామాజిక న్యాయం జరిగిందని ఉమ్మడి విశాఖపట్నం జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర కొనియాడారు. ఇదే గిరిజన జాతికి చెందిన తనకు జెడ్పీ చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించారని కృతజ్ఞతలు తెలిపారు. అరకు నియోజకవర్గాన్ని రూ.ఆరు వేల కోట్లతో ముఖ్యమంత్రి జగన్ అభివృద్ధి చేశారని చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. అరకు నియోజకవర్గంలో గిరిజనుల సాగులో ఉన్న 49 వేల ఎకరాల అటవీ భూములకు పట్టాలిచ్చి ఎంతో మేలు చేశారని తెలిపారు. చంద్రబాబు గిరిజనులను వాడుకుని వదిలేశారని మండిపడ్డారు. అల్లూరి సీతారామరాజు మాదిరిగా గిరిజనులంతా టీడీపీపై బాణాలు ఎక్కుపెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, ఎస్టీ కమిషన్ సభ్యులు కొర్రా రామలక్ష్మి, జంపరంగి లిల్లీ, పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'అనంత'తో ప్రభంజనం

- అనంతపురంలో ఘనంగా వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర
- వెల్లువలా తరలివచ్చిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు
- జగనన్నతోనే బడుగు, బలహీనవర్గాలకు సాధికారత అని నినదించిన నేతలు
- మరోసారి ఆయనను ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపు


మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజాద్ బాషా


అనంతపురంలో జరిగిన సామాజిక సాధికార సభకు హాజరైన అశేష జనసందోహంలో ఒక భాగం

అనంతపురం ఎడ్యుకేషన్: 76 ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశ చరిత్రలో కేవలం నినాదంగా మాత్రమే ఉన్న 'సామాజిక సాధికారత'ను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఆచరణలో పెట్టి చూపించారని వైఎస్సార్‌సీపీ నేతలు కొనియాడారు. సామాజిక సాధికారత తమ నినాదం కాదు విధానమని నిరూపించారని ప్రశంసించారు. రాజ్యాధికార పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే పెద్దపీట వేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. మరోసారి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు అనంతపురం నగరంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ చేపట్టిన 'సామాజిక సాధికార బస్సు యాత్ర'కు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు వెల్లువలా తరలివచ్చారు. దీంతో సభాప్రాంగణం కిటకిటలాడింది. ఈ సందర్భంగా మాట్లాడిన నేతలు చంద్రబాబుకు అధికారంలో ఉంటే అగ్రకులాలు, అధికారంలో లేకపోతే వెనుకబడిన కులాలు గుర్తుకొస్తాయని విమర్శించారు.

సామాజిక విప్లవ సృష్టికర్త జగనన్న

దేశ చరిత్రలో సీఎం వైఎస్ జగన్ సామాజిక విప్లవాన్ని సృష్టించారని డిప్యూటీ సీఎం అంజాద్ బాషా తెలిపారు. సామాజిక న్యాయం అనేది ప్రభుత్వ విధానమని నిరూపించారన్నారు. ఐదుగురు ఉప ముఖ్యమంత్రులుంటే నలుగురు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలవారేనని గుర్తు చేశారు. గతంలో ఇంతటి గౌరవం ఏ ప్రభుత్వం ఇవ్వలేదన్నారు.

బలహీనవర్గాలకే సింహభాగం పథకాలు

సీఎం వైఎస్ జగన్ పాలనలో సింహభాగం సంక్షేమ పథకాలు బీసీ, ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ వర్గాలకే అందుతున్నాయని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ తెలిపారు. కలగా మారిన సామాజిక న్యాయాన్ని చేతల్లో చూపిన అభినవ అంబేడ్కర్, అభినవ పూలే.. వైఎస్ జగన్ అని కొనియాడారు. ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటే మనల్ని మనం గౌరవించుకున్నట్లేనన్నారు.

ఆయా వర్గాల్లో చర్చ జరగాలి

గతంలో కంటే వైఎస్ జగన్ ప్రభుత్వంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఎంత మేలు జరిగిందనే విషయంపై ఆయా వర్గాల్లో చర్చ జరగాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. బీసీలే తమ పార్టీకి వెన్నెముక అంటూ ఊదరగొట్టే బాబు అధికారంలోకి వచ్చాక ఈ వర్గాలకు ఏమీ చేయలేదన్నారు. చంద్రబాబు తన ప్రభుత్వంలో కమ్మలకు 8, రెడ్లకు 6, కాపులకు 4, బీసీలకు 3, ఎస్సీలకు 2 మంత్రి పదవులు ఇచ్చారని, మైనార్టీ, గిరిజనులకు అసలే ఇవ్వలేదని విమర్శించారు.

బాబును జీవితంలో నమ్మకూడదు

చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు చేసిన మోసాలకు ఆయనను జీవితంలో నమ్మకూడదని సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకరరావు అన్నారు. పవన్ కళ్యాణ్ నిలకడ లేని వ్యక్తి అని తెలిపారు. వైఎస్ జగన్ అన్ని వర్గాలకు అండగా నిలిచారన్నారు. పేదల ఖాతాల్లో నేరుగా రూ.2.45 లక్షల కోట్లు జమ చేశారన్నారు. అందులో సింహభాగం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకే అందిందని జూపూడి అన్నారు.

సామాజిక న్యాయాన్ని నిజం చేశారు

సామాజిక న్యాయాన్ని సీఎం జగన్ నిజం చేశారని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట రామిరెడ్డి తెలిపారు. బడుగు, బలహీన వర్గాలకు సామాజిక సాధికారతను కల్పించారన్నారు. రూ.లక్షల కోట్లు ఖర్చు చేసి పేదల ఆర్థిక స్థితిగతులను మార్చేశారని కొనియాడారు. గత టీడీపీ ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించిందన్నారు.

చిన్నారికి నామకరణం చేసిన సీఎం వైఎస్ జగన్

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం విచ్చేసిన సీఎం వైఎస్ జగన్ హెలిప్యాడ్ వద్ద ఓ చిన్నారికి నామకరణం చేశారు. చిట్టూరి సోని, చిట్టూరి మోహన్ కుమార్ దంపతులు ఐదు నెలల చిన్నారితో ముఖ్యమంత్రిని కలిశారు. 'మీరు, మీ నాన్నగారు వైఎస్ రాజశేఖరరెడ్డి అంటే మా కుటుంబానికి ఎంతో అభిమానం. అందువల్ల మా బిడ్డకు మీరే పేరు పెట్టాలి' అని కోరారు. దీంతో సీఎం జగన్ ఆ చిన్నారిని గుండెలకు హత్తుకొని ముద్దాడి.. రాజశేఖర్‌గా నామకరణం చేశారు. ఈ సందర్భంగా ఆ దంపతులు సంతోషం వ్యక్తం చేశారు.


సోని, మోహన్ కుమార్ దంపతుల ఐదు నెలల చిన్నారిని ఆప్యాయంగా ఎత్తుకున్న సీఎం జగన్

జగనన్న విద్యా దీవెన రూ.11,900 కోట్లు

- 27.61 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- ఎక్స్‌లో పోస్టు చేసిన సీఎం

సాక్షి, అమరావతి: జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా ఇప్పటి వరకు 27.61 లక్షల మంది విద్యార్థులకు పూర్తి ఫీజు కింద రూ.11,900 కోట్లు అందజేశామని చెప్పేందుకు గర్వపడుతున్నానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'ఉన్నత చదువులు చదువుతున్న 8,09,039 మంది విద్యార్థులకు సంబంధించి రూ.583 కోట్లు మన ప్రభుత్వంలో జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా వారి తల్లుల ఖాతాల్లో రీయింబర్స్ చేశాం. దాదాపు 2 లక్షల మంది ఫైనల్ ఇయర్ విద్యార్థులకు చివరి విడతగా చెల్లించాల్సిన నగదును కూడా ఇప్పటికే వారి తల్లుల ఖాతాల్లో జమ చేశాం' అని వెల్లడించారు.


నూతుల మార్తమ్మ


ఎల్లమల్లి అన్నపూర్ణ


గుడాల అపర్ణ జ్యోతి


చిల్లి సుమతి


కదలి నాగలక్ష్మి


అందుగుల లాజర్


కంతేటి దుర్గాభవాని


తేతలి గీత సమస్యను ఆలకిస్తున్న సీఎం వైఎస్ జగన్


నూతుల మార్తమ్మ


ఎల్లమల్లి అన్నపూర్ణ


గుడాల అపర్ణ జ్యోతి


చిల్లి సుమతి


కదలి నాగలక్ష్మి


అందుగుల లాజర్


కంతేటి దుర్గాభవానీ


తేతలి గీతకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

మనసున్న సీఎం వైఎస్ జగన్

- కష్టాలు చెప్పకున్న వారికి తక్షణ సాయం
- గంటల వ్యవధిలో రూ.లక్ష చొప్పున అందజేసిన కలెక్టర్

సాక్షి, భీమవరం: ఆపన్నులను ఆదుకోవడంలో ముందుండే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భీమవరం పర్యటనలోనూ తన మంచి మనసును మరోసారి చాటుకున్నారు. శుక్రవారం నాటి భీమవరం పర్యటనలో అనారోగ్యంతో, ఇతరత్రా ఇబ్బందులతో బాధ పడుతున్న వారి గోడు విని అప్పటికప్పుడే సాయం చేయాలని అధికారులను ఆదేశించారు. అత్తిలి మండలం తిరుపతిపురానికి చెందిన గుడాల అపర్ణ జ్యోతి, దెందులూరు మండలం శ్రీరామవరంనకు చెందిన కంతేటి దుర్గాభవాని, కిడ్నీ సమస్యతో బాధపడుతున్న భీమడోలు మండలం పూళ్లకు చెందిన అందుగుల లాజర్ తనయుడు, అదే గ్రామానికి చెందిన నూతుల మార్తమ్మ, యలమంచిలి మండలం దొడ్డిపట్లకు చెందిన చిల్లి సుమతి తనయునికి వైద్య సాయం నిమిత్తం ఆర్థిక సాయం, భర్త మృతి చెందిన నరసాపురం 29వ వార్డుకు చెందిన ఎల్లమల్లి అన్నపూర్ణ, ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌కు చెందిన తేతలి గీతలకు పరిహారంగా ఆర్థిక సాయం అందజేశారు. నరసాపురం మండలం ఎల్‌బీ చర్లకు చెందిన కదలి నాగలక్ష్మికి భూపరిష్కారం నిమిత్తం ఆర్థిక సాయం అందించారు. సీఎం జగన్ ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం స్థానిక క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ పి.ప్రశాంతి, జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డిలు రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించారు.

బీసీలను మోసం చేస్తున్న టీడీపీ

- బీసీలను అవమానించింది చంద్రబాబే
- మంత్రి చెల్లుబోయిన వేణు



మధురపూడి : బీసీల రక్షణ చట్టం తెస్తానంటూ టీడీపీ నేత నారా లోకేశ్ ప్రకటించడం ఆ వర్గాలను మరోసారి మోసగించడానికేనని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా మధురపూడిలోని రాజమహేంద్రవరం విమానాశ్రయం వద్ద శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. లోకేశ్.. టీడీపీకి జాతీయ ప్రధాన కార్యదర్శి కాదని, వారి జాతికి మాత్రమేనని విమర్శించారు. చరిత్రపై అవగాహన లేని లోకేశ్.. ఎస్సీ, ఎస్టీ తరహాలో బీసీలకు రక్షణ చట్టం తెస్తానన్నారని ఎద్దేవా చేశారు. ఎస్సీల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా? అంటూ చంద్రబాబు ఎస్సీలను అపహాస్యం చేశారని గుర్తు చేశారు. నాయీ బ్రాహ్మణులను మంగలి అని పిలిచిన బాబు శిక్షార్హుడేనన్నారు. అలాగే శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన నాయకులు ఎమ్మెల్యేగా సీటివ్వాలని కోరితే.. ఎలా గెలుస్తారంటూ హేళన చేశారన్నారు. చట్టసభల్లో కనీస ప్రాతినిధ్యం ఇవ్వని బాబు అండ్ కోను బీసీలు నమ్మరని మంత్రి వేణు స్పష్టం చేశారు. బీసీల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా మాట్లాడినందుకు మొదటి ముద్దాయి చంద్రబాబే అవుతారన్నారు. లోక్‌సభ, శాసనసభ స్థానాల్లో బీసీలకు ప్రత్యేక కేటాయింపులంటూ లోకేశ్ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. 1999లో బీసీలకు 100 సీట్లిస్తానని కనీస సీట్లు కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. సీఎం జగన్‌ను సైకో అనడం సమంజసం కాదని, లోకేశే సైకోగా మారాడని దుయ్యబట్టారు. బీసీలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాజ్యసభలో నాలుగు స్థానాలు కేటాయించి, సామాజిక న్యాయానికి ఏపీని చిరునామాగా మార్చారని మంత్రి వేణు స్పష్టం చేశారు.

పార్టీపై ఎలాంటి దురుద్దేశం లేదు

పెనమలూరు ఎమ్మెల్యే పార్థసారథి



సాక్షి ప్రతినిధి, విజయవాడ : తనకు పార్టీపై ఎలాంటి దురుద్దేశం లేదని పెనమలూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. కృష్ణా జిల్లా కంకిపాడులో గురువారం జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్ర సభలో తాను ఉద్దేశ పూర్వకంగా వ్యాఖ్యలు చేయలేదని అన్నారు. శుక్రవారం ఆయన 'సాక్షి' ప్రతినిధితో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటే తనకు ప్రత్యేక గౌరవం ఉందని, దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి తనకు రాజకీయ భిక్ష పెట్టారని చెప్పారు. సభలో యథాలాపంగా మాట దొర్లితే దానిని చిలువలు పలువలు చేసి కొన్ని చానెళ్లు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని, తాను దీనిని ఖండిస్తున్నానన్నారు.

ప్రజల మద్దతు ఉన్న వారికే సీట్లు


రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్



సాక్షి, అమరావతి : ప్రజల మద్దతు ఉన్న వారికే సీట్లు ఉంటాయని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. వైఎస్సార్‌సీపీ భవిష్యత్తును దృష్టిపెట్టుకుని పార్టీకి ఉజ్వలమైన భవిష్యత్తు ఉండాలనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయాలు తీసుకుంటున్నారని చెప్పారు. శుక్రవారం ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడారు. ఎవరు ఎక్కడి నుంచి పోటీ చేయాలో సీఎం జగన్ నిర్ణయిస్తారని, గెలిచే వారికే వైఎస్సార్‌సీపీ టికెట్ వస్తుందన్నారు. నాయకుడి నిర్ణయానికి అందరం కట్టుబడి ఉండాలని, తాను పెడన నుంచి పోటీ చేయాలా, వద్దా అనేది సీఎం జగన్ నిర్ణయిస్తారని చెప్పారు. పార్టీ భవిష్యత్తు కోసం, అందులో ఉండే నాయకులు, కార్యకర్తల భవిష్యత్తు కోసం సీఎం నిర్ణయాలు తీసుకుంటున్నారని అన్నారు. తమ నాయకుడు మంచి మనసు ఉన్న వారని, ఎవరినీ వదులుకోరని చెప్పారు.

టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లకూ కేంద్రం నిధులు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి




బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లకూ కేంద్ర ప్రభుత్వమే నిధులు మంజూరు చేసిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. కాకినాడలో పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం అనంతరం శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 4 కోట్ల గృహాలు మంజూరు చేస్తే ఒక్క ఏపీకే 22 లక్షల గృహాలు ఇచ్చిందన్నారు. పార్టీని సంస్థాగతంగా ఎలా బలోపేతం చేయాలి, రాజకీయ సమీకరణలు ఏ విధంగా ఉన్నాయో తెలుసుకునేందుకు తాను జిల్లాల్లో పర్యటిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకూ 22 జిల్లాల్లో పర్యటించానన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక ఏపీకి కేంద్రం ప్రత్యేక నిధులు మంజూరు చేసిందన్నారు. 216 జాతీయ రహదారి నిర్మాణానికి తామే నిధులు ఇచ్చామని చెప్పారు. కత్తిపూడి – రాజమహేంద్రవరం మధ్య జాతీయ రహదారికి కేంద్రం రూ.1,500 కోట్లు కేటాయించిందన్నారు. కాకినాడ నుంచి కోటిపల్లి మీదుగా నర్సాపురం హైవే కోసం మరో రూ.2 వేల కోట్లు కేటాయించిందని చెప్పారు.

ఆ పోస్టుల భర్తీ కనిపించలేదా రామోజీ?

రాష్ట్రంలో అందుబాటులో 1527 పశువైద్య సహాయ శస్త్ర చికిత్సకులు

- ఏపీలో ప్రతీ 17,808 పశువులకు ఒక గ్రాడ్యుయేట్ వైద్యుడు
- మరో 264 పశువైద్యసహాయ శస్త్ర చికిత్సకుల పోస్టుల భర్తీకి చర్యలు
- ఆర్బీకేల్లో 4652 మంది సిబ్బంది సేవలు
- మరో 1896 మంది పశుసంవర్ధక సహాయకుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
- ప్రతి నియోజకవర్గానికి రెండు మొబైల్ అంబులేటరీ వాహనాలు
- ఆర్బీకేల ద్వారా రైతు ముంగిటకే నాణ్యమైన పశువైద్యసేవలు
- అయినా ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చేలా ఈనాడు బురద రాతలు
- తెలుగుదేశం హయాంలో మూగజీవాల మరణమృదంగంపై మౌనం



> 'దున్నపోతు ఈనిందంటే దూడని గాటికి కట్టేయమన్నాడట' వెనుకటికి ఒక ప్రబుద్ధుడు. ఈనాడు రామోజీరావు తీరు అచ్చం అలానే ఉంది. గత ప్రభుత్వ పాలనలో మూగజీవాలు మృత్యువాత పడుతున్నా... పశువైద్య కేంద్రాల్లో సిబ్బంది కరువైనా... అవసరమైన మందులు అందించకపోయినా... సరైన వైద్యం అందకపోయినా రామోజీ కళ్లకు కనిపించలేదు. ఈనాడు కలాలకు పదును పెట్టలేదు. ఇప్పుడే ఆ శాఖపై అమాంతంగా అభిమానం పుట్టుకొచ్చేసింది. అవాస్తవాలతో జనాన్ని పక్కదారి పట్టించేందుకు కంకణం కట్టుకుంది. లెక్కకు మిక్కిలిగా పోస్టులు భర్తీ చేసి రైతు ముంగిటకే పశువైద్యం తీసుకెళ్తుంటే తట్టుకోలేకపోతోంది. ఈ ప్రభుత్వం మంచి పాలన అందిస్తుంటే కుళ్లుకుంటోంది. ఎక్కడ ప్రజల్లో మంచి పేరొస్తుందేమోనని భయపడిపోతోంది. అదే పనిగా విమర్శిస్తూ... అడ్డగోలు రాతలతో అభాసుపాలు చేయాలని చూస్తోంది. వాస్తవాలకు పాతర వేస్తోంది. రోజుకో అంశంతో అబద్ధపు వార్తలు వండి వారుస్తోంది. పశువైద్యం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలు కనిపించాలంటే రామోజీ కళ్లద్దాలు మార్పించుకుని చూడాలి.

సాక్షి, అమరావతి: గ్రామానికో పశుసంవర్ధక సహాయకుడు... రెండు మండలాలకో వెటర్నరీ అంబులెన్స్... గ్రామ స్థాయిలో ఆర్బీకేల ద్వారా పశుగ్రాసం, సర్టిఫై చేసిన నాణ్యమైన సంపూర్ణ మిశ్రమ దాణా పంపిణీ... పాడి రైతు ముంగిటకే నాణ్యమైన పశువైద్య సేవలు... నియోజకవర్గ స్థాయిలో పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలు... నాణ్యమైన పాల ఉత్పత్తి లక్ష్యంగా ఆర్బీకేల ద్వారా పశువిజ్ఞాన బడులు... మూగజీవాలకు బీమా రక్షణ... జనరిక్ పశుఔషధ కేంద్రాల ఏర్పాటు... జగనన్న పాలవెల్లువ ద్వారా పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పన.. ఇలా గడచిన నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలో వచ్చిన ఎన్నో విప్లవాత్మక మార్పులు. దేశంలో మరే రాష్ట్రంలోనూ లేని రీతిలో మూగజీవాల ఆరోగ్య పరిరక్షణకు ఈ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. తద్వారా కేంద్రంతో సహా పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థల ప్రశంసలు.. అవార్డులు.. రివార్డులు అందుకుంది. పంజాబ్, రాజస్థాన్, కేరళ వంటి పలు రాష్ట్రాలు ఇక్కడి విధానాలను స్ఫూర్తిగా తీసుకున్నాయి. ఇప్పుడు వాటినే ఆచరిస్తున్నాయి.

పొరుగు రాష్ట్రాల కంటే మిన్నగా...

దేశంలో పొరుగు రాష్ట్రాల కంటే మిన్నగా మూగజీవాలకు మెరుగైన, నాణ్యమైన వైద్యసేవలు అందిస్తున్న రాష్ట్రంగా ఏపీ నిలిచింది. గతంలో సకాలంలో నాణ్యమైన, అత్యవసర వైద్య సేవలు అందక ప్రతీ ఏటా పెద్ద సంఖ్యలో మూగజీవాలు మృత్యువాతపడేవి. రాష్ట్రంలో 1577 పశువైద్యశాలలు, 323 ప్రాంతీయ పశు వైద్యశాలలు, 12 వెటర్నరీ పోలీ క్లీనిక్స్ ద్వారా పశు పోషకులకు చేరువలో అత్యాధునిక పశువైద్యం అందుతోంది. రాష్ట్ర స్థాయిలో 2 సూపర్ స్పెషాలిటీ పశువైద్యశాలల ద్వారా పశువులకూ 24 గంటలు పశువైద్యం అందుబాటులోకి తెచ్చారు. రాష్ట్రంలో 1.66 కోట్ల పశుగణ యూనిట్లు ఉండగా, 1527 పశు వైద్య సహాయ శస్త్ర చికిత్సకులు విధులు నిర్వహిస్తున్నారు. ఖాళీగా ఉన్న 264 పశువైద్యుల పోస్టుల నియమకానికి చర్యలు చేపట్టారు.

గ్రామానికో గ్రాడ్యుయేట్ ఉద్యోగి

రైతులకు గ్రామస్థాయిలో నాణ్యమైన సేవలందించే సంకల్పంతో 10,778 ఆర్బీకేలు ఏర్పాటు చేశారు. గతంలో ఉన్న 1218 గ్రామీణ పశుగణ కేంద్రాలతో పాటు 7396 ఆర్బీకే క్లస్టర్స్ ద్వారా పశువైద్య సేవలందించేందుకు గ్రాడ్యుయేట్ చదివిన పశువైద్య నిపుణులను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రెండు విడతల్లో 4652 మంది గ్రాడ్యుయేట్స్‌ను నియమించగా మరో 1896 పోస్టుల భర్తీకి ఇటీవలే నోటిఫికేషన్ ఇచ్చారు. ఆర్బీకేల్లో ట్రావిస్‌ను ఏర్పాటు చేసి, ప్రథమ చికిత్స అందజేస్తున్నారు. ఆర్బీకేలకు రూ.3వేల విలువైన మందులు, వైద్య పరికరాలు సమకూర్చారు.

రైతు ముంగిటకే అత్యవసర వైద్యసేవలు

ప్రతి నియోజకవర్గానికి రెండు చొప్పున రూ.240.69 కోట్ల వ్యయంతో 340 సంచార పశువైద్య అంబులెన్సులను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రతీ అంబులెన్స్‌లో వెటర్నరీ డిప్లమో చేసిన సహాయకుడు, డ్రైవర్ కమ్ అటెండర్లను ఏర్పాటు చేశారు. వీటిలో 295 స్పెషలిస్ట్ పశువైద్యులతో పాటు 337 పశువైద్య సహాయకులు సేవలందిస్తున్నారు. ప్రతీ వాహనంలో 51 రకాల వైద్యపరికరాలు ఉంచారు. 20 రకాల పేడ సంబంధిత, 15 రకాల రక్త పరీక్షలు చేసేందుకు వీలుగా చిన్నపాటి లేబొరేటరీని సమకూర్చారు. ప్రతీ అంబులెన్స్‌లో రూ.30వేల విలువైన 81 రకాల మందులు అందుబాటులో ఉంచారు. వీటి సేవల కోసం 1962తో టోల్ ఫ్రీ నెంబర్‌తో కాల్ సెంటర్ ఏర్పాటు చేశారు.

కచ్చితమైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు

దేశంలో మరెక్కడా లేనివిధంగా నియోజక వర్గస్థాయిలో రూ.24.14కోట్లతో 154 పశు వ్యాధి నిర్ధారణ ల్యాబ్స్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రతీ లేబొరేటరీలో ఒక టెక్నీషియన్, ఒక అటెండర్‌ని నియమించింది. వీటి ద్వారా పేడ పరీక్షలు, రక్త పరీక్షలు, పాల పరీక్షలు, మూత్ర పరీక్షలు, చర్మ సంబంధ వ్యాధి పరీక్షలు, యాంటీ బయోటిక్ సెన్సిటివిటీ, జీవక్రియ వ్యాధి పరీక్షలు నిర్వహిస్తున్నారు.

అత్యధికంగా పశువైద్యులు

ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రంలోనే అత్యధికంగా పశువైద్యులు సేవలందిస్తున్నారు. పశ్చిమ బెంగాల్‌లో 51,772, గుజరాత్‌లో 36,540, బీహార్‌లో 32,138, తెలంగాణలో 32,127, ఉత్తరప్రదేశ్‌లో 27,480, రాజస్థాన్‌లో 20,821 జీవాలకు ఒక గ్రాడ్యుయేట్ పశువైద్యుడు సేవలు అందిస్తుంటే, మన రాష్ట్రంలో ప్రతీ 17,808 జీవాలకు ఒక వైద్యుడు సేవలు అందిస్తున్నారు. అయినా ఇంకా ఏమీ చేయలేదన్నట్టు ఈనాడు అసత్య కథనాలు ప్రచురిస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తోంది. పదిమందిలో ఆ పత్రికే చులకనవుతోంది.

ప్రతిభకు పట్టాభిషేకం

- కళాకారులను ప్రోత్సహించేందుకే నాటక ప్రదర్శనలు
- జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- ముగిసిన నంది నాటకోత్సవం
- ఏడు రోజుల్లో 38 బాలల, సాంఘిక, పద్య నాటక ప్రదర్శనలు
- కళాకారులకు నంది పురస్కారాల ప్రదానం



డాక్టర్ మీగడ రామలింగస్వామిని సత్కరిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

పాత గుంటూరు: కళలపై ఆసక్తి తగ్గిపోతున్న ఈ రోజుల్లో నాటక రంగాన్ని, కళాకారులను ప్రోత్సహించి ఉత్తేజపరచాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష మేరకు నంది నాటకోత్సవాలను నిర్వహించి ప్రతిభ కలిగిన కళాకారులకు అవార్డులు అందిస్తున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. ఎల్లప్పుడూ సజీవంగా ఉండి సమాజానికి మంచి సందేశాన్నిచ్చేది నాటకమని అన్నారు. ఇక్కడ శుక్రవారం నిర్వహించిన నంది నాటక బహుమతుల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా బలిజేపల్లి లక్ష్మీకాంతం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎంతో ప్రాముఖ్యత కలిగిన నాటక రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజానికి ఉందన్నారు. రాష్ట్ర చలనచిత్ర, టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి మాట్లాడుతూ రాజకీయ సిఫార్సులకు తావులేకుండా నాటక రంగంలో దశాబ్దాల అనుభవం కలిగిన 27 మంది సీనియర్ కళాకారులను ఈ నాటక ప్రదర్శనలకు న్యాయ నిర్ణేతలుగా నియమించామన్నారు. సంస్థ ఎండీ టి.విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు ప్రసంగించారు.

ఉత్సాహంగా పోటీలు

గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరం వేదికగా స్వాతంత్ర్య సమరయోధుడు బలిజేపల్లి లక్ష్మీకాంతం పేరుతో వారం రోజులపాటు నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. 38 నాటక సమాజాలు పోటాపోటీగా బాలల, సాంఘిక నాటిక, పద్య నాటక ప్రదర్శనలు ఇచ్చాయి. నాటకాలు చూసేందుకు పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు తరలివచ్చారు. కళాకారుల బృందాలకు నగదు ప్రోత్సాహకాలు, ప్రశంస పత్రాలు మెమెంటోలు అందించి ఘనంగా సత్కరించారు.

ఈనెల 23న ప్రారంభమైన ప్రదర్శనలతో నగరంలో పండుగ వాతావరణం నెలకొంది. విద్యుత్ కాంతుల వెలుగు, విజ్ఞాన మందిరంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన 100 అడుగుల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కటౌట్, ఎత్తయిన బంగారు నంది విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుండి రాత్రి పది గంటల వరకు నిర్వహించిన నాటక ప్రదర్శనలు ప్రతి ఒక్కరిని ఆకర్షించాయి. ముందుగా ప్రదర్శించిన ఆనంద నిలయం పద్యనాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. కర్నూలు, కళాకారుల సంక్షేమ సంఘం నిర్వహణకు వల్లేటి లక్ష్మీ కులశేఖర్ రచనకు, వి.వి.రమణారెడ్డి దర్శకత్వం వహించారు.

విజేతలకు సత్కారాలు

విశాఖపట్నానికి చెందిన ప్రముఖ రంగస్థల నటుడు, రచయిత డాక్టర్ మీగడ రామలింగ స్వామిని ఎన్టీఆర్ రంగస్థలం పురస్కారం, రూ.లక్షన్నర నగదు, ప్రశంసాపత్రం, మెమోంటో, గజమాలతో సత్కరించారు.కాకినాడకు చెందిన యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ బృందానికి వైఎస్సార్ రంగస్థలం పురస్కారం, రూ 5 లక్షల నగదు, ప్రశంసాపత్రం, మెమోంటో బహూకరించి సత్కరించారు. న్యాయ నిర్ణేతలను కూడా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ మేనేజర్ శేష సాయి, రాష్ట్ర కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండెపూడి పురుషోత్తం, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ప్రభాకర్‌రెడ్డి, ఎఫ్‌డీసీ అధికారులు పాల్గొన్నారు.

వివిధ విభాగాల్లో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు అందుకున్న వారు వరుసగా..

పద్యనాటకాలు: మాధవవర్మ, శ్రీకాంత కృష్ణమాచార్య, వసంత రాజీయం

సాంఘిక నాటికలు: ఇంద్రప్రస్థం, ద ఇంపోస్టర్స్, కలనేత

సాంఘిక నాటికలు: అస్థికలు, కమనీయం, చీకటి పువ్వు

బాలల నాటికలు: ప్రపంచతంత్రం, బాధ్యత, మూడు ప్రశ్నలు

యూనివర్సిటీ నాటికలు: ఇంకానా, కపిరాజు, ఉద్ధంసింగ్,

అర్ధరాత్రి క్షుద్ర పూజలు!

- కృష్ణానది ఒడ్డున కలకలం
- మూడు రోజులుగా మాజీ మంత్రి ఉమా రహస్య పూజలు



రహస్యంగా పూజల్లో పాల్గొన్న ఉమా తదితరులు

గుంటుపల్లి (ఇబ్రహీంపట్నం): ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి కృష్ణానది ఒడ్డున అర్ధరాత్రి క్షుద్ర పూజలు నిర్వహించడం కలకలం సృష్టించింది. మూడు రోజులుగా గ్రామంలోని కృష్ణానది ఒడ్డున ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన స్థలంలో పూజలు జరగడంపై స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. మాజీ మంత్రి, టీడీపీ నేత దేవినేని ఉమామహేశ్వరావు రహస్యంగా పూజల్లో పాల్గొనడంపై విస్మయం వ్యక్తమవుతోంది. పూజలకు ఆయన తన కారులో కాకుండా వేరే కారులో వెళ్లడం పలు అనుమానాలకు దారితీసింది. తాంత్రిక పూజలు తెలిసిన వ్యక్తులు, పూజారులు, హిజ్రాలతో పూజలు చేయించారనే ప్రచారం జరుగుతోంది. ఏ కార్యక్రమం చేసినా ప్రచారం కోరుకునే ఉమా పార్టీ నాయకులు, అధికారులతో పాటు ఎవరికీ తెలియకుండా అర్ధరాత్రి రహస్య పూజలు చేయడం అనుమానాలకు బలం చేకూర్చింది. పూజల అనంతరం గొల్లపూడి సమీపంలో కృష్ణానది మధ్యన లంక ప్రదేశంలో ఉన్న ఆలయంలో కూడా పూజలు చేసినట్లు తెలిసింది. గతంలో కూడా ఇటువంటి తాంత్రిక పూజలు వివిధ ప్రాంతాల్లో ఉమా చేయించారని చెబుతున్నారు. పూజల వ్యవహారం బయట పడటంతో చివరి రోజు పార్టీ నాయకులను భోజనాలకు ఆహ్వానించారు. టీడీపీ నాయకుడి కుమారుడి వివాహం సందర్భంగా శాంతి పూజలని, పితృ దేవతలకు పిండ ప్రదానమని, చంద్రబాబునాయుడు ఆరోగ్యం కోసమని పొంతన లేని సమాధానాలు చెబుతుండటం గమనార్హం.

పర్యాటక రంగంలో ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు



మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ, యువకులకు రెస్టారెంట్ కెప్టెన్ కోర్సులో ఉచిత శిక్షణతోపాటుగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కేటరింగ్ టెక్నాలజీ అండ్ అప్లైడ్ న్యూట్రిషన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రమణ ప్రసాద్ చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ మొగల్రాజపురం జమ్మిచెట్టు సెంటర్ సమీపంలోని హోటల్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ భారత, ఏపీ పర్యాటక శాఖలు సంయుక్తంగా తిరుపతిలో తమ కళాశాలను స్థాపించి నిర్వహిస్తున్నాయని చెప్పారు. నిరుద్యోగ యువతకు ఉపాధి చూపేందుకు ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీడాప్) కలిసి దీనదయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజనలో భాగంగా తమ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ కళాశాలలో ఈ శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నామన్నారు ఇంటర్ లేదా ఐటీఐ ఉత్తీర్ణులై 18 నుంచి 28 సంవత్సరాల లోపు వయస్సున్న యువతీ యువకులు ఈ శిక్షణకు అర్హులని, రాష్ట్రంలోని ఏ ప్రాంతానికి చెందిన వారైనా దరఖాస్తు చేసుకోవచ్చునని వివరించారు. మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందని, శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచిత భోజనంతోపాటుగా వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి స్కిల్ ఇండియా సర్టిఫికెట్‌తో పాటుగా ప్రముఖ హోటళ్లలో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు జనవరి 6వ తేదీలోగా ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ లేదా సీడాప్.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు. ఇతర వివరాలకు 80996 69133, 97013 43846 నంబర్లలో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు. కళాశాల అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ ఎ.శివరామకృష్ణ సమావేశంలో పాల్గొన్నారు.

సుల్యారీ బొగ్గు గనిలో రూ. వెయ్యి కోట్ల ఆదాయం

రికార్డు సమయంలో ఆర్జించిన ఏపీఎండీసీ

సాక్షి, అమరావతి: మధ్యప్రదేశ్‌లోని సుల్యారీలో నిర్వహిస్తున్న బొగ్గు గనిలో ఉత్పత్తి, విక్రయాల ద్వారా రికార్డు సమయంలో ఏపీఎండీసీ రూ. 1000 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ఉత్పత్తి ప్రారంభించిన రెండో ఏడాదిలోనే అత్యధిక రెవెన్యూ సాధించడం పట్ల విజయవాడలోని ఏపీఎండీసీ కార్యాయలంలో అధికారులు, ఉద్యోగులు శుక్రవారం సంబరాలు జరుపుకున్నారు. సంస్థ వైస్ చైర్మన్ అండ్ ఎండీ వీజీ వెంకటరెడ్డి ఈ సందర్భంగా ఉద్యోగుల సమక్షంలో కేక్ కట్ చేసి సంతోషాన్ని పంచుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సుల్యారీలో 2022లో ఉత్పత్తిని ప్రారంభించామని, త్వరలోనే జార్ఖండ్‌లోని బ్రహ్మదియాలో కోకింగ్ కోల్ ప్రాజెక్టులోనూ ఉత్పత్తి ప్రారంభిస్తామని తెలిపారు. రాష్ట్రంలో బీచ్ శాండ్, ఐరన్ ఓర్ ఖనిజాల మైనింగ్‌కు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఏపీఎండీసీ సలహాదారు డీఎల్ఆర్ ప్రసాద్, సంస్థ వైస్ ప్రెసిడెంట్లు పాల్గొన్నారు.

వక్ఫ్ భూములు ఆక్రమించిన టీజీ భరత్

ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నాగుల్ మీరా

సాక్షి, అమరావతి: వక్ఫ్ భూమిని ఆక్రమించుకుని వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకున్న టీడీపీ నాయకుడు టీజీ భరత్‌పై క్రిమినల్ కేసులు పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా డిమాండ్ చేశారు. మైనార్టీ సంక్షేమ శాఖ స్పెషల్ సెక్రటరీ ఏఎండీ ఇంతియాజ్‌కు ఈ మేరకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. నాగుల్ మీరా మాట్లాడుతూ కర్నూలు జిల్లా రోజా గ్రామంలోని మసీదు ఇనామ్‌కు సంబంధించిన పాత సర్వే నంబర్ 10, కొత్త సర్వే నంబర్ 11 వక్ఫ్ భూములను టీజీ భరత్ కబ్జా చేశాడన్నారు. ఆ భూముల్లో టీజీ ప్రాజెక్ట్స్, ఇన్వెస్ట్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట అక్రమ నిర్మాణం చేసుకుని వ్యాపారం చేసుకుంటున్నాడని చెప్పారు.

వలంటీర్లకు ప్రతినెలా అదనంగా రూ.750

▶ మొదటి పేజీ తరువాయి

ఇంటింటికీ రేషన్ పంపిణీలో వలంటీర్లను మరింత భాగస్వాములను చేయనున్నారు. ఇందుకు సంబంధించి పౌరసరఫరాల శాఖ వలంటీర్లకు కొన్ని ప్రత్యేక విధులను నిర్ధారించింది. వీటిని కూడా రాష్ట్రవ్యాప్తంగా అధికారులకు తెలియజేశారు. కాగా వలంటీర్లకు రూ.750 అదనపు ప్రోత్సాహకాన్ని ఎప్పటి నుంచో వర్తింపజేస్తామో వేరేగా ఆదేశాలు జారీ చేయనున్నట్టు పౌరసరఫరాల శాఖ తెలిపింది.

ఇంటింటికీ రేషన్ పంపిణీలో వలంటీర్లకు ప్రత్యేక విధులు..

వలంటీర్లు తమ క్లస్టర్ (గ్రామీణ ప్రాంతాల్లో 50 ఇళ్ల పరిధి, పట్టణ ప్రాంతాల్లో 75–100 ఇళ్ల పరిధి)లో ఇంటింటికీ రేషన్ పంపిణీలో పూర్తి అనుసంధానకర్తలుగా వ్యవహరించాల్సి ఉంటుంది. లబ్ధిదారులు ప్రతినెలా ప్రభుత్వం అందజేసే రేషన్ సరుకులను తీసుకునేలా విస్తృత ప్రచారం చేయాలి. రేషన్ వాహనాలు ఇంటింటికీ పంపిణీకి వచ్చే సమయాన్ని ఒక రోజు ముందుగానే లబ్ధిదారులకు తెలియజేయాలి. పంపిణీ జరిగే సమయంలో వలంటీర్లు కూడా ఉండాలి. రేషన్ సరుకులు తీసుకునే క్రమంలో లబ్ధిదారులు వేలిముద్రలు వేయడం తదితర అంశాల్లో ఏవైనా ఇబ్బందులు తలెత్తితే అక్కడికక్కడే వాటి పరిష్కారానికి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి. తమ పరిధిలో రేషన్ పంపిణీలో ఏవైనా లోపాలు, అవకతవకలు జరిగినట్టు గుర్తిస్తే.. ఆ వివరాలను వెంటనే సంబంధిత వీఆర్వో లేదా డిప్యూటీ తహసీల్దార్‌లకు తెలియజేయాల్సి ఉంటుంది.

ఎన్నికల హామీలను వందశాతం అమలు చేశాం

- గెలిచే సీట్లు ఏమిటో లోకేశ్‌ను చెప్పమనండి
- ఎన్నికల్లో అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీని నెరవేర్చాం
- ఇప్పుడు 10 హామీలకు అంగీకరించాం
- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



విజయనగరం రూరల్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వందశాతం నెరవేర్చారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. విజయనగరం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి శుక్రవారం విచ్చేసిన ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో మరే రాష్ట్రంలో అమలుకాని అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. రాష్ట్రంలో ఓడిపోతామన్న చోట్ల బీసీలకు వైఎస్సార్‌సీపీ సీట్లు కేటాయిస్తోందని లోకేశ్ అంటున్నారని విలేకరులు ప్రశ్నించగా, అసలు రాష్ట్రంలో టీడీపీ గెలుస్తుందా అని మంత్రి ప్రశ్నించారు. ఓడిపోయేవి, గెలిచే సీట్ల జాబితా నారా లోకేశ్ ప్రకటించాలన్నారు. అంగన్‌వాడీల సమ్మెపై స్పందిస్తూ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా తెలంగాణలో కంటే రూ.1,000 అదనంగా వేతనం అందిస్తున్నామని, మరో 10 డిమాండ్లకు అంగీకరించామని తెలిపారు. ఆధారాలు, అర్థరహిత ఆరోపణలు అచ్చెన్నాయుడుకు అలవాటేనన్నారు. బీసీలకు మేలు చేసిన నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. వామపక్షాల నాయకులు వాస్తవాలు తెలుసుకుని ఆరోపణలు చేస్తే సమాధానాలు ఇస్తామన్నారు. రెండు విడతల్లో సుమారు రూ.1400 కోట్లతో ట్యాబ్‌ల కొనుగోలు చేస్తే రూ.2,500 కోట్ల స్కామ్ ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. ఎన్నికల వేళ రాజకీయ పార్టీలు ఆయా నియోజకవర్గ పరిస్థితుల ఆధారంగా సీట్ల మార్పు చేయడం సహజమని, చంద్రబాబు చంద్రగిరి నుంచి కుప్పానికి ఎందుకొచ్చారన్నారు. వైఎస్ షర్మిల ఆంధ్రా రాజకీయాలకు వస్తే తమ పార్టీకి వచ్చే నష్టమేమి లేదన్నారు.

నేను వైఎస్సార్‌సీపీ విధేయుడిని

- సీఎం జగన్ ఎవరికి టికెట్ ఇచ్చినా స్వాగతిస్తా
- వైఎస్సార్‌సీపీ గెలవడమే ముఖ్యం
- జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



గోకవరం: కాకినాడ జిల్లా జగ్గంపేట నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయం కోసం సీఎం జగన్ ఏ నిర్ణయం తీసుకున్నా స్వాగతిస్తానని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు చెప్పారు. తాను వైఎస్సార్‌సీపీకి విధేయుడినని స్పష్టం చేశారు. శుక్రవారం గోకవరంలో 30 పడకల ఆస్పత్రి భవనాన్ని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'సీఎం జగన్ సహకారంతో ఎమ్మెల్యేగా జగ్గంపేట నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశాను. రాజకీయాల్లో ఎన్నో సమీకరణాలు జరుగుతాయి. పార్టీకి మేలు జరుగుతుందంటే ఎవరికి అవకాశమిచ్చినా స్వాగతిస్తా. గతంలో నాకు తోట నరసింహం సహకరించారు.. ఇప్పుడు ఆయనకు టికెట్ ఇచ్చినా నేను కచ్చితంగా సహకరిస్తా. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడమే ముఖ్యం. నియోజకవర్గంలో కొత్తగా ఎవరు బాధ్యతలు తీసుకున్నా.. పార్టీ నాయకులు, కార్యకర్తలందరినీ కలుపుకొని ముందుకు సాగాలి. నాకు మద్దతుగా పార్టీకి ఎవ్వరూ రాజీనామా చెయ్యలేదు. అదే నిజమైతే.. ఈరోజు వారంతా నా వెంట ఉండేవారు. నేను పార్టీ మారుతానంటూ రకరకాల పుకార్లు షికారు చేస్తున్నాయి. అవన్నీ నిజం కాదు. ఎన్నికలకు ఇంకా సమయం ఉంది. మరో మూడు నెలలు నేనే ఎమ్మెల్యేగా ఉంటా. నాకు ఇచ్చిన అవకాశంతో ఎంత సేవ చేశానన్నదే నాకు ముఖ్యం' అని ఎమ్మెల్యే చంటిబాబు చెప్పారు.

క్లుప్తంగా...

హైకోర్టులో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

పాల్గొన్న పలువురు న్యాయమూర్తులు



హైకోర్టు న్యాయవాదుల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తులు

సాక్షి, అమరావతి: హైకోర్టులో శుక్రవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు న్యాయమూర్తులు జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, జస్టిస్ ఉప్మాక దుర్గా ప్రసాదరావు, జస్టిస్ గుహనాధన్ నరేందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేకులు కట్‌చేసి పంచిపెట్టారు. అనంతరం హైకోర్టు న్యాయవాదుల సంఘం వార్షిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జానకి రామిరెడ్డి, ఉపాధ్యక్షుడు పీఎస్‌పీ సురేశ్, ప్రధాన కార్యదర్శి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రిలో విద్యుత్ ఉత్పత్తి పునరుద్ధరణ



పరవాడ(పెందుర్తి): అనకాపల్లి జిల్లా పరవాడ సమీపంలోని సింహాద్రి ఎన్టీపీసీ రెండో యూనిట్‌లో మరమ్మతుల అనంతరం శుక్రవారం విద్యుదుత్పత్తిని పునరుద్ధరించారు. ఎన్టీపీసీలో 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండో యూనిట్‌లో బ్రాయిలర్‌లో అమర్చిన ట్యూబ్‌కు రంధ్రం ఏర్పడిన నేపథ్యంలో గత ఆదివారం విద్యుదుత్పత్తికి అంతరాయం కలిగిన విషయం తెలిసిందే. సాంకేతిక నిపుణులు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టిన అనంతరం శుక్రవారం ఉదయం 8 గంటలకు యూనిట్‌లో విద్యుదుత్పత్తిని లైటాప్ చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి సరఫరా సాధ్యమైంది. నవంబర్‌లో వార్షిక మరమ్మతులకు నిలిపిన మొదటి యూనిట్‌లో మరమ్మతులు వేగవంతంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం 2,3,4 యూనిట్లు యథావిధిగా పనిచేస్తున్నాయని సంస్థ అధికారులు ప్రకటించారు.

వాట్సాప్ ద్వారా లోకేశ్‌కు నోటీసులు జారీ

సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వం హయాంలో జరిగిన అవినీతికి సంబంధించిన కేసుల్లో కీలక సాక్షులుగా ఉన్న ఉన్నతాధికారులను బెదిరించే రీతిలో చేసిన వ్యాఖ్యలపై న్యాయస్థానం జారీ చేసిన నోటీసుల కాపీని తీసుకునేందుకు నారా లోకేశ్ వరుసగా రెండోరోజు శుక్రవారం కూడా సుముఖత చూపించలేదు. లోకేశ్‌కు నోటీసుల కాపీని అందించేందుకు సీఐడీ అధికారులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దాంతో సీఐడీ అధికారులు లోకేశ్‌కు వాట్సాప్ ద్వారా శుక్రవారం నోటీసులను పంపారు. ఆ నోటీసులు అందినట్టు ఆయన వాట్సాప్ ద్వారా మెస్సేజ్ పంపారు.

కేజీబీవీల్లో 'జన్య' కార్యక్రమాలు

సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 25 కేజీబీవీల్లో కేపీఎంజీ సహకారంతో 'జన్య' కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకుడు బి.శ్రీనివాసరావు తెలిపారు. సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయంలో జన్య ల్యాబ్ ఇన్ ఎ బాక్స్ (జేఎల్ఐబీ) ప్రోగ్రామ్ జన్య ఫౌండేషన్ ఆపరేషన్స్ మేనేజర్ కె.సురేంద్రకుమార్‌తో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. జన్య ల్యాబ్ ద్వారా దేశంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అభ్యాస కేంద్రాలను అమలు చేయడం లక్ష్యమని, తద్వారా సైన్స్, గణితాన్ని సులువుగా అర్థం చేసుకోవడంలో పిల్లలకు సహాయపడుతుందన్నారు. స్టాన్‌ఫర్డ్ పూర్వ విద్యార్థులు, ప్రభుత్వ ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో ప్రయోగాలతో అభివృద్ధి చేసిన 340 అత్యాధునిక సైన్స్, గణితానికి సంబంధించిన అంశాల కిట్లు ఇందులో ఉంటాయన్నారు.

'వ్యూహం' నిలుపుదలకు కాంగ్రెస్ పిటిషన్

సాక్షి, అమరావతి: ప్రముఖ దర్శకుడు రాంగోపాల్ వర్మ దర్శకత్వంలో రూపొందిన 'వ్యూహం' సినిమా ప్రదర్శనకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్(సీబీఎఫ్‌సీ) ఇచ్చిన ధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. వ్యూహం సినిమాలో తమ పార్టీ అగ్రనేత సోనియాగాంధీతో పాటు ఇతర నేతలను కించపరిచే విధంగా చిత్రీకరణలున్నాయని, అందువల్ల ఈ సినిమా ప్రదర్శనను అడ్డుకోవాలని కోరుతూ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ)ఉపాధ్యక్షుడు మీసాల రాజేశ్వరరావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై శుక్రవారం జస్టిస్ జయసూర్య విచారణ జరిపారు. కేంద్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది జూపూడి వెంకట కుమార్ యజ్ఞదత్ వాదనలు వినిపిస్తూ, ఇదే సినిమాపై ఇప్పటికే తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత గంటా శ్రీనివాసరావు దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైందని తెలిపారు. ఆ పిల్‌పై విచారణ సంక్రాంతి సెలవుల తరువాతకు వాయిదా పడిందని వివరించారు. వ్యూహం సినిమా ప్రదర్శనకు సీబీఎఫ్‌సీ జారీ చేసిన ధ్రువీకరణ పత్రం అమలును తెలంగాణ హైకోర్టు నిలుపుదల చేసిందని, జనవరి 11 వరకు సినిమాను ప్రదర్శించవద్దని ఆదేశాలు జారీ చేసిందని న్యాయమూర్తి దృష్టికి తీసుకొచ్చారు.



విజయవాడలోని కానూరులో క్రికెట్ ఆడుతున్న రాష్ట్ర క్రీడల ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న



పల్నాడు జిల్లా అమరావతి మండలం మునగోడులో ఖోఖో ఆడుతున్న మహిళలు



ప్రకాశం జిల్లా మార్కాపురం జెడ్పీ హైస్కూల్లో కబడ్డీ ఆడుతున్న మహిళలు



ఏలూరు ఇండోర్ స్టేడియంలో ఉత్సాహంగా క్రికెట్ ఆడుతున్న యువకులు

ఆనందం.. ఆకాశాన్నంటింది

- 'ఆడుదాం.. ఆంధ్రా'లో ఉప్పొంగిన ఉత్సాహం
- హోరా హోరీగా తలపడుతున్న క్రీడాకారులు
- ఒక్కరోజులో 18,871 మ్యాచ్‌లు పూర్తి
- నాలుగు రోజుల్లో క్రీడల్ని తిలకించిన 28.60 లక్షల మంది



ఆగిరిపల్లిలో కబడ్డీ పోటీల్లో తలపడుతున్న యువకులు

సాక్షి నెట్‌వర్క్/అమరావతి: గ్రామాల్లో 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా సంబరం పండుగ వాతావరణాన్ని తలపిస్తోంది. క్రీడా మైదానాల్లోకి యువత భారీ సంఖ్యలో దూసుకొస్తున్నారు. నాల్గవ రోజు శుక్రవారానికి 14,396 గ్రామ/వార్డు సచివాలయాల్లో పోటీలు ప్రారంభమయ్యాయి. దాదాపు 96.61 శాతం సచివాలయాల్లో క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. అనంతపురం, విశాఖపట్నం, అనకాపల్లి, ప్రకాశం జిల్లాల్లో 100 శాతం సచివాలయాల్లో పోటీలు మొదలయ్యాయి. ఒక్క రోజే 21,488 మ్యాచ్‌లకు షెడ్యూల్ చేస్తే 18,871 మ్యాచ్‌లను పూర్తి చేశారు. ఏలూరు, బాపట్ల, అనంతపురం, కృష్ణా, వైఎస్సార్, తూర్పుగోదావరి, అనకాపల్లి, చిత్తూరు, విజయనగరం, అన్నమయ్య జిల్లాల్లో 92 శాతానికిపైగా మ్యాచ్ షెడ్యూల్ పూర్తయింది. మొత్తం .16లక్షల మంది వీక్షకులు హాజరవగా.. మొత్తంగా నాలుగు రోజుల్లో 28.60 లక్షల మంది ఆడుదాం ఆంధ్ర క్రీడలను వీక్షించారు.

పల్నాడుకే వన్నె తెచ్చిన క్రీడలు

పల్నాడు జిల్లా వ్యాప్తంగా యువత ఆటల పోటీలలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పర్యవేక్షించారు. సత్తెనపల్లిలోని శరభయ్యగుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో క్రికెట్ పోటీలను మంత్రి అంబటి రాంబాబు ప్రారంభించి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో క్రీడాకారులు పాల్గొన్నారు. చిత్తూరు జిల్లాలో 257 సచివాలయాల పరిధిలో 467 మైదానాల్లో పోటీలు జరిగాయి. ఇక్కడ 666 మ్యాచ్‌లకు గాను 664 మ్యాచ్‌లు నిర్వహించారు. 8,816 మంది క్రీడాకారులు పాల్గొనగా, 32,850 మంది ప్రేక్షకులు వీక్షించారు. క్రీడల నిర్వహణ పై కలెక్టర్ షణ్మోహన్ క్షేత్రస్థాయిలో సమీక్షించారు. తిరుపతి జిల్లాలో 392 సచివాలయాల పరిధిలోని మైదానాల్లో క్రీడలు నిర్వహించారు. 1261 మ్యాచ్‌లకు గాను 1260 మ్యాచ్‌లను నిర్వహించారు.

కడపలో కదం తొక్కారు

కడప జిల్లా వ్యాప్తంగా క్రీడా పోటీలు సంబరాన్ని తలపిస్తున్నాయి. పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. కడపలో నిర్వహించిన పోటీలను జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె.జగన్నాథరెడ్డి పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. జిల్లాలోని పలు మండలాల్లో ఎంపీడీఓలు, ఫిజికల్ డైరెక్టర్లు టోర్నమెంట్‌ను పర్యవేక్షించారు. ఏలూరు జిల్లాలో 500 సచివాలయాల పరిధిలో 690 మ్యాచ్‌లు నిర్వహించారు. స్థానిక ఇండోర్ స్టేడియంతో పాటు పాఠశాల్లో 70 మ్యాచ్‌లు జరిగాయి. విజయవాడలోని కానూరి వీఆర్ సిద్ధార్థ కళాశాలలో జరుగుతున్న పోటీల్లో క్రీడల ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

విజయవంతంగా ఆడుదాం ఆంధ్రా



ప్రభుత్వం నిర్వహిస్తున్న 'ఆడుదాం.. ఆంధ్రా' ఆటల పోటీలు విజయవంతంగా జరుగుతున్నాయి. ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి వారిని వెలుగులోకి తీసుకురావటానికి ఈ ఆటల పోటీలు దోహదపడుతాయి. రాష్ట్ర వ్యాప్తంగా చాలా మంది క్రీడాకారులు వారి పేర్లు నమోదు చేసుకొని క్రీడల్లో పాల్గొంటున్నారు. సచివాలయం స్థాయి నుంచి ఆటల పోటీలు నిర్వహించి ప్రతిభ చాటిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే విధంగా చక్కని అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– ప్రద్యుమ్న, రాష్ట్ర క్రీడల ప్రిన్సిపల్ సెక్రటరీ

ఏమిటీ తప్పుడు రాతలు?

గతంలో సిమెంటు స్తంభాలకు ప్రతిపాదనలు.. ఇప్పుడు ఎం+ స్తంభాల ఏర్పాటుకు నిర్ణయం

- అప్పట్లో విడివిడిగా లేబర్ ఖర్చు, మెటీరియల్ చార్జీలు.. ఇప్పుడు మొత్తం కలిపి ఒకే రేటు
- ఆక్వా రంగానికి కోతల్లేని విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రయత్నం తప్పా రామోజీ?
- అత్యవసర పనులను చేపట్టిన తర్వాత ఏపీఈఆర్‌సీ అనుమతి తీసుకోవచ్చు
- అవగాహన లేకుండా తప్పుడు రాతలతో ప్రజలకు జరిగే మంచిని అడ్డుకుంటారా?
- ఈనాడు కుట్రపూరిత కథనంపై మండిపడ్డ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్



కె.సంతోష్‌రావు, సీఎండీ

సాక్షి, అమరావతి: ప్రజలకు ఏమాత్రం మంచి జరుగుతున్నా చూడలేకపోతోంది ఈనాడు. ముఖ్యంగా రైతులకు మేలు చేస్తుంటే అసలు తట్టుకోలేకపోతోంది ఆ పచ్చ పత్రిక. అందులోను ఆక్వా రంగానికి విద్యుత్ ఎంత ప్రధానమో తెలిసి కూడా ఆ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సంస్థల ద్వారా చేస్తున్న మేలుకు తప్పుడు రాతల ద్వారా అడ్డుపడుతోంది. అందులో భాగంగానే 'విద్యుత్ ఇంజనీర్లే విస్తుపోయేలా' అంటూ కనీస అవగాహన లేకుండా ఓ అబద్ధపు వార్తను శుక్రవారం వండి వార్చింది. గతంలో ధరలకు ప్రస్తుత ధరలకు భారీ వ్యత్యాసం ఉందని, లేబర్ చార్జీలు మెటీరియల్ చార్జీలకంటే ఎక్కువ చూపించారని, ఏపీఈఆర్‌సీ అనుమతి కూడా తీసుకోలేదని చేతికొచ్చిన అసత్యాలు అచ్చేసింది. ఈ కుట్రపూరిత కథనాన్ని ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీసీపీడీసీఎల్) తీవ్రంగా తప్పుబట్టింది. ఈ కథనంలో తప్పుల్ని ఆ సంస్థ సీఎండీ కె.సంతోష్‌రావు 'సాక్షి'కి వెల్లడించారు. ఆయన తెలిపిన మేరకు వాస్తవాలు ఇలా ఉన్నాయి.

➤ పశ్చిమగోదావరి జిల్లా 220/33 కేవీ అకివీడు సబ్‌స్టేషన్ నుంచి కృష్ణాజిల్లా 33/11 కేవీ పోతుమర్రు సబ్‌స్టేషన్‌కి అనుసంధానం చేస్తూ విద్యుత్ లైన్లు వేయాలని గతంలోనే ఏపీసీపీడీసీఎల్ ప్రతిపాదించింది. ఈ సబ్‌స్టేషన్ పరిధిలో సుమారు 976 ఆక్వారంగ సంబంధిత పరిశ్రమలున్నాయి. ఇవి నెలకు 30 లక్షల యూనిట్ల విద్యుత్ వినియోగిస్తున్నాయి. ఈ సర్వీసులకు ఎటువంటి అంతరాయం లేకుండా విద్యుత్ అందించడానికి ఈ అనుసంధానం తప్పదని డిస్కం భావించింది. ఈ ఇంటర్ లింకింగ్ లైన్ గతంలో ప్రతిపాదించినప్పటికి ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) నుంచి విద్యుత్ సరఫరాకి కావలసిన అనుమతుల్లో జాప్యం కారణంగా ఈ ప్రతిపాదనలు ముందుకు వెళ్లలేదు. తాజాగా ఆంధ్రప్రదేశ్ పవర్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ (ఏపీ ట్రాన్స్‌కో) అనుమతులు రావడంతో పనుల్లో కదలిక వచ్చింది.



➤ 132/33 కేవీ చిగురుకోట సబ్‌స్టేషన్ నుంచి వెలువడే 33 కేవీ పోతుమర్రు ఫీడర్‌పై 33/11 కేవీ పోతుమర్రు సబ్‌స్టేషన్‌కు ఫీడ్ చేస్తున్నారు. ఇదే ఫీడర్‌పై 33/11 కేవీ పోతుమర్రు సబ్‌స్టేషన్, 33/11 కేవీ మూలలంక సబ్‌స్టేషన్ కూడా అనుసంధానమై ఉన్నాయి. దీంతో ఈ ఫీడర్ 20 మెగావాట్ల కంటే ఎక్కువ లోడును నమోదు చేస్తోంది. వేసవి కాలంలో అధిక లోడ్ కారణంగా లోడ్ రిలీఫ్ (ఎల్ఆర్) విధించాల్సి వస్తోంది. అదీకాకుండా ఈ రెండు సబ్‌స్టేషన్లు ప్రధానంగా ఆక్వాకు విద్యుత్‌ను అందిస్తున్నాయి. 33/11 కేవీ పోతుమర్రు సబ్‌స్టేషన్‌పై 950కి పైగానే ఆక్వా సర్వీసులున్నాయి. ఈ రెండు సబ్‌స్టేషన్లకు 33 కేవీ ప్రత్యామ్నాయ సరఫరా లేదు. అలాగే 132/33 కేవీ చిగురుకోటపై లోడ్ గరిష్టంగా 124 మెగావాట్లుగా నమోదైంది. ఈ ప్రాంతంలో లోడ్ పెరుగుదల సంవత్సరానికి 25 నుంచి 30 శాతంగా ఉంది. అందువల్ల 220/33 కేవీ ఆకివీడు నుంచి కొత్త లైను ఏర్పాటు చేయడం అనివార్యమైంది.

➤ రెండేళ్ల కిందట ఈ ఇంటర్ లింకింగ్ లైన్ సిమెంట్ పోల్స్‌తో ప్రతిపాదనలు తయారు చేశారు. ఇప్పుడు మిచాంగ్ తుపాను ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకోవడంతోపాటు, సముద్రతీర ప్రాంతానికి దగ్గరగా ఉండడం వలన 33 కేవీ లైన్లు ఎం+ రూపంలో ఉండే మెటల్ టవర్స్‌ను ప్రతిపాదించారు. వీటివల్ల చెట్లు విరిగినా లైన్లకు ఎటువంటి సమస్య కలగదు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండదు. ఈ టవర్స్ చాలాకాలం మన్నికగా ఉంటాయి. ఉప్పుటేరు కెనాల్‌ను పరిగణలోకి తీసుకుని అధికారులు ఈ ప్రతిపాదనలు చేశారు.

➤ సిమెంట్ పోల్స్‌కి సంబంధించి లేబర్ ప్రతిపాదనలు వేరుగా, ప్రతి ఎం+ టవర్‌కి సంబంధించి లేబర్ కాస్ట్, టవర్స్ మెటీరియల్ కాస్ట్ కలిపి ప్రతిపాదించడం వలన ఈ రెండు ప్రతిపాదనల మధ్య అంచనాల్లో వ్యత్యాసం ఉంటుంది. ఈ ప్రతిపాదనలు లేటెస్ట్ స్టాండర్డ్ షెడ్యూల్ ఆఫ్ రేట్స్ (ఎస్ఎస్ఆర్) డేటా ప్రకారం తయారుచేసి టెండర్ పిలవడం జరిగింది. సిస్టమ్ అప్లికేషన్స్ అండ్ ప్రొడక్ట్స్ (ఎస్ఏపీ)లో ప్రతిపాదనలు చేయడం వల్ల లేబర్ కాస్ట్‌కి సంబంధించి ఎటువంటి దాపరికాలకు ఆస్కారం లేదు.

➤ యథార్థాలు తెలుసుకోకుండా ఈనాడు పత్రిక వార్తలు ప్రచురించడం సరైన పద్ధతి కాదు. ఈనాడు వార్తను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఆక్వా రంగానికి నిరంతరాయ విద్యుత్ చాలా ముఖ్యం. ఏమాత్రం కోతలున్నా.. ఆక్సిజన్ అందక రొయ్యలు చనిపోతాయి. ఆక్వా రైతులకు భారీ నష్టం వాటిల్లుతుంది. అలాంటి పరిస్థితి వారికి రాకుండా చేసేందుకు చేపడుతున్న ప్రాజెక్టుపై ప్రజలు, రైతుల్లో లేనిపోని అపోహలు సృష్టించే ప్రయత్నం చేసిన ఈనాడు ఇకనైనా వాస్తవాలు తెలుసుకుని వార్తలు రాయాలి.

అధికారమిస్తే.. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు

- నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి
- కుప్పంలో 35 ఏళ్లుగా లేని అభివృద్ధిని ఇప్పుడు చేస్తా
- ఎయిర్‌పోర్టు కట్టిస్తా.. అన్ని గ్రామాలకు సిమెంట్ రోడ్లు వేస్తా
- రైతులు పొలాలకు సులభంగా వెళ్లేలా సౌకర్యాలు కల్పిస్తా
- వ్యవసాయం లాభసాటిగా మారింది
- టీడీపీ అధినేత చంద్రబాబు



జనం లేక బోసిపోయిన చంద్రబాబు ర్యాలీ

సాక్షి, చిత్తూరు/శాంతిపురం/రామకుప్పం: తాము అధికారంలోకి వస్తే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని.. నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించారు. కుప్పం పర్యటనలో భాగంగా చంద్రబాబు శుక్రవారం శాంతిపురం, రామకుప్పంలో రోడ్ షోలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'కుప్పం నియోజకవర్గంలో గత 35 ఏళ్లలో జరగనంత అభివృద్ధిని రానున్న 5 ఏళ్లలో చేసి చూపిస్తా. ఒక్కో గ్రామంలో టమోటా రైతులు రూ.5 కోట్లు సంపాదించారంటే వ్యవసాయం ఎంత లాభసాటిగా మారిందో తెలుస్తోంది. కుప్పం పంటలను ప్రపంచమంతా విక్రయించేలా చూస్తా. శాంతిపురంలో రూ.100 కోట్లతో ఎయిర్‌పోర్టు కట్టిస్తా. కుప్పం నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు సిమెంట్ రోడ్లు వేసి.. రైతులు తమ పొలాలకు సులభంగా వెళ్లేలా సౌకర్యాలు కల్పిస్తా. టీడీపీ అధికారంలో ఉంటే హంద్రీ-నీవా ఎప్పుడో పూర్తయ్యేది. నేను కుప్పానికంటే ముందు పులివెందులకు నీళ్లు ఇచ్చా. ప్రస్తుత ప్రభుత్వం కుప్పానికి ఎందుకు నీళ్లు ఇవ్వలేదో చెప్పాలి. ఇసుక, మద్యం, మైనింగ్, అడవులు.. ఇలా అన్నీ దోపిడీకి గురయ్యాయి. మేము అధికారంలో వస్తే ఏ ఒక్కరినీ వదిలిపెట్టం. నేను బటన్ నొక్కకుండానే కాలేజీలకు ఫీజులు కట్టా. నేను అన్నీ సాధించాను. ప్రజల కోసమే బతుకుతున్నాను. నాకు సీఎం పదవి అవసరం లేదు' అని చంద్రబాబు అన్నారు. శాంతిపురంలో పలువురికి చంద్రబాబు పసుపు కండువాలు వేశారు. వీరంతా టీడీపీకి చెందినవారే కావడం గమనార్హం. కాగా, కుప్పానికి సమీపంలోని కడపల్లి వద్ద నిర్మిస్తున్న తన కొత్త ఇంటి నిర్మాణ పనులు చంద్రబాబు పరిశీలించారు. అలాగే అంగన్‌వాడీ కార్యకర్తల శిబిరాన్ని సందర్శించి.. వారితో మాట్లాడారు.

కుప్పంలో జనసేన నేతల బాహాబాహీ

- పవన్ రాజకీయ కార్యదర్శి పసుపులేటిపై దాడికి యత్నం
- చంద్రబాబుతో పరిచయ కార్యక్రమంలో జనసేన కార్యకర్తల మధ్య భగ్గుమన్న విభేదాలు

కుప్పం: జనసేన పార్టీలో నివురుగప్పిన నిప్పులా ఉన్న వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. కుప్పంలో శుక్రవారం రాత్రి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుతో జనసేన కార్యకర్తల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. వేదికపై పవన్‌కళ్యాణ్ రాజకీయ కార్యదర్శి డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, జనసేన కుప్పం కార్యదర్శి నరేష్ కూర్చున్నారు. ఈ సందర్భంగా జనసేన జిల్లా నేతలను పసుపులేటి హరిప్రసాద్ వేదికపైకి ఆహ్వానించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలను కాకుండా జిల్లా నేతలను మాత్రమే వేదికపైకి పిలవడంపై నరేష్ అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమం ముగిసి చంద్రబాబు వెళ్లిపోయిన తరువాత హరిప్రసాద్, నరేష్ మధ్య వాగ్వాదం మొదలైంది. పార్టీ కోసం కష్టపడే స్థానిక నేతలను కాకుండా జిల్లా నేతలను ఎందుకు పిలిచారంటూ నరేష్, ఆయన అనుచరులు వాదనకు దిగారు. రెండువర్గాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పరస్పర దాడులు, తోపులాటలకు దిగారు. హరిప్రసాద్ ప్రాణభయంతో కారులో దాక్కున్నారు. కుప్పం జనసేన కార్యకర్తలు పసుపులేటి కారుపై దాడిచేశారు. ఆయన కారు స్వల్పంగా ధ్వంసమైంది. దీంతో ఆయన ఆ కారులోనే అక్కడి నుంచి వెళ్లిపోయారు. చంద్రబాబు కుప్పం పర్యటనలో జనసేన కార్యకర్తల విభేదాలు భగ్గుమనడం సర్వత్రా చర్చకు దారితీసింది.

వివేకా కుమార్తె, అల్లుడు, సీబీఐ అధికారి రామ్‌సింగ్‌పై చార్జ్‌షీట్ దాఖలు

పులివెందుల న్యాయస్థానంలో దాఖలు చేసిన పోలీసులు

సాక్షి, అమరావతి/పులివెందుల: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి పీఏ కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు సీబీఐ అధికారి రామ్‌సింగ్, వివేకా కుమార్తె నర్రెడ్డి సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డిపై నమోదు చేసిన కేసులో పోలీసులు పులివెందుల న్యాయస్థానంలో శుక్రవారం చార్జ్‌షీట్ దాఖలు చేశారు. వైఎస్ వివేకా హత్య కేసు విచారణలో తాము చెప్పినట్టు అవాస్తవాలు చెప్పాలని తనను వేధించి చిత్రహింసలకు గురి చేశారని కృష్ణారెడ్డి న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. తనను శారీరకంగా, మానసికంగా వేధించారని... తన కుటుంబాన్ని తీవ్ర మనోవ్యధకు గురిచేశారని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. తనను తీవ్రంగా వేధించడంతో పాటు సాక్ష్యాలను కూడా తారుమారు చేసేలా వ్యవహరించారని న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చారు. దానిపై స్పందించిన న్యాయస్థానం కేసు నమోదు చేసి జనవరి 4లోగా తనకు తుది నివేదిక సమర్పించమని ఆదేశించింది. దాంతో పులివెందుల పోలీసులు రామ్‌సింగ్, సునీత, నర్రెడ్డి రాజశేఖరరెడ్డిపై ఈ నెల 15న కేసు నమోదు చేశారు. కాగా, పోలీసులు ఈ కేసులో రామ్‌సింగ్, నర్రెడ్డి సునీత, నర్రెడ్డి రాజశేఖరరెడ్డిపై చార్జ్‌షీట్ దాఖలు చేశారు. వివేకా హత్య కేసు దర్యాప్తు చేసిన తొలి, రెండో సిట్ నివేదికల ఆధారంగా 27 మంది వాంగ్మూలాలు, వివేకా హత్య జరిగిన రోజు ఆయన నివాసంలో తీసిన వీడియో ఫుటేజీని కూడా సమర్పించారు. కాగా ఇప్పటికే పులివెందుల పోలీసులు నమోదు చేసిన కేసుపై రాంసింగ్, సునీత, రాజశేఖర్‌రెడ్డి హైకోర్టులో స్క్వాష్ పిటిషన్ వేసినట్లు సమాచారం.

బీజేపీకి తోట నగేష్ రాజీనామా

సీతంపేట(విశాఖ ఉత్తర): బీజేపీ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడు తోట నగేష్ ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడి పదవికి రాజీనామా చేశారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో రాజీనామా లేఖను విడుదల చేశారు. ప్రజా పోరాటాలకు స్వేచ్ఛ లేకనే పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి రాజీనామా లేఖను పంపుతున్నట్టు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రయత్నంలో స్పష్టత లేదన్నారు. బీజేపీ రాష్ట్ర కమిటీలో నేతలకు సమన్యాయం జరగడం లేదని చెప్పారు. తన అనుచరులు, శ్రేయోభిలాషులతో చర్చించి ఏ పార్టీలో చేరుతానో త్వరలో ప్రకటిస్తానని వివరించారు.

కెప్టెన్‌కు కన్నీటి వీడ్కోలు

- అధికార లాంఛనాలతో చెన్నైలో అంత్యక్రియలు
- లక్షలాదిగా తరలి వచ్చిన అభిమానులు



సాక్షి, చెన్నై: అనారోగ్యంతో మృతి చెందిన డీఎండీకే అధినేత, సినీనటుడు పురట్చి కలైంజ్ఞర్ కెప్టెన్ విజయకాంత్ పార్థీవదేహానికి అప్తులు, రాజకీయ ప్రముఖులు, లక్షలాదిమంది అభిమానులు కన్నీటి వీడ్కోలు పలికారు. చెన్నై కోయంబేడులోని డీఎండీకే కార్యాలయం ఆవరణలో తమిళనాడు ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో శుక్రవారం సాయంత్రం ఘనంగా అంత్యక్రియలు జరిగాయి. గురువారం డీఎండీకే కార్యాలయంలో ఉంచిన విజయకాంత్ పార్థీవదేహాన్ని కడసారిగా చూసుకునేందుకు అభిమాన జనసందోహం పోటెత్తింది. క్రమంగా తాకిడి పెరగడం, స్థలం చిన్నది కావడంతో రాత్రికి రాత్రే చెన్నై ఐల్యాండ్ గ్రౌండ్‌లో తమిళనాడు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. శుక్రవారం ఉదయాన్నే ఆయన భౌతికకాయాన్ని అక్కడికి తరలించారు. దక్షిణ భారత చలన చిత్ర సూపర్‌స్టార్ రజనీకాంత్, దళపతి విజయ్, నటి కుష్బు, నటుడు రాధారవి విజయకాంత్ పార్థీవదేహానికి నివాళులర్పించే క్రమంలో ఉద్వేగానికి లోనయ్యారు. విశ్వనటుడు కమలహాసన్‌తో పాటు కోలీవుడ్ వర్గాలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అంజలి ఘటించారు. కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీ తరఫున ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నివాళులర్పించారు.

అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

శుక్రవారం సాయంత్రం 3 గంటలకు ఐల్యాండ్ గ్రౌండ్ నుంచి లక్షలాది మంది అభిమాన జన సందోహం నడుమ మూడు గంటల పాటు విజయకాంత్ అంతిమ యాత్ర సాగింది. ప్రభుత్వ లాంఛనాలతో మూడు రౌండ్ల కాల్పులతో విజయకాంత్‌కు నివాళులర్పించారు. రాత్రి 7.15 గంటలకు విజయకాంత్ పార్థీవదేహాన్ని ఖననం చేశారు. అనంతరం తమ కుటుంబ సంప్రదాయపరమైన కార్యక్రమాలను విజయకాంత్ సతీమణి ప్రేమలత విజయకాంత్, కుమారులు విజయ ప్రభాకరన్, షణ్ముగ పాండియన్, ఇతర కుటుంబసభ్యులు ముగించారు. తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, సీఎం స్టాలిన్, మంత్రులు ఉదయనిధి, ఎం.సుబ్రమణియన్, తంగం తెన్నరసు, నెహ్రూ, అన్బరసన్‌తో పాటు పలు పార్టీల నాయకులు అంత్యక్రియలకు హాజరయ్యారు.

జనవరి 4 నుంచి జయహో బీసీ : లోకేశ్

సాక్షి, అమరావతి: బీసీలను చైతన్యం చేసేందుకు జనవరి 4వ తేదీ నుంచి జయహో బీసీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తెలిపారు. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ పాలనలో బీసీలకు అన్యాయం జరిగిందని విమర్శించారు. రెండు నెలల పాటు జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. మొదటి విడతలో పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలు, మండలాల్లో పార్టీ నేతలు పర్యటనలు చేస్తారని తెలిపారు. ఆ తర్వాత రాష్ట్ర స్థాయిలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసి బీసీల కోసం ప్రత్యేక మేనిఫెస్టోను విడుదల చేస్తామని చెప్పారు.

దూదేకుల కోఆపరేటివ్ సొసైటీ ఎండీగా గౌస్ పీర్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దూదేకుల, నూర్‌బాషా ముస్లిమ్స్ కోఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ మేనేజింగ్ డైరెక్టర్(ఎండీ)గా షేక్ మహ్మద్ గౌస్ పీర్‌ను ప్రభుత్వం నియమించింది. ఇప్పటి వరకు దూదేకుల కోఆపరేటివ్ సొసైటీ ఎండీగా పనిచేసిన మహ్మద్ మస్తాన్ జనరల్ మేనేజర్(జీఎం)గా నియమితులయ్యారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్, సెక్రటరీగా డి.నిజాముద్దీన్‌ను నియమించింది. ఈ మేరకు రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఇంతియాజ్ అహ్మద్ ఉత్తర్వులు జారీ చేశారు.







* అలంకారం

వెల్‌కమ్ పార్టీ

2023 కి వీడ్కోలు, న్యూ ఇయర్‌కి వెల్‌కమ్ చెప్పడానికి బంధు మిత్రులు బృందంగా ఒక చోట చేరుతుంటారు. ఏడాది మొత్తం జ్ఞాపకంగా మిగిలిపోయే ఈ రోజును ఇంట్లో ఉల్లాసభరితంగా ఎలా మార్చుకోవచ్చో తెలుసుకుందాం. న్యూ ఇయర్ వేడుకల అలంకరణలో మెరిసే, ఆకర్షణీయమైన వెలుగులతో ఈ రోజును అలంకరించడానికి చకచకా సిద్ధం అయిపోవచ్చు.

■ బ్యానర్

ముందుగా 'హ్యాపీ న్యూ ఇయర్' అని చూపే ఒక సాధారణ బ్యానర్‌ను ఏర్పాటు చేసుకోవాలి. నలుపు, బంగారం, వెండి రంగులు ఉండే బ్యానర్‌తో ఉన్న ఈ అలంకారం అందరిలోనూ ఒక ఉత్సాహాన్ని కలిగిస్తుంది. ఈ బ్యానర్ ను మీ ఇంట్లో ఎక్కడైనా వేలాడదీయవచ్చు. దీనిని టేప్‌తో గోడలకు అతికించడం, ఆ తర్వాత తొలగించడం కూడా సులువే.

■ బెలూన్స్

నూతన సంవత్సర వేడుకల అలంకరణలో బెలూన్‌లు మరో ముఖ్యపాత్ర పోషిస్తాయి. పార్టీ మూడ్‌ను తీసుకురావడానికి ఇంట్లో బెలూన్ ఆర్చ్‌ని సృష్టించుకోవాలి. రెడీమేడ్‌గా కూడా ఈ ఆర్చ్‌లు దొరుకుతాయి. ఈ బెలూన్స్ కూడా బంగారం, తెలుపు, మెరిసే బెలూన్స్ మరింత పాజిటివ్ ఎనర్జీని కలిగిస్తాయి.



■ కొవ్వొత్తులు

స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి కూర్చున్నప్పుడు అక్కడి వాతావరణం హాయిగొలిపే అనుభూతిని ఇవ్వాలి. ఇందుకు ఫ్లేమ్‌లెస్, సెంటెడ్ క్యాండిల్స్ ఎంతగానో తోడ్పడతాయి. అందుకని, ముందుగానే వీటిని సిద్ధం చేసుకోవడం మంచిది. న్యూ ఇయర్‌లోకి అడుగిడే కొత్త సమయంలో ఈ కొవ్వొత్తుల వెలుగులు అందరిలోనూ నూతన ఉత్సాహాన్ని నింపుతాయి.



■ ఫన్ నెక్లెస్ లు

టేబుల్‌పై కొవ్వొత్తులు ఒకటే ఉంచితే సరిపోదు. ఆ టేబుల్‌పైన పరిచే రన్నర్ పై పూసల దండలను అమర్చడం, వేలాడదీయడం పండగ సంబరాన్ని తీసుకువస్తుంది. వీటిలో కూడా బంగారం, నలుపు, వెండి పూసల దండలను ఎంచుకోవడం మంచిది.



■ డిస్కో థీమ్

కొత్తసంవత్సరం అంటేనే ఒక జోష్‌తో నడవాలనుకుంటారు. న్యూ ఇయర్‌కి వెల్‌కమ్ చెప్పే సమయంలో డాన్స్ చేసే వీలుండేలా డిస్కో థీమ్‌ని అలంకరించుకోవాలి. ఇందుకు సియెర్రా వంటి కొన్ని డిస్కో బాల్స్ ఈ అలంకరణకు ఉపయోగించుకోవాలి.



■ పిల్లల కోసం ప్రత్యేకం

పార్టీలో పిల్లలు ఉంటే వారి కోసం.. వారి చేత నియాన్, పేస్టెల్ బెలూన్‌లు, రంగు రంగుల నాప్‌కిన్స్, కప్పులతో వారి పార్టీ ప్లేస్‌ను అలంకరించవచ్చు.

■ తెల్ల బంగారం

తెలుపు, బంగారు రంగులతో పార్టీ ప్లేస్‌ను మెరిసేలా అలంకరించండి. ఇందుకు షిమ్మరీ గోల్డ్ ఫ్రింజ్ కర్టెన్లను జోడించే ముందు డోర్ ఫ్రేమ్ పై భాగంలో తెల్లటి బెలూన్‌లను బ్లో అప్ చేయచ్చు.

■ స్ట్రింగ్ లైట్లు

బయటి వైపు స్ట్రింగ్ లైట్లను వేలాడదీసి, వాటిని మెరిసేలా చేయచ్చు. దీంతో బయటి వాతావరణం వెలుగులతో పండగ వాతావరణాన్ని నిండుగా కనిపించేలా చేస్తుంది.

■ పేపర్ ప్లేట్స్

రంగు రంగుల పేపర్ ప్లేట్లను వాల్ డెకార్‌గా మార్చుకోవచ్చు. గోడపైన ఉల్లాసాన్ని కలిగించే రంగులను ఆకర్షణీయంగా అలంకరించుకోవడానికి చవకైన, సరైన మార్గం అవుతుంది.

■ రంగు రంగుల టిష్యూ

కొత్త కొత్త అలంకరణతో పార్టీ ప్లేస్‌ను ఉత్తేజంగా మార్చడానికి రంగురంగుల టిష్యూ పేపర్లు కూడా వాడచ్చు. పింక్, బ్లూ, వైట్ టిష్యూ పేపర్లను తీసుకొని, వాటిని ఒక్కొక్కటీ జోడిస్తూ దండలా అల్లుకోవాలి. దీనిని పార్టీ ప్లేస్‌లో వేలాడదీయాలి.

■ టేబుల్ క్లాత్

పింక్ గ్లిటర్ టేబుల్ క్లాత్ పరిచి, దాని పైన బంగారు, స్టార్ మోటిఫ్‌లతో ఉల్లాసభరితమైన థీమ్‌ని తీసుకురావచ్చు. దీంతో డిన్నర్ చేసే టేబుల్ న్యూ ఇయర్ వేడుకలో మరింత ప్రత్యేకతను నింపుకుంటుంది.



వెల్‌కమ్ 2024

అందరం కలిసి ఆహ్వానిద్దామా!

'ఆ.. ఏం న్యూ ఇయర్ అండీ...
తిని నిద్రపోక'...
'మేం ఎక్కడికీ వెళ్లం... ఎవరినీ పిలవం..
టీవీ చూసి నిద్రపోతాం'...
అంత నిర్లిప్తత... నిరాసక్తత ఎందుకు?
న్యూ ఇయర్ అంటే
కొత్త కాలెండర్.. కొత్త సంవత్సరం..
కొత్త ఉత్సాహం... అర్ధరాత్రి పొద్దుపొడుపు....
లోలోపల నిర్లిప్తత ఉంటే
కాలం బ్రైట్‌గా ఎలా షేక్‌హ్యాండ్ ఇవ్వగలదు?
మన కోసం 2024 అనే అతిథి వస్తోంది.
నలుగురితో కలిసి హుషారుగా ఆహ్వానించండి.
కుటుంబమంతా కలిసి సెలబ్రేట్ చేయండి.
మంచి ప్రారంభం సంతోషాలకు తొలిమెట్టు.

2024 వస్తోంది.
వస్తే? మనకేం సంబంధం?

అదేంటి? 2024 ఊరికే వస్తుందా? కొత్త కాల చక్రాన్ని తీసుకుని వస్తుంది. పండుగ సెలవులు, ఇంక్రిమెంట్ సమయాలు, ప్రమోషన్ల ఆంకాక్షలు, పరీక్షల రిజల్ట్‌లు, పై తరగతుల అడ్మిషన్లు, జాబ్ ఇంటర్వ్యూలు, అమెరికా వీసాలు, పెళ్లి ముహూర్తాలు, ఎండల మామిడి పండ్లు, వానలతో పారే ఏర్లు, దసరా సంబరాలు, అభిమాన హీరోల బ్లాక్‌బస్టర్లు... ఎన్నెన్ని తెస్తుందది. ఏమో... కుదిరితే ప్రజాహితమైన మరిన్ని పాలనా విధానాలు కూడా తేవచ్చు.

ఇవన్నీ ప్రత్యక్షంగానో పరోక్షంగానో మనతో ముడిపడి ఉంటాయి. అందుకే కొత్త సంవత్సరానికి ఉత్సాహంగా ఆహ్వానం పలకాలి. హాయ్ చెప్తూ వెల్‌కమ్ చేయాలి. మాకై మంచి మంచి సంతోషాలను మోసుకురా సుమా అని ఆకాంక్షించాలి.

నలుగురు ఉంటే సరదా

వేడుక సమయాల్లో ఎప్పుడూ నలుగురు ఉంటేనే సరదా. డిసెంబర్ 31 రాత్రి అంటే మరీ ఆర్భాటం అక్కర్లేదు. నిషా ఉండాలన్న నియమం లేదు. హాయిగా కుటుంబ సమేతంగా గడిపి, విందు భోజనంతో, చక్కని పాటలు వింటూ, కబుర్లు చెప్పుకుంటూ, ఆరుబయట చలిమంట వేసుకుంటూ గడిపి కొత్త సంవత్సరాన్ని ఆహ్వానించవచ్చు. లేదా సమీపంలో ఉన్న దగ్గరి బంధువులనో, ఆప్త మిత్రులనో లిమిటెడ్‌గా పిలిచి ఎంజాయ్ చేయవచ్చు. ఇష్టమైన మనుషులు ఉంటే మానసికంగా చాలా ఉత్తేజం ఉంటుంది. మరీ ముఖ్యం... ఇవాళ చాలా మంది మిత్రుల పిల్లలు అమెరికాలో ఉంటున్నారు. భార్యాభర్తలు మాత్రమే ఇక్కడ ఉంటున్నారు. అలాంటి మిత్రుల్ని పిలిచి ఈ సంతోష సమయాలను పంచవచ్చు.

అలంకరణలూ ఆనందమే

కొత్త సంవత్సరం కొత్త కాంతులు తేవాలని అందరికీ అనిపిస్తుంది. అలాంటి సమయాల్లో ఇంటిని డల్‌గా ఉంచొద్దు. చక్కగా సర్దుకోవాలి. పాత సామాన్లు తీసి బయట పారేయాలి. వీలైతే కొత్త కర్టెన్లు, బెడ్‌షీట్లు మార్చవచ్చు. రంగు కాగితాలు, బెలూన్లు శోభను తెస్తాయి. మార్కెట్‌లో లేదా అమేజాన్‌లో తక్కువ ధరకే సీరియల్ లైట్లు దొరుకుతున్నాయి. అవి కొన్ని ఇంట్లో వెలిగిస్తే చాలా బాగుంటుంది. మంచి అగర్‌బత్తీలతో, రూమ్ స్ప్రేయర్లతో ఇంటిని పరిమళ భరితం చేసి కొత్త సంవత్సర ఆగమన ఘడియలకు సిద్ధమవ్వాలి.

మంచి విందు.. చాలా పసందు

నలుగురూ కలిసి ఇలాంటి సమయంలో ఛలోక్తులతో, చతురోక్తులతో వంట చేస్తే బాగుంటుంది. ఆడవాళ్లకు యథావిధిగా వంట భారం అప్పజెప్పకపోవడమే మంచిది. పార్టీలు గట్రా ఉంటే స్నాక్స్ బయట నుంచి తెప్పించుకున్నా మెయిన్ కోర్స్‌ను ముచ్చట కొద్దీ వండుకోవచ్చు. అదో పద్ధతి. లేదంటే మిత్రులు కొన్ని పదార్థాలు వండుకుని వస్తే, కొన్ని పదార్థాలు మనం వండవచ్చు. కష్టమూ సంతోషమూ పంచుకున్నట్టు అవుతుంది. చివరలో కేక్ ఎలాగూ కట్ చేస్తారనుకోండి.

పాటలూ ఆటలూ

దాగివున్న విద్యలు బయటపెట్టే సందర్భాలు ఇవి. ఎప్పుడో కాలేజీ రోజుల్లో పాడి ఉంటారు. ఇప్పుడు పాడండి. ఏవో ఇష్టమైన డైలాగులు అభినయించి ఉంటారు. ఇప్పుడూ చేయండి. పిల్లలతో కలిసి సరదాగా నాలుగు స్టెప్పులేయండి. ఇరుగు పొరుగుకు అభ్యంతరం లేని మోతాదులో సందడి చేయండి. వినడానికి ఘంటసాల, పి.సుశీల డ్యూయెట్లు, ఇళయరాజా తమిళ పాటలా అనే వాదనలు కూడా ఇలాంటి సమయాల్లో బాగుంటాయి.

చివరగా -

నిద్ర పోయే ముందు మనస్ఫూర్తిగా లోకంలో ప్రతి ఒక్కరూ కొత్త సంవత్సరంలో సంతోషంగా ఉండాలని కామనలు సృష్టికి తెలపండి. అలకలు, ఫిర్యాదులు ఏవైనా ప్రకృతికి ఉంటే దాని మనసు మెత్తబడేలా మన స్ఫూర్తిగా అందరి కోసం ప్రార్థన చేయండి.

ప్రకృతి వింటుంది. కాలానికి చెబుతుంది. సృష్టి శిరసావహిస్తుంది. శుభమ్.



నీనా సింగ్

చారిత్రక అడుగు

అంకితభావమే ఆభరణమై...

అల్లరికి కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న ఆ ఇల్లు నీనా రాకతో నిశ్శబ్దంలోకి వెళ్లిపోయేది.

ఆ ఇంట్లోని పిల్లలు ఎక్కడి వాళ్లు అక్కడ కూర్చుని పాఠ్యపుస్తకాలు చదువుతూ కనిపించేవారు.

పెద్ద అక్క అంటే మాటలా మరి!

అక్కయ్య అంటే ఆప్యాయత, అనురాగం మాత్రమే కాదు క్రమశిక్షణ కూడా.

ఆ క్రమశిక్షణే ఆమెను పోలీస్‌శాఖలోకి అడుగు పెట్టేలా చేసింది. వివిధ హోదాల్లో మంచి పేరు తెచ్చుకునేలా చేసింది.

తాజాగా...

సెంట్రల్ ఇండస్ట్రీయల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) తొలి మహిళా డైరెక్టర్ జనరల్‌గా చరిత్ర సృష్టించింది నీనా సింగ్...

నీనా సింగ్‌ది బిహార్ రాష్ట్రం. కుటుంబ సభ్యుల్లో తనే పెద్ద. తమ్ముళ్లు, చెల్లెళ్లకు అమ్మ తరువాత అమ్మ. నీనా తండ్రి బిహార్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్‌లో ఉండేవారు. తల్లి గృహిణి. పట్నా ఉమెన్స్ కాలేజీ, దిల్లీలోని జేఎన్‌యూలో చదివిన నీనా సింగ్ 'దిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో ఎం.ఫిల్. కోసం చేరింది.

హార్వర్డ్ యూనివర్శిటీలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో మాస్టర్స్ డిగ్రీ చేసింది.

రాజస్థాన్ క్యాడర్, 1989 బ్యాచ్ ఐపీఎస్ ఆఫీసర్ అయిన నీనా సింగ్ పోలీస్‌శాఖలో అడుగు పెట్టిన తొలిరోజు నుంచి పాదరసంలా చురుగ్గా ఉండేది. సివిల్ రైట్స్ అండ్ యాంటి-హ్యూమన్ ట్రాఫికింగ్ ఏడీజీ(ట్రైనింగ్), డీజీగా పని చేసింది. రాజస్థాన్‌లోని డీజీ ర్యాంక్ పొందిన తొలి మహిళా అధికారిగా గుర్తింపు పొందింది. రాజస్థాన్ స్టేట్ కమిషన్ ఫర్ ఉమెన్‌లో పనిచేసింది. కమీషన్ సభ్యులు వివిధ ప్రాంతాలకు వెళ్లి మహిళల సమస్యలు తెలుసుకొని పరిష్కరించేలా కార్యాచరణను రూపొందించింది. పాండమిక్ కాలంలో రాజస్థాన్‌లో ప్రిన్సిపల్ సెక్రెటరీ(హెల్త్)గా బాధ్యతలు నిర్వహించింది. జాయింట్-డైరెక్టర్ ఆఫ్ సీబీఐగా పీఎన్‌బీ స్కామ్, నీరవ్ మోదీ కేసులకు సంబంధించిన ఇన్వెస్టిగేషన్‌లలో కీలకపాత్ర పోషించింది.

నాన్న స్ఫూర్తితో...

ఇంటి వాతావరణం మన కలలకు ఊపిరిపోస్తుంది. నాన్న సివిల్ సర్వీస్‌లో ఉండడం వలన ఎన్నో విషయాలు చెప్పేవారు. ఆయన ద్వారా ఎంతోమంది ఐకానిక్ ఆఫీసర్‌ల గురించి తెలుసుకునే అవకాశం వచ్చింది. ఈ క్రమంలోనే సివిల్ సర్వీస్‌లో చేరాలనే లక్ష్యం ఏర్పడింది. కెరీర్‌కు సంబంధించి వేరే ఆలోచనలు ఏవీ ఉండేవి కాదు. నా ఏకైక లక్ష్యం సివిల్ సర్వీస్ అని గట్టిగా నిర్ణయించుకున్నాను. ఎందుకంటే సివిల్ సర్వీస్‌లో విస్తృతంగా పనిచేసే అవకాశం దొరుకుతుంది. ఖాకీ యూనిఫాం అంటే నాకు చిన్నప్పటి నుంచి ఇష్టం. ఖాకీ యూనిఫాంలోఉన్న వారిని చూస్తే అపురూపంగా అనిపించేది. యూనిఫాం ఎప్పుడూ ఇతరులను ఇన్‌స్పైర్ చేస్తూనే ఉంటుంది. దీనికి ఒక ఉదాహరణ...నేను సిరోహి ఎస్పీగా పనిచేస్తున్నప్పుడు ఒక అమ్మాయి నా దగ్గరకు వచ్చి నాకు మీలాగే పోలీస్ ఆఫీసర్ కావాలని ఉంది అన్నప్పుడు సంతోషంగా అనిపించింది. పోలీస్ ఉద్యోగం అంటే శాంతిభద్రతలను కాపాడడం మాత్రమే కాదు రకరకాల సమస్యలు ఎదుర్కొనే ప్రజలకు ధైర్యాన్నీ, భరోసానూ ఇవ్వడం కూడా.

\- నీనా సింగ్

'సివిల్ సర్వీస్‌లో ఉన్న మా నాన్నను చూస్తూ పెరిగాను. నేను ఐపీఎస్ చేయాలనుకోవడానికి నాన్న స్ఫూర్తిగా నిలిచారు. చదువుకు సంబంధించిన విషయాలపై ఆయన ప్రత్యేక దృష్టి పెట్టేవారు. మమ్మల్ని దగ్గర ఉండి చదివించేవారు. ఇంట్లో ఇతరత్రా విషయాల కంటే చదువుకు సంబంధించిన విషయాలే ఎక్కువగా మాట్లాడుకునేవాళ్లం' అంటుంది నీనా సింగ్.

తన ఉద్యోగప్రస్థానంలో మహిళా సాధికారత భావన కలిగించే ఏ అవకాశాన్నీ, సందర్భాన్నీ వదులుకోలేదు నీనా సింగ్. ఆమె మాటలతో స్ఫూర్తి పొందిన వాళ్లు ఎంతోమంది ఉన్నారు. నీనా సింగ్‌ను భారతప్రభుత్వం 2015లో 'ప్రెసిడెంట్స్ పోలీస్ మెడల్' 2020లో 'విశిష్టసేవా పురస్కారం'తో సత్కరించింది.

నోబెల్ విజేతలతో కలిసి పరిశోధన

పోలీసుల పనితీరులో రావాల్సిన మార్పులు, ప్రజలకు మరింత చేరువయ్యే మార్గాల గురించి 'మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ'కి సంబంధించిన ప్రాజెక్ట్‌లో నీనా సింగ్ భాగం అయింది. తన పరిశోధన తాలూకు అంశాల ఆధారంగా ఎన్నో పోలీస్‌స్టేషన్‌లలో మార్పు తీసుకువచ్చింది. నోబెల్ బహుమతి గ్రహీతలు అభిజిత్ బెనర్జీ, ఎస్తేర్ డఫ్లోతో కలిసి 'ది ఎఫీసియెంట్ డిప్లాయ్‌మెంట్ ఆఫ్ పోలీస్ రిసోర్సెస్' అంశంపై పరిశోధన పత్రాలు రాసింది. హార్వర్డ్‌లో చదివే రోజుల నుంచి వారితో నీనా సింగ్‌కు పరిచయం ఉంది.

● ముగ్గు - ముచ్చట

15 చుక్కలు
3 వరుసలు
3 వచ్చేవరకు



పంట యశోద
ఓబనపల్లె, రైల్వేకోడూరు,
అన్నమయ్య జిల్లా






జి. సుహాసిని
సర్కిల్‌పేట,
మచిలీపట్నం

15 చుక్కలు
15 వచ్చే వరకు







17 చుక్కలు
1 వచ్చేవరకు
వరస చుక్కలు

పి. ఉష
బెంగళూరు





ఎల్. రమాదేవి
వైరా
ఖమ్మం జిల్లా

21 చుక్కలు
11 వచ్చే వరకు
మధ్య చుక్క



ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా: ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com



ఆరోగ్య ప్రసాదాలు

ధనుర్మాసం

ధనుర్మాసంలో చేసే పూజలకు తగ్గట్టుగానే తులసీతీర్థం, చక్కెర పొంగళి, కట్టె పొంగలి, దద్దోజనం, పులిహోర తదితర పోషక విలువలుండే ప్రసాదాలను ఆరగిస్తారు. అలంకార ప్రియుడైన శ్రీమహావిష్ణువును ఆరాధించడంలో స్వామివారికి ఇష్టమైన ప్రసాదాలను అర్పించడం ఎంతటి పుణ్యఫలమో, అంతటి ఆరోగ్యబలం కూడా.

వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్దేశించి ఈ ధనుర్మాసంలో అందిస్తున్న ప్రసాదాలు ఎన్నెన్నో పోషక విలువలతో ముడిపడి ఉండటం విశేషం. తీర్థం.. ప్రసాదంగా మనం స్వామి వారికి సమర్పించి స్వీకరించే వీటిలో ప్రతి పదార్థానికి చక్కటి ఔషధగుణాలున్నాయి.



తులసి తీర్థంతో మానసిక బలం

ఆలయాల్లో దేవుడ్ని దర్శించుకున్న తర్వాత అర్చకుడు ఇచ్చే తీర్థమే తులసీ తీర్థం. దీనినే భక్తులు తొలి ప్రసాదంగా భావిస్తారు. తులసి పత్రాలు, కర్పూరం.. యాలిక బీజాలను కలిపి తీర్థంగా ఇస్తుంటారు. ఇది మానసిక ఉద్వేగాలను అదుపులో ఉంచుతుంది. దగ్గు, ఆస్థమా, చర్మవ్యాధులు తీర్థ సేవనంతో నయమవుతాయి. కడుపులో క్రిముల నివారణవుతాయి. కడుపు ఉబ్బరం తగ్గుతుంది. ముక్కు దిబ్బడ నుంచి ఉపశమనం కలుగుతుంది. మానసిక వేదన నుంచి ఉపశమనం లభిస్తుంది.

పరమాన్నం.. పరమ ఔషధం..

పాలు, బియ్యంలో బెల్లం లేదా పంచదార వేసి చేసేదే పరమాన్నం. ఇందులో బాదం పప్పు, యాలకులు, పచ్చికొబ్బరి వేస్తారు. దేహానికి బలం, చక్కని కాంతిని ఇస్తుంది. ఆలోచన శక్తిని పెంచుతుంది. వాత, పైత్యాలను తగ్గిస్తుంది.



ప్రతి 100 గ్రాముల బియ్యంలో 78 గ్రాముల కార్బోహైడ్రేట్లు, 8.5 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. 100 గ్రాముల బెల్లంలో 11.4 మిల్లీ గ్రాముల కేలరీలు, ఇనుము ఉన్నాయి దీనికి పుష్టిని ఇచ్చే గుణం ఉంది. వాత రోగాలు నివారణవుతాయి. బాదంలో బలాన్ని చేకూర్చే గుణం ఉంది. ఉత్సాహం పెరగడంతో పాటు నరాల బలహీనత, రక్తపోటు తగ్గుతుంది.

జ్వరాలు రాకుండా దద్దోజనం



తాళింపు పెట్టిన పెరుగన్నమే దద్దోజనం, ఆవు పాలను మరగకాచి చల్లార్చి తోడుపెట్టిన పెరుగులో మిరియాలు, ఇంగువ, శొంఠి మొదలైన వాటిని అన్నంలో కలుపుతారు. దానిని ఆవునెయ్యితో పోపుపెడతారు. ధనుర్మాసంలోని రెండోపక్షంలో దీనిని ప్రసాదంగా నివేదిస్తారు మంచు, చలి ఎక్కువగా ఉండే ఈ సమయంలో దద్దోజనం తీసుకోవటం వల్ల జలుబు, విష జ్వరాలు, శీతల జ్వరం రాకుండా నిరోధిస్తుంది.

అరుగుదలకు పులిహోర..



బియ్యంతో అన్నం వండిన తర్వాత దానికి పసుపు, నూనె, ఆవాలు, ఉప్పు, కరివేపాకు, శెనగపప్పు తదితరాలని కలిపి చేస్తారు. దీని వల్ల ఆహారం త్వరగా జీర్ణమవుతుంది. ఆకలి పెరుగుతుంది. కాలేయానికి మంచిది. జలుబు, తుమ్ములు, ఉబ్బసం, దగ్గు నుంచి ఉపశమనం కలుగుతుంది.

కట్టె పొంగలితో కీళ్లజబ్బులు నయం

ధనుర్మాసంలో చలి, మంచు ఎక్కువగా ఉంటాయి. కట్టెపొంగలిని తినడం వల్ల జీర్ణశక్తి మెరుగ్గా ఉంటుంది. కీళ్ల జబ్బులు తగ్గుతాయి. దగ్గు, జలుబు రాకుండా చేస్తుంది.

చక్కటి ఔషధం చక్కెర పొంగలి



బియ్యం, పెసరపప్పు సమానంగా పోసి ఆవునేతితో ఉడికించి అందులో పంచదార, ద్రాక్ష, పచ్చకర్పూరం, కుంకుమ పువ్వు, యాలకులు వంటి సుగంధ ద్రవ్యాలు వేసి చేసే చక్కెర పొంగలిని సేవించడం వల్ల దేహపుష్టి కలుగుతుంది. ఇది జ్ఞాపకశక్తిని పెంచుతుంది. శూల (నొప్పి)ని, జ్వరాన్ని హరిస్తుంది. పచ్చకర్పూరం వల్ల ఆహారం తేలిగ్గా జీర్ణమవుతుంది. కఫాన్ని, శరీరంలోని మంటల్ని నిరోధిస్తుంది.



జలుబు, దగ్గా?

చలికాలంలో వచ్చే సాధారణ సమస్యలు జలుబు, దగ్గు, గొంతు నొప్పి, బొంగురుపోవడం వంటి సమస్యలను కలిగిస్తుంది. అయితే చలికాలంలో రోజూ పండ్లు తింటే జలుబు, దగ్గు నుంచి ఉపశమనం లభిస్తుంది. అదీ పుల్లటి నారింజ పండు. నమ్మశక్యంగా లేకున్నా ఇది నిజం. అదెలాగో చూద్దామా..

అసలే చలికాలం కదా... నారింజ తింటే జలుబు వస్తుందనే భయంతో ఎక్కువ మంది తినడం లేదు. అయితే చలికాలంలో నారింజ పండ్లు తినడం చాలా మంచిదని వైద్యనిపుణులు చెబుతున్నారు. జలుబు–దగ్గు మొదలైన వాటి నుండి ఉపశమనం కలిగిస్తుంది. ముఖ్యంగా ఊపిరితిత్తులలో కఫం ఉంటే నారింజ మీకు ఔషధం.

శీతాకాలంలో నారింజ తినడం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి. నిజానికి నారింజలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. విటమిన్ సి శరీరం లోపల నుండి విషాన్ని తొలగించడంలో సహాయపడుతుంది. రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. ప్రతిరోజూ రెండు నారింజలను తింటే, మీ రోజువారీ మోతాదుకు తగ్గ విటమిన్ సి లభిస్తుంది. ఫలితంగా శరీరం లోపల బలం పెరుగుతుంది.

నారింజతో చెక్ పెట్టండి!



ఇది కాకుండా, నారింజలో యాంటీ ఆక్సిడెంట్ యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఉన్నాయి. ఇది మీ శరీరంలో మంట లేదా ఇన్ఫెక్షన్ వంటి వాటికి గొప్ప ఉపశమనాన్ని ఇస్తుంది. నారింజ పండ్లను తినడం వల్ల ముఖం, ముఖంపై ఉండే మొటిమలు మాయమవుతాయి. ఇది శరీరాన్ని ఎక్కువసేపు తేమగా ఉంచుతుంది. ముఖంపై పగుళ్ళ, పొడిబారడం వంటి సమస్యలను ఇది సరిచేస్తుంది. నారింజ పండ్లను ఉదయం ఖాళీ కడుపుతో తినకూడదు. ఇది మీ శరీరంలో ఎసిడిటీకి దారితీస్తుంది. ఇది జీర్ణవ్యవస్థను కూడా దెబ్బతీస్తుంది. పూర్తి ప్రయోజనాలు పొందాలంటే మధ్యాహ్నం పూట ఈ పండును తినడం మంచిది. అయితే మంచిది కదా అని రోజుకు రెండు పండ్ల కంటే ఎక్కువ తినకూడదు. అలా తినడం వల్ల ఇతర సమస్యలు వస్తాయి.

పాతకు పాతర... కొత్తదనానికి స్వాగతం

మరో రెండు రోజులలో పాత సంవత్సరం ముగిసి, కొత్త సంవత్సరంలోకి అడుగు పెట్టబోతున్నాం. ఈ సంవత్సరం లో మనం చేసిన మంచి ఏమిటి, ఎంతమందికి సాయం చేశాం, ఇంటిలోని వారికి, చుట్టుపక్కల వారికి మన వల్ల ఎంత సంతోషం కలిగించాం, ఆఫీసులో మన పని తీరుతో మెప్పు పొందగలిగామా..? ఇవన్నీ మంచి విషయాలయితే ఇందుకు విరుద్ధంగా జరిగినవన్నీ పాత జ్ఞాపకాలే.. అలాంటి వాటన్నింటినీ మన మెదడు నుంచి చెరిపేద్దాం. ఈ సంవత్సరం మన మాటల వల్ల, చేతల వల్ల ఇతరులకు కలిగించిన అశాంతిని, బాధను ఇంతటితో ముగించేద్దాం. మన నిర్లక్ష్యపు, నిర్లిప్తతతో కూడిన పనితీరు, మాటతీరుకు స్వస్తి చెబుదాం. కొత్త సంవత్సరంలో తీసుకోబోయే కొత్త నిర్ణయాలకు కట్టుబడి ఉందాం.

రోజుకు కనీసం ఒక్కటైనా మంచిపని చేయడం... ఇతరులకు మంచి జరిగే పని కావచ్చు, మనకు సంతోషాన్నిచ్చే పని కావచ్చు. ఇష్టమైన పాట వినడం ద్వారా మనసును ఆహ్లాదపరుచుకోవచ్చు. ఇది మానసిక సంతృప్తి మాత్రమే కాదు, దేహం పనితీరును నిర్దేశిస్తుంది. గుండె స్పందనలు లయబద్ధంగా సాగడానికి దోహదం చేస్తుంది. మరో ముఖ్యమైన విషయం మంచి వ్యక్తుల సాంగత్యం. మంచి వ్యక్తిని గుర్తించడం ఎలా అనేదే పెద్ద సమస్య. మంచిచెడుల విశ్లేషణ విషయంలో ఎవరి విచక్షణ వారిదే. ఆ రోజు గడిపిన సమయంలో చర్చకు వచ్చిన అంశాల ఆధారంగా మన క్వాలిటీ టైమ్‌ను అంచనా వేసుకోవచ్చు. ఎంత సమయం నిరుపయోగంగా గడిచింది, ఎంత సమయం ఉపయుక్తంగా గడిచింది అనే స్వీయలోచన చేసుకోవడం ఆరోగ్యకరమైన జీవితానికి మరొక సోపానం. అలాగే... కొత్తగా పరిచయం అయిన వారిని అనుమానించడానికి ముందు అభిమానించడం అలవాటు చేసుకోవాలి. మంచి ఆహారం, మంచి నిద్ర, చక్కటి వ్యాయామం, మంచి మనుషుల సాంగత్యం, మంచి పని చేయడం, మంచిని పంచడం, న్యూస్ ఓవర్ డోస్‌కు దూరంగా ఉండడం. .. ఈ ఏడు నియమాలు గుండెను హాయిగా పనిచేసుకోనిస్తాయి.



రోజూ రాత్రి నిద్రకు ఉపక్రమించే ముందు ఒక డైరీలో లేదా కాగితం మీద ఆ రోజు మనకు ఎదురైన మంచి అనుభవాలు, మనం చేసిన మంచి పనులు, సంతోషాన్నిచ్చిన విషయాలు రాసుకోవాలి. అలాగే బాధ కలిగించిన విషయాలను ఒక కేటగిరీలో, ఒత్తిడి, చికాకు కలిగించిన వాటిని ఒక కేటగిరీలో, వాటికి పరిష్కారాలను మరో కాలమ్ లోనూ రాసుకోవాలి. వాటన్నింటినీ ఒకసారి చూసుకుని రేపటి రోజున చేయాల్సిన పనులను నోట్ చేసుకోవాలి. సింపుల్‌గా చెప్పాలంటే... డైరీ రాసుకున్నట్లేనన్న మాట. ఇలా రాయడం వల్ల మెదడు తేలికపడుతుంది. స్మార్ట్ ఫోన్‌లో వచ్చి పడిన మంచి–చెడు, అవసరం ఉన్న– అవసరం లేని మెసేజ్‌లు, వీడియోలు, ఫొటోలను వర్గీకరించుకుని డిలీట్ చేస్తూ ఫోన్ మెమరీ బరువు తగ్గించుకున్నట్లే ఇది కూడా. దీనిని కేవలం రోజుకే పరిమితం చేసుకోకుండా ఈ సంవత్సరం జరిగిన అన్ని సంఘటనలకూ, అన్నిరోజులకూ విస్తరించుకుంటే మంచిది.

హెల్త్ టిప్స్



- గోరింటాకు, జుత్తుకు సహజసిద్ధమైన రంగు గానే కాకుండా, ఫంగల్ ఇన్‌ఫెక్షన్ నివారణలోనూ బాగా తోడ్పడుతుంది. వెంట్రుక కుదుళ్లను పటిష్ఠం చేయడం ద్వారా ఇది చుండ్రును, జుత్తు రాలడాన్ని నివారిస్తుంది.



- గొంతులో మంట, ఆస్తమా. జ్వరం వంటి సమస్యలకు సబ్జా గింజలు నీటిలో నానబెట్టి తీసుకుంటే విముక్తి.
- అదేవిధంగా బీపీ అదుపులో ఉండాలన్నా సబ్జా గింజలు తీసుకుంటే మంచిది. వీటిలో ఒమెగా -3 ఫ్యాటీ యాసిడ్లు సాల్మన్ చేపల్లో కంటే ఎక్కువగా లభిస్తాయి. ఈ ఆమ్లాలు ఎక్కువగా తీసుకోవడం వలన హృదయ సంబంధిత సమస్యలు రాకుండా ఉంటాయి.



- వేపాకు యాంటీ సెప్టిక్‌గానూ, ఇన్‌సెక్టిసైడ్‌గానూ పని చేస్తుంది. వేపాకు పొడిని నీళ్లల్లో కలిపి చల్లితే ఎన్నోరకాల క్రిమి కీటకాలు ఇంటికి దూరంగా వెళ్లిపోతాయి. వేపాకుల్ని నీటిలో వేసి మరిగించి స్ప్రే చేస్తే దోమల బెడద తప్పుతుంది. వేపాకు పొడిని పేస్ట్‌గా చేసి వాడితే పలు రకాల చర్మ సమస్యలు, మొటిమలు, ఎగ్జిమాల బాధలు తప్పుతాయి.
- కలబంద గుజ్జు ఒక సహజసిద్ధమైన కండీషనర్. మాయిశ్చరైజర్ కూడా. ఈ గుజ్జును చర్మం మీద, మాడు మీద రుద్దితే, చర్మ వ్యాధులు, చుండ్రు సమస్యలు చాలా వరకు తగ్గుతాయి. ఈ గుజ్జుతో కాలిన గాయాలు కూడా త్వరగా మానిపోతాయి.



సినిమా



'కల్కి'లో ప్రభాస్

సంక్రాంతికి డబుల్ ధమాకా

ప్రభాస్ అభిమానులకు శుభవార్త. ఈ సంక్రాంతికి తన ఫ్యాన్స్‌కు డబుల్ ధమాకా ఇవ్వనున్నారాయన. మారుతి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రాన్ని టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. కాగా ఈ మూవీ టైటిల్, ఫస్ట్ లుక్‌ను సంక్రాంతి పండగ సందర్భంగా రిలీజ్ చేయనున్నట్లు శుక్రవారం ప్రకటించారు. ''డైనోసార్ డార్లింగ్‌గా ఎలా మారాడో తెలుసుకునేందుకు రెడీగా ఉండండి. సంక్రాంతి రోజున ఫస్ట్ లుక్, టైటిల్ అనౌన్స్ చేస్తున్నాం'' అంటూ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ 'ఎక్స్'లో షేర్ చేసింది. ''రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రమిది. ఈ సినిమాలో ప్రభాస్ ఒక కొత్త లుక్‌లో, క్యారెక్టర్‌లో కనిపిస్తారు. ప్రభాస్ ఫ్యాన్స్‌కు ఒక స్పెషల్ మూవీ ఇవ్వాలనే ఆశయంతో మారుతి ఈ సినిమా చేస్తున్నారు'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సహనిర్మాత: వివేక్ కూఛిబొట్ల.

కల్కి కోసం కొత్త ప్రపంచం

''ఇండియాలో సైన్స్ ఫిక్షన్ చిత్రాలు ఎక్కువ రాలేదు. 'కల్కి 2898 ఏడీ' వైవిధ్యమైన సినిమా. ఒక ప్రత్యేక ప్రపంచంలో జరిగే కథ. హాలీవుడ్ ఫ్యూచరిస్ట్ సినిమాల్లో అక్కడి సిటీలు భవిష్యత్‌లో ఎలా ఉంటాయో చూశాం. ఇండియా ఫ్యూచర్ సిటీలు ఎలా ఉంటాయో 'కల్కి 2898 ఏడీ'లో చూస్తారు. ఈ సినిమా కోసం కొత్త ప్రపంచం సృష్టించాం'' అన్నారు నాగ్ అశ్విన్. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'కల్కి 2898 ఏడీ'. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్, దిశా పటానీ ఇతర కీలక పాత్రల్లో సి. అశ్వినీదత్ నిర్మిస్తున్నారు. కాగా ఐఐటీ బాంబేలో జరిగిన ఓ కార్యక్రమంలో 'కల్కి 2898 ఏడీ' ప్రత్యేక కంటెంట్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా నాగ్ అశ్విన్ మాట్లాడుతూ– ''కల్కి'లో ప్రభాస్, అమితాబ్, కమల్‌హాసన్, దీపికాగార్లు తమ అభిమానులు అమితంగా ఆనందపడే పాత్రల్లో కనిపిస్తారు. ప్రత్యేకించి ఈ మూవీలో ఫ్యూచర్ ప్రభాస్‌ని చూస్తారు. త్వరలోనే ఈ సినిమా రిలీజ్ డేట్ ప్రకటిస్తాం'' అన్నారు.



మహేశ్‌బాబు

శ్రీలీల

ఆ కుర్చీని మడతపెట్టి...

మహేశ్‌బాబు హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం 'గుంటూరు కారం'. శ్రీలీల కథానాయికగా నటించిన ఈ చిత్రంలో మీనాక్షీ చౌదరి, ప్రకాశ్‌రాజ్, రమ్యకృష్ణ కీలక పాత్రలు పోషించారు. సూర్యదేవర రాధాకృష్ణ నిర్మించిన ఈ చిత్రం జనవరి 12న విడుదల కానుంది. తాజాగా ఈ సినిమాలోని 'ఆ కుర్చీని మడతపెట్టి..' అనే పాట ప్రోమోను విడుదల చేశారు మేకర్స్. కాగా ఈ పాట పూర్తి లిరికల్ వీడియో నేటి సాయంత్రం విడుదలవుతోంది. ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. ఈ చిత్రానికి తమన్ స్వరకర్త.

నువ్వు నా వరమే..



బేబీ సారా, శ్రద్ధా శ్రీనాథ్, వెంకటేశ్

'బంగారమే బంగారమే నువ్వు నా వరమే.. నీ క్షేమమే నీ సంతోషమే నన్ను నడిపించే బలమే...' అంటూ మొదలవుతుంది 'సైంధవ్' సినిమాలోని 'బుజ్జి కొండవే..' పాట. వెంకటేశ్ హీరోగా నటించిన 75వ సినిమా ఇది. శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, ఆండ్రియా జెర్మియా, బేబీ సారా, బాలీవుడ్ నటుడు నవాజుద్దీన్ సిద్ధిఖీ, తమిళ నటుడు ఆర్య కీలక పాత్రలు పోషించారు. శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకట్ బోయనపల్లి నిర్మించిన ఈ ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం జనవరి 13న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలో 'నా ఆయువంతా అందిపుచ్చుకుని నువ్వు చిందులాడవే... బుజ్జికొండవే...' అంటూ సాంగే 'బుజ్జి కొండవే..' పాట లిరికల్ వీడియోను శుక్రవారం విడుదల చేశారు. సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్ స్వరపరచిన ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా, ఎస్పీ చరణ్ ఆలపించారు. ''తండ్రీ కూతుళ్ల అనుబంధం, వారి ఎమోషన్ ఈ చిత్రంలోని ప్రధానాంశం. ఈ సినిమాలో వెంకటేశ్ కూతురికి ఆరోగ్య సమస్య ఉంటుంది. తన కూతురిని భావోద్వేగానికి గురి చేయకుండా, తన ఎమోషన్స్‌ని దాచిపెడతాడు. పాపకు తల్లి కాకపోయినా సొంత కూతురిలా చూసుకుంటుంటుంది శ్రద్ధా శ్రీనాథ్'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సహ నిర్మాత: కిశోర్ తాళ్లూరు.



సాయి పల్లవి

రాజు మనసులో సత్య

గోకర్ణలో రాజును కలిసింది సత్య. హీరో నాగచైతన్య, దర్శకుడు చందు మొండేటి దర్శకత్వంలో రూపొందుతున్న వినూత్న ప్రేమకథా చిత్రం 'తండేల్'. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు నిర్మిస్తున్నారు. వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమాలో రాజు పాత్రలో నాగచైతన్య, సత్య పాత్రలో సాయిపల్లవి నటిస్తున్నారు. కాగా ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఇటీవల ఉడిపిలో ప్రారంభమైంది. తాజాగా గోకర్ణలో ఈ సినిమా చిత్రీకరణ కొనసాగుతోంది. ఈ లొకేషన్‌లో నాగచైతన్య, సాయి పల్లవి కాంబినేషన్‌లోని సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ''రాజు అనే జాలరి మనసును గెలుచుకునే పల్లెటూరి అమ్మాయి సత్య పాత్రలో సాయిపల్లవి నటిస్తున్నారు'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

నటుడిగా అలరించి హీరో అవుతాను

\- ఆకాశ్



''నేను హీరో కావాలనుకుంటే కాలేను. ఓ మంచి నటుడిగా ప్రేక్షకులను అలరిస్తే, వారి నమ్మకాన్ని గెల్చుకుంటే అప్పుడు హీరో అవుతాను. మా అమ్మగారు (సునీత) స్టార్ సింగర్. ఆమె స్థాయిని ఇండస్ట్రీలో కొనసాగించాలనే విషయాన్ని నేను ఒత్తిడిగా ఫీల్ కావడం లేదు. నన్ను నిరూపించుకునేందుకు ఓ అవకాశంగా, ఓ బాధ్యతగా అనుకుంటున్నాను. ఇండస్ట్రీలో నా గురించి స్టార్ కిడ్ అనే మాట వినిపించినప్పటికీ నా నటనా నైపుణ్యాన్ని నిరూపించుకుని, సక్సెస్ కావాల్సిన బాధ్యత నాపైనే ఉంటుంది'' అని ఆకాశ్ అన్నారు. ఆకాశ్, భావన జంటగా గంగనమోని శేఖర్ దర్శకత్వంలో రూపొందిన పీరియాడికల్ ఫిల్మ్ 'సర్కారు నౌకరి'. దర్శకుడు కె. రాఘవేంద్రరావు నిర్మించిన ఈ చిత్రం జనవరి 1న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం విలేకర్ల సమావేశంలో ఆకాశ్ మాట్లాడుతూ– ''ఈ సినిమా 1990 నేపథ్యంలో సాగుతుంది. ఆ సమయంలో దేశంలో ఎయిడ్స్ అనే ఓ మహమ్మారి వచ్చింది. ముఖ్యంగా గ్రామాలు చాలా ప్రభావితం అయ్యాయి. ఈ వ్యాధి నివారణ, చికిత్సల గురించి ప్రజల్లో అవగాహన కల్పించే ప్రయత్నం చేశారు ప్రభుత్వోద్యోగులు. అలా ఓ గ్రామంలో వారు చేసిన ప్రయత్నాలను ఓ వ్యక్తి చేసినట్లుగా, వన్ మ్యాన్ షోలా ఈ సినిమాను తీశాం. గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించే క్రమంలో ఓ ప్రభుత్వోద్యోగి ఎలాంటి సంఘర్షణ ఎదుర్కొన్నాడు? తన లక్ష్యాన్ని ఎలా చేరుకున్నాడు? అనేది 'సర్కారు నౌకరి' సినిమా కథాంశం. వాస్తవ ఘటనల ఆధారంగా తీసిన ఈ సినిమాలో అన్ని రకాల ఎమోషన్స్ ఉన్నాయి. వినోదంతో పాటు ఓ చిన్నపాటి సందేశం కూడా ఉంది. నేను గిటారిస్ట్‌ని కూడా. భవిష్యత్‌లో మ్యూజిక్ సిట్టింగ్స్‌లో పాల్గొని, సినిమా పాటలను ఎలా కంపోజ్ చేస్తారనే విషయాలపై అవగాహన తెచ్చుకోవాలని ఉంది'' అని చెప్పుకొచ్చారు.

రీల్స్

ఒకే ఒక పాత్రతో...



హన్సిక

హన్సిక లీడ్ రోల్‌లో నటించిన చిత్రం '105 మినిట్స్'. రాజు దుస్సా దర్శకత్వంలో బొమ్మ కె. శివ నిర్మించారు. మాంక్–పనోరమ స్టూడియోస్ సంయుక్తంగా పంపిణీ చేస్తున్న ఈ సినిమా జనవరి 26న విడుదల కానుంది. ఈ చిత్రం మోషన్ పోస్టర్‌ని దర్శకుడు అజయ్ భూపతి విడుదల చేశారు. రాజు దుస్సా, కె. శివ మాట్లాడుతూ– ''సింగిల్ షాట్ సింగిల్ క్యారెక్టర్ మూవీగా '105 మినిట్స్' సినిమా వస్తోంది. ఇంతకు ముందెన్నడూ కనిపించని పాత్రలో చాలా కొత్తగా కనిపిస్తారు హన్సిక'' అన్నారు.

అరెరె... అరెరె



వేణుగోపాల్, తమన్, ధ్రువన్

'ఎగిరెనే ఎగిరెనే అటు ఇటు మనసే..' అంటూ మొదలవుతుంది 'రోటీ కపడా రొమాన్స్' చిత్రంలోని 'అరెరె అరెరె..' పాట. హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువ్వేక్ష, మేఘా లేఖ, ఖుష్బూ చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం ఇది. విక్రమ్ రెడ్డి దర్శకత్వంలో బెక్కెం వేణుగోపాల్, సృజన్ కుమార్ నిర్మిస్తున్నారు. కాగా 'అరెరె అరెరె..' పాట లిరికల్ వీడియోను సంగీతదర్శకుడు తమన్ విడుదల చేశారు. ఆర్.ఆర్. ధ్రువన్ స్వరపరచిన ఈ పాటను రఘురామ్ రాయగా, కపిల్ కపిలన్ పాడారు. ''అరెరె అరెరె...' పాటలో పాజిటివ్ వైబ్స్ ఉన్నాయి. ధ్రువన్ మల్టీ టాలెంటెడ్. తను పాటల రచయితగా, సింగర్‌గా నాకు తెలుసు. ఈ చిత్రంతో అతను సంగీతదర్శకుడిగా మారడాన్ని నమ్మలేకపోతున్నాను'' అన్నారు తమన్. ''నలుగురి స్నేహితుల కథే ఈ చిత్రం'' అన్నారు విక్రమ్‌రెడ్డి. ఈ చిత్రానికి సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, ఆర్ఆర్ ధ్రువన్, వసంత్. జి.

సస్పెన్స్.. థ్రిల్



కౌశల్, లీషా

కౌశల్ మందా, లీషా ఎక్లైర్స్ జంటగా నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ 'రైట్'. మలయాళ మూవీ 'మెమోరీస్'కు ఈ చిత్రం తెలుగు రీమేక్. శంకర్ దర్శకత్వంలో లుకలాపు మధు, మహంకాళి దివాకర్ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సినిమా విలేకర్ల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మంచు మనోజ్ మాట్లాడుతూ– ''సినీ పరిశ్రమలో ఒడిదుడుకులను దాటుకుని నిలబడినవారే విజేతలవుతారు. అందుకో నిదర్శనం కౌశల్. 'రైట్' ట్రైలర్ బాగుంది. ఈ సినిమా హిట్టవ్వాలి'' అన్నారు. ''థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో సాగే 'రైట్' వినూత్న సినిమా చూసిన అనుభూతిని ప్రేక్షకులకు కలిగిస్తుంది'' అన్నారు నిర్మాతలు.

పద్నాలుగు రోజుల ప్రేమ



మనోజ్, చాందిని

మనోజ్ పుట్టూర్, చాందినీ భాగవని జంటగా నాగరాజు బోడెం దర్శకత్వం వహించిన చిత్రం '14 డేస్ లవ్'. అఖిల్ అండ్ నిఖిల్ సమర్పణలో హరిబాబు దాసరి నిర్మించిన ఈ సినిమా జనవరి 5న విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శక–నిర్మాతలు మాట్లాడుతూ– ''యూత్‌ఫుల్ లవ్ నేపథ్యంలో కుటుంబ కథా చిత్రంగా '14 డేస్ లవ్' రూపొందింది. కుటుంబ విలువల్ని కాపాడే ప్రయత్నంలో ఇంటి వారసులు ఎదుర్కొన్న సమస్యలు ఏంటి? వారి మధ్య చిగురించిన ప్రేమకు ఎలాంటి ముగింపు దొరికింది? అనే కోణంలో ఈ చిత్రం ఆసక్తిగా సాగుతుంది'' అన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	170	72,240
నిఫ్టీ ▽	47	21,731

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	14,990	▽ 105
డోజోన్స్	37,589	▽ 101
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,733	△ 10
డాక్స్	16,752	△ 50
షాంఘై	2,975	△ 20
నికాయ్	33,641	▽ 75

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	63,631	△ 179
బంగారం (99.5 స్వచ్ఛత)	63,375	△ 177
వెండి (కేజీ)	75,198	△ 565

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		82.68	83.92
£	బ్రిటన్ పౌండ్		105.43	107.96
€	యూరో		90.99	93.99
¥	జపాన్ ఎన్ (100)		57.65	59.05
AUS$	ఆస్ట్రేలియా డాలర్		56.01	58.37
S$	సింగపూర్ డాలర్		61.69	63.49
SAR	సౌదీ రియాల్		21.23	22.81
UAE D	యూఏఈ దిర్హామ్		21.69	23.55
¥	చైనా యువాన్		10.57	12.56

నవంబర్‌లో 'మౌలికం' పురోగతి 7.8 %



న్యూఢిల్లీ: ఎనిమిది పరిశ్రమల మౌలిక రంగం గ్రూప్ నవంబర్‌లో 7.8 శాతం పురోగతి సాధించింది. అధికారిక గణాంకాల ప్రకారం క్రూడ్ ఆయిల్, సిమెంట్ రంగాలు మినహా మిగిలిన అన్ని రంగాలు మంచి పనితీరును కనబరిచాయి. బొగ్గు, సహజ వాయువు, రిఫైనరీ ప్రొడక్టులు, ఎరువులు, స్టీల్, ఎలక్ట్రిసిటీ రంగాలూ ఈ గ్రూప్‌లో భాగంగా ఉన్నాయి. ఇక 2023–24 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి నవంబర్ ఎనిమిది నెలల కాలంలో ఎనిమిది రంగాల పురోగతి 8.6 శాతం. గత ఏడాది ఇదే కాలంలో ఈ రేటు 8.1%. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తిలో ఈ గ్రూప్ వాటా దాదాపు 42 శాతం.

భారత్ ఎకానమీకి ఢోకాలేదు: అనంత నాగేశ్వరన్



ముంబై: అంతర్జాతీయ కారణాలతో చమురు ధరల్లో పెరుగుదలసహా ప్రపంచ ఆర్థిక మందగమనం, భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలు వచ్చే ఆర్థిక సంవత్సరం (2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి) భారత్ ఎకానమీపై ప్రభావం చూపుతాయని తాను భావించడం లేదని చీఫ్ ఎకనమిక్ అడ్వైజర్ వీ అనంత నాగేశ్వరన్ పేర్కొన్నారు. ఆర్‌బీఐ అంచనాల ప్రకారం, 7 శాతం వృద్ధి ఖాయమని అభిప్రాయపడ్డారు. ఎస్‌బీఐ నిర్వహించిన ఒక ఎకనమిక్ కన్‌క్లేవ్‌లో ఆయన ప్రసంగిస్తూ, ప్రపంచ వ్యాప్తంగా వడ్డీరేట్ల తగ్గుదలకు ముందు ఆర్థిక క్రియాశీలత నెమ్మదిస్తుందన్నది తన అభిప్రాయమని అన్నారు.

సుకన్య సమృద్ధి పథకంలో మరింత రాబడి



8 నుంచి 8.2 శాతానికి పెంపు ● మూడేళ్ల టైమ్ డిపాజిట్‌లోనూ పెరుగుదల

న్యూఢిల్లీ: కుమార్తెల భవిష్యత్ అవసరాలకు పొదుపు చేసుకునే 'సుకన్య సమృద్ధి యోజన' పథకం వడ్డీ రేటును కేంద్ర ప్రభుత్వం సవరించింది. ఇప్పటి వరకు ఈ పథకంలోని పొదుపు సొమ్ముపై 8 శాతం వడ్డీ రేటు అమల్లో ఉంటే, దీన్ని 8.2 శాతానికి పెంచింది. అలాగే, మూడేళ్ల టైమ్ డిపాజిట్‌పై 0.10 శాతం వడ్డీ రేటును పెంచింది. దీంతో ఈ పథకంలో రేటు 7 శాతం నుంచి 7.1 శాతానికి చేరింది. 2024 జనవరి 1 నుంచి మార్చి 31 కాలానికి చిన్న మొత్తాల పొదుపు పథకాల రేట్లను కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటించింది. మిగిలిన అన్ని పథకాలకు సంబంధించి ప్రస్తుతమున్న రేట్లనే కొనసాగించింది. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) రేటు 7.1 శాతంగా, సేవింగ్స్ డిపాజిట్ రేటు 4 శాతంగా కొనసాగుతాయి. కిసాన్ వికాస్ పత్ర పథకం రేటు 7.5 శాతంగా ఉంటుంది. ఇందులో డిపాజిట్ 115 నెలల్లో రెట్టింపు అవుతుంది. నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్ఎస్‌సీ) రేటు 7.7 శాతంలో ఎలాంటి మార్పు లేదు. పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్ రేటు 7.4 శాతంగా కొనసాగనుంది. ప్రతి మూడు నెలలకోమారు చిన్న మొత్తాల పొదుపు పథకాలను సమీక్షించి, కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటిస్తుంటుంది. ఆర్‌బీఐ కీలక రెపో రేటును ఏడాది కాలంలో 2.5% మేర పెంచి 6.5 శాతానికి చేర్చడం తెలిసిందే. కొన్ని విడతలుగా రేట్లను ఆర్‌బీఐ యథాతథంగా కొనసాగిస్తోంది. దీంతో చిన్న మొత్తాల పొదుపు పథకాల రేట్లలోనూ పెద్దగా మార్పులు ఉండడం లేదు.

పథకం	ప్రస్తుత రేటు	ఇకపై 3 నెలల్లో రేటు %
సేవింగ్స్ డిపాజిట్	4	4
ఏడాది టైమ్ డిపాజిట్	6.9	6.9
రెండేళ్ల టైమ్ డిపాజిట్	7	7
మూడేళ్ల టైమ్ డిపాజిట్	7	7.1
ఐదేళ్ల టైమ్ డిపాజిట్	7.5	7.5
ఐదేళ్ల రికరింగ్ డిపాజిట్	6.7	6.7
సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్	8.2	8.2
మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్	7.4	7.4
నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్	7.7	7.7
పీపీఎఫ్	7.1	7.1
కిసాన్ వికాస్ పత్ర	7.5	7.5
సుకన్య సమృద్ధి యోజన	8	8.2

పెరిగిన బీఓబీ డిపాజిట్ రేట్లు



1.25 % వరకూ పెంపు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) స్థిర డిపాజిట్లపై వడ్డీరేట్లను 125 బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు ఒక శాతం) పెంచింది. బ్యాంకింగ్ దిగ్గజం- ఎస్‌బీఐ ఇటీవలే అర శాతం వడ్డీరేటు పెంచిన నేపథ్యంలోనే బీఓబీ తాజా నిర్ణయం తీసుకుంది. 1.25 శాతం వరకూ పెరిగిన వడ్డీరేటు డిసెంబర్ 29వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని బ్యాంక్ ప్రకటన పేర్కొంది. రుణ రేటు పెరుగుదల, నిధుల సమీకరణ అవసరాల నేపథ్యంలో కొన్ని బ్యాంకులు డిపాజిట్ రేటు పెంపు నిర్ణయాలు తీసుకుంటున్నాయి. మరికొన్ని బ్యాంకులు ఇదే బాటలో పయనించే అవకాశం ఉంది. తాజాగా బీఓబీ ఏడాది లోపు స్వల్పకాలిక కాలపరిమితులపై డిపాజిట్ రేట్ల పెంపుపై ప్రధానంగా బ్యాంక్ దృష్టి సారించింది. బీఓబీ తాజా నిర్ణయం ప్రకారం...

- రూ.2 కోట్ల వరకూ వివిధ టర్మ్ డిపాజిట్లపై వడ్డీరేటు 10 బేసిస్ పాయింట్ల నుంచి 125 బేసిస్ పాయింట్ల వరకూ పెరిగింది.
- 7 నుంచి 14 రోజుల డిపాజిట్ రేట్లు అత్యధికంగా 3 శాతం నుంచి 1.25 % పెరిగి 4.25 శాతానికి చేరింది.
- 15 నుంచి 45 రోజుల డిపాజిట్ రేటు 1 శాతం పెరిగి 4.50 శాతానికి చేరింది.



భీమా జ్యువెల్స్ అంబాసిడర్‌గా శోభిత ధూళిపాళ



హైదరాబాద్: జ్యువెలరీ సంస్థ భీమా జ్యువెల్స్ ప్రముఖ నటి శోభిత ధూళిపాళను తమ సంస్థ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకుంది. ఈ సందర్భంగా ఆమె నటించిన 'మేడ్ టు సెలబ్రేట్ యు' టీవీ వాణిజ్య ప్రకటన విడుదల చేశారు. ''మా బ్రాండ్ ప్రచారానికి శోభితను ఎంపిక చేసుకోవడం సంతోషంగా ఉంది. భీమా బ్రాండ్‌కు ఆమె మరింత గుర్తింపు తీసుకొస్తుంది'' అని సంస్థ ఎండీ అభిషేక్ బిందుమాధవ్ అన్నారు. అత్యంత విశ్వసనీయ బ్రాండ్లలో ఒకటైన భీమా జ్యువెల్స్‌కు ప్రచారకర్తగా వ్యవహరించడం సంతోషం కలిగిస్తుందని శోభిత అన్నారు.

పొదుపరుల నుంచి మదుపరులుగా భారతీయులు

ఫండ్స్, ఈక్విటీల్లో ఇన్వెస్ట్‌మెంట్స్ ● ప్రముఖ బ్యాంకర్ ఉదయ్ కోటక్



న్యూఢిల్లీ: పొదుపరుల నుంచి మదుపుదారుల దేశంగా భారత్ రూపాంతరం చెందిందని ప్రముఖ బ్యాంకరు, కోటక్ మహీంద్రా బ్యాంక్ మాజీ ఎండీ ఉదయ్ కోటక్ తెలిపారు. నేడు చాలా మంది తమ మిగులు నిధులను మ్యూచువల్ ఫండ్స్, ఈక్విటీ మార్కెట్లలో ఇన్వెస్ట్ చేస్తున్నారని మైక్రోబ్లాగింగ్ సైట్ ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేశారు. 1980ల తొలినాళ్లలో బంగారం, స్థలంతో పోలిస్తే ఆర్థిక అసెట్స్‌పై భరోసా తక్కువగా ఉండేదని ఆయన చెప్పారు. ఆ తర్వాత నెమ్మదిగా ప్రజలు కొంత భాగాన్ని బ్యాంకు డిపాజిట్లు, ఎల్ఐసీ, యూటీఐ వంటి వాటిల్లోకి మళ్లించడం మొదలుపెట్టారని పేర్కొన్నారు. '90లలో కూడా ఈక్విటీల్లో పెట్టుబడులంటే 'స్పెక్యులేటివ్'గానే చూసేవారు. దీంతో మన కంపెనీలు నిధుల కోసం విదేశీ ఇన్వెస్టర్లను (ఎఫ్ఐఐ) ఆశ్రయించాల్సి వచ్చేంది. వాటి సామర్థ్యాలను గుర్తించిన ఎఫ్ఐఐలు ఇన్వెస్ట్ చేశారు కానీ దేశీ పొదుపరులు మాత్రం దూరంగానే ఉండేవారు' అని తెలిపారు. 'మాలో కొందరు ఇలాంటి ధోరణులను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ దృష్టికి తీసుకెళ్లాం. ఇది 2000 తొలినాళ్లలో ప్రైవేట్ ప్లేస్‌మెంట్ మార్కెట్ (క్యూఐపీ) ప్రారంభానికి దారితీసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

30-12-2023	
విశాఖ	625–00
చిత్తూరు	623–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	575–00
విజయవాడ	575–00
రిటైల్ ధర (డజను)	72.00
29-12-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	570–00
వరంగల్	572–00
రిటైల్ ధర	6.30

సెకండరీ మార్కెట్ కోసం యూపీఐ

సెకండరీ మార్కెట్‌లో లావాదేవీల కోసం కూడా యూపీఐ సదుపాయాన్ని వచ్చే వారం అందుబాటులోకి తేనున్నట్లు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) తెలిపింది.

లాభాల్లో ఇన్నోవా క్యాప్‌టాబ్

ఇన్నోవా క్యాప్‌టాబ్ లిస్టింగ్ రోజు ఇన్వెస్టర్లను మెప్పించింది. ఇష్యూ ధర రూ. 448తో పోలిస్తే బీఎస్ఈలో 2 శాతం లాభంతో రూ. 456 వద్ద ట్రేడింగ్ ప్రారంభమైంది. తదుపరి ఒక దశలో 22 శాతం (రూ. 99)పైగా జంప్‌చేసి రూ. 547ను అధిగమించింది. చివరికి రూ. 97 లాభపడి రూ. 545 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలోనూ రూ. 452 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్ ముగిసేసరికి 21 శాతం ఎగసి రూ. 543 సమీపంలో నిలిచింది.

లాభాల స్వీకరణతో 2023కు వీడ్కోలు

2023 ఏడాదిని స్టాక్ మార్కెట్ నష్టాలతో ముగించింది. సూచీలు అయిదు రోజుల వరుస ర్యాలీ నేపథ్యంలో ఇంధన, బ్యాంకింగ్, ఐటీ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. సెన్సెక్స్ 170 పాయింట్లు నష్టపోయి 72,240 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 47 పాయింట్లు పతనమై 21,731 వద్ద నిలిచింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందాయి. ఒక దశలో సెన్సెక్స్ 328 పాయింట్లు క్షీణించి 72,083 వద్ద, నిఫ్టీ 102 పాయింట్లు నష్టపోయి 21,677 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. నష్టాల మార్కెట్లోనూ టెలికం, ఆటో, సర్వీసెస్, ఎఫ్ఎంసీజీ, కన్జూమర్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. టాటా మోటార్స్ షేరు మూడున్నర శాతం లాభపడి రూ.781 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఆరున్నర శాతం పెరిగి రూ.803 ఏడాది గరిష్టాన్ని తాకింది. ఈ ఏడాది నిఫ్టీ- 50 షేర్లలో రెట్టింపు లాభాలు(111%) పంచిన షేరు ఇదే.

2023లో 58 కంపెనీలు ఐపీఓ ద్వారా రూ.54,000 కోట్లు సమీకరించాయి. లిస్టింగ్ నాటి నుంచి ఇరెడా(220%), సైయంట్ డీఎల్ఎం(154%), నెట్‌వెబ్ టెక్నాలజీ(137%), టాటా టెక్నాలజీ(136%), విష్ణు ప్రకాశ్ ఆర్(118%) అత్యధిక లాభాలు పంచాయి.

రూ. 82,00,000 కోట్ల సంపద సృష్టి



ఈ ఏడాది సెన్సెక్స్ 19% ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలోని కంపెనీల మార్కెట్ విలువ 2022 డిసెంబర్ ఆఖరుకు రూ.282.38 లక్షల కోట్లు ఉండగా.., ఈ ఏడాది చివరి ట్రేడింగ్ నాటికి రూ.82 లక్షల కోట్లు పెరిగి రూ.364.05 లక్షల కోట్లకు చేరింది. విలువ పరంగా 4 ట్రిలియన్ల మార్కెట్ క్యాప్‌తో ప్రపంచలోనే అతిపెద్ద నాలుగవ నాలుగవ ఈక్విటీ మార్కెట్‌గా దలాల్ స్ట్రీట్ అవతరించింది.

2023లో మార్కెట్ పరుగిలా..

సెన్సెక్స్	60,841 (డిసెంబర్ 30, 2022)
	72,240 (డిసెంబర్ 29, 2023)
వృద్ధి	11,339 పాయింట్లు (19%)
జీవితకాల గరిష్టం 72,484 (డిసెంబర్ 28)	
నిఫ్టీ	18,191 (డిసెంబర్ 30, 2022)
	21,731 (డిసెంబర్ 29, 2023)
వృద్ధి	3,540 పాయింట్లు (19%)
జీవితకాల గరిష్టం 21,801 (డిసెంబర్ 28)	

రెండో స్థానంలో ద్రోణవల్లి హారిక



సమర్‌కండ్ (ఉజ్బెకిస్తాన్): ప్రపంచ బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్ మహిళల విభాగంలో తొమ్మిదో రౌండ్ తర్వాత భారత గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక ఏడు పాయింట్లతో మరో నలుగురితో కలిసి ఉమ్మడిగా రెండో స్థానంలో నిలిచింది. హారిక ఆరు గేముల్లో గెలిచి, రెండు గేమ్‌లను 'డ్రా' చేసుకొని... ఒక గేమ్‌లో ఓడిపోయింది. నేడు మిగతా ఎనిమిది రౌండ్ గేమ్‌లు జరుగుతాయి. భారత్‌కే చెందిన దివ్య దేశ్‌ముఖ్ 6 పాయింట్లతో 13వ ర్యాంక్‌లో, 6 పాయింట్లతో నూతక్కి ప్రియాంక 24వ ర్యాంక్‌లో... రక్షిత, కోనేరు హంపి 5.5 పాయింట్లతో వరుసగా 28వ, 31వ ర్యాంక్‌ల్లో ఉన్నారు. ఓపెన్ విభాగంలో 11 రౌండ్ల తర్వాత భారత గ్రాండ్‌మాస్టర్లు నిహాల్ సరీన్, ఇరిగేశి అర్జున్ 8.5 పాయింట్లతో మరో ఐదుగురితో కలిసి ఉమ్మడిగా అగ్రస్థానంలో ఉన్నారు. నేడు మిగతా పది రౌండ్లు జరుగుతాయి.

సరికొత్త శిఖరాలకు...

అంతర్జాతీయ వేదికపై మెరిసిన భారత క్రీడాకారులు

చిరస్మరణీయ విజయాలు అందించిన 2023

కాలక్రమంలో మరో ఏడాది గడిచిపోనుంది... ఒకప్పుడు ప్రాతినిధ్యానికి పరిమితమైన భారత క్రీడాకారులు... ఏడాదికెడాది తమ ప్రతిభకు పదును పెడుతున్నారు... అంతర్జాతీయ క్రీడా వేదికలపై అద్వితీయ ప్రదర్శనతో అదరగొడుతున్నారు. కొన్నేళ్లక్రితం వరకు అందని ద్రాక్షలా కనిపించిన స్వర్ణ, రజత, కాంస్య పతకాలను సగర్వంగా తమ మెడలో వేసుకుంటున్నారు. మొత్తానికి ఈ ఏడాదీ భారత క్రీడాకారులు విశ్వ క్రీడారంగంలో తమదైన ముద్ర వేసి సరికొత్త శిఖరాలకు చేరుకున్నారు. ఊహించని విజయాలతో భారత క్రీడా భవిష్యత్ బంగారంలా ఉంటుందని విశ్వాసం కల్పించారు. కేవలం విజయాలే కాకుండా ఈ సంవత్సరం కూడా వీడ్కోలు, వివాదాలు భారత క్రీడారంగంలో కనిపించాయి. రెండు దశాబ్దాలుగా భారత మహిళల టెన్నిస్‌కు ముఖచిత్రంగా ఉన్న సానియా మీర్జా ఆటకు వీడ్కోలు పలకడం... దేశానికి తమ పతకాలతో పేరు ప్రతిష్టలు తెచ్చిన మహిళా మల్లయోధులు తాము లైంగికంగా వేధింపులు ఎదుర్కొన్నామని వీధుల్లోకి రావడం... ఈ వివాదం ఇంకా కొనసాగుతుండటం విచారకరం.

-సాక్షి క్రీడా విభాగం



మన బల్లెం బంగారం...

భారత అథ్లెటిక్స్‌కు ఈ ఏడాది సూపర్‌గా గడిచింది. రెండేళ్ల క్రితం టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించి అందర్నీ అబ్బురపరిచిన జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా గత ఏడాది ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రజతం సాధించి ఆశ్చర్యపరిచాడు. ఈ ఏడాది మరింత ఎత్తుకు ఎదిగిన నీరజ్ ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఏకంగా స్వర్ణ పతకంతో మెరిశాడు. ఆగస్టులో బుడాపెస్ట్‌లో జరిగిన ఈ మెగా ఈవెంట్‌లో నీరజ్ జావెలిన్‌ను 88.17 మీటర్ల దూరం విసిరి విశ్వవిజేతగా అవతరించాడు. తద్వారా ఈ ఘనత సాధించిన తొలి భారతీయుడిగా కొత్త చరిత్ర సృష్టించాడు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మహిళా అథ్లెట్ జ్యోతి యెర్రాజీ కూడా ఈ సంవత్సరం మెరిపించింది. బ్యాంకాక్‌లో జరిగిన ఆసియా చాంపియన్‌షిప్‌లో జ్యోతి 100 మీటర్ల హర్డిల్స్‌లో స్వర్ణ పతకం సాధించింది.

తొలిసారి పతకాల 'సెంచరీ'



గత ఏడాదే జరగాల్సిన ఆసియా క్రీడలు కరోనా కారణంగా ఈ ఏడాదికి వాయిదా పడ్డాయి. చైనాలోని హాంగ్జౌ నగరం ఆతిథ్యమిచ్చిన ఈ క్రీడల్లో భారత బృందం తమ అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసింది. ఏకంగా 107 పతకాలతో ఈ క్రీడల చరిత్రలో తొలిసారి పతకాల సెంచరీ మైలురాయిని దాటింది. భారత క్రీడాకారులు 28 స్వర్ణాలు, 38 రజతాలు, 41 కాంస్యాలు గెల్చుకున్నారు. ముఖ్యంగా ఆర్చరీ ఈవెంట్‌లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ మూడు స్వర్ణ పతకాలతో మెరిసింది. పీటీ ఉష తర్వాత ఒకే ఆసియా క్రీడల్లో మూడు లేదా అంతకంటే ఎక్కువ బంగారు పతకాలు గెలిచిన భారత క్రీడాకారిణిగా జ్యోతి సురేఖ గుర్తింపు పొందింది.



మన 'రాకెట్' నంబర్‌వన్

బ్యాడ్మింటన్‌లో ఈ ఏడాది పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి అదరగొట్టింది. ఆసియా చాంపియన్‌షిప్‌లో, ఆసియా క్రీడల్లో తొలిసారి డబుల్స్‌లో స్వర్ణ పతకాలు అందించిన ఈ ద్వయం స్విస్ ఓపెన్, ఇండియా ఓపెన్, ఇండోనేసియా ఓపెన్ టోర్నీల్లోనూ టైటిల్స్ సాధించింది. ఈ క్రమంలో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో తొలిసారి నంబర్‌వన్ స్థానానికి ఎగబాకింది. పురుషుల సింగిల్స్‌లో ప్రణయ్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్యం గెల్చుకున్నాడు. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధుకు ఆశించిన ఫలితాలు లభించలేదు. ఆమె కేవలం ఒక టోర్నీలో (స్పెయిన్ మాస్టర్స్) మాత్రమే ఫైనల్ చేరి రన్నరప్‌గా నిలిచింది.

నిఖత్ పసిడి పంచ్...



గత ఏడాది తాను సాధించిన ప్రపంచ టైటిల్ గాలివాటం ఏమీ కాదని భారత స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ ఈ సంవత్సరం నిరూపించింది. న్యూఢిల్లీ వేదికగా ఈ ఏడాది మార్చిలో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో నిఖత్ మళ్లీ తన పంచ్ పవర్ చాటుకుంది. 50 కేజీల విభాగంలో నిఖత్ స్వర్ణం సాధించి వరుసగా రెండో ఏడాది ప్రపంచ చాంపియన్‌గా నిలిచింది. ఈ మెగా ఈవెంట్‌లో భారత్ నాలుగు స్వర్ణాలు సాధించి ఓవరాల్ చాంపియన్‌గా అవతరించడం విశేషం. ఆసియా క్రీడల్లోనూ నిఖత్ రాణించి కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది.

సానియా అల్విదా...



రెండు దశాబ్దాలుగా భారత టెన్నిస్‌కు ముఖచిత్రంగా నిలిచిన సానియా మీర్జా ఈ ఏడాది తన కెరీర్‌కు ముగింపు పలికింది. ప్రొఫెషనల్ ప్లేయర్ హోదాలో ఫిబ్రవరిలో దుబాయ్ ఓపెన్‌లో ఆమె చివరిసారిగా బరిలోకి దిగింది. మార్చి 5వ తేదీన సానియా కోసం హైదరాబాద్‌లో ప్రత్యేకంగా వీడ్కోలు మ్యాచ్ ఏర్పాటు చేశారు. గతంలో డబుల్స్‌లో తన భాగస్వాములుగా ఉన్న ఇవాన్ డోడిగ్, కారా బ్లాక్, బెథానీ మాటెక్, రోహన్ బోపన్నలతో కలిసి సానియా ఈ వీడ్కోలు మ్యాచ్ ఆడింది.

మాయని మచ్చలా...



ఈ ఏడాది జనవరి 18న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద భారత మహిళా రెజ్లర్లు ఆందోళనకు దిగారు. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ సింగ్ మహిళా రెజ్లర్లను లైంగిక వేధింపులకు గురి చేశారని ఆరోపిస్తూ ఆసియా చాంపియన్ వినేశ్ ఫొగాట్, రియో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత సాక్షి మలిక్, బజరంగ్ పూనియా, సంగీత ఫొగాట్ తదితరులు ఆందోళన చేపట్టారు. అనంతరం క్రీడా శాఖ కమిటీ ఏర్పాటు చేసి రెజ్లర్ల ఆరోపణలపై విచారణ చేపట్టారు. బ్రిజ్‌భూషణ్ సమాఖ్య అధ్యక్ష పదవి నుంచి వైదొలిగినా ఆయనపై మాత్రం ఎలాంటి క్రమశిక్షణ చర్యలు తీసుకోలేదు. తాజాగా రెజ్లింగ్ సమాఖ్య కొత్త అధ్యక్షుడిగా బ్రిజ్‌భూషణ్ సింగ్ విధేయుడు సంజయ్ సింగ్ ఎన్నిక కావడంతో రెజ్లర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. సాక్షి మలిక్ తాను రెజ్లింగ్ నుంచి రిటైర్ అవుతున్నట్లు ప్రకటించింది. బజరంగ్ పూనియా, వినేశ్ ఫొగాట్ తమ 'ఖేల్ రత్న, పద్మశ్రీ, అర్జున' పురస్కారాలను వెనక్కి ఇస్తున్నట్లు ప్రకటించారు.



కమిన్స్

ఆసీస్‌దే సిరీస్

'బాక్సింగ్ డే' టెస్టులో పాక్ ఓటమి

మెల్‌బోర్న్: 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ప్యాట్ కమిన్స్ (5/49), మిచెల్ స్టార్క్ (4/55) హడలెత్తించడంతో... ఆస్ట్రేలియాతో జరిగిన 'బాక్సింగ్ డే' టెస్టులో పాకిస్తాన్ 79 పరుగుల తేడాతో ఓడిపోయింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో వరుసగా రెండో విజయంతో ఆస్ట్రేలియా సిరీస్‌ను 2–0తో సొంతం చేసుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 187/6తో నాలుగో రోజు ఆట కొనసాగించిన ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 262 పరుగుల వద్ద ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 54 పరుగులు కలుపుకొని పాక్ ముందు ఆసీస్ 317 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించగా... పాక్ రెండో ఇన్నింగ్స్‌లో 237 పరుగులకు ఆలౌటైంది. ఒకదశలో పాక్ 219/5తో పటిష్ట స్థితిలో నిలిచింది. విజయానికి 98 పరుగుల దూరంలో ఉండగా... అదే స్కోరు వద్ద రిజ్వాన్ (35; 3 ఫోర్లు, 1 సిక్స్)ను కమిన్స్ అవుట్ చేయడంతో సీన్ మారిపోయింది. అంతలోనే 18 పరుగుల వ్యవధిలో ఆఖరి 5 వికెట్లను కోల్పోయిన పాకిస్తాన్ ఓటమి పాలైంది. పెర్త్‌లో జరిగిన తొలి టెస్టులో ఆసీస్ 360 పరుగుల తేడాతో గెలిచింది. చివరిదైన మూడో టెస్ట్ జనవరి 3 నుంచి సిడ్నీలో జరుగుతుంది.

వీడ్కోలు టెస్టులో కెప్టెన్‌గా ఎల్గర్



కేప్‌టౌన్: అంతర్జాతీయ టెస్టు క్రికెట్‌కు దక్షిణాఫ్రికా ఓపెనర్ డీన్ ఎల్గర్ సారథిగా వీడ్కోలు పలకనున్నాడు. భారత్‌తో సిరీస్‌కు ముందే మాజీ కెప్టెన్ ఎల్గర్ రిటైర్మెంట్ నిర్ణయం తీసుకున్నాడు. తొలి టెస్టులో అతని భారీ సెంచరీతోనే సఫారీ ఇన్నింగ్స్ 32 పరుగుల తేడాతో భారత్‌పై గెలిచింది. అయితే ఈ మ్యాచ్ మొదటి రోజునే గాయపడ్డ రెగ్యులర్ కెప్టెన్ తెంబా బవుమా జనవరి 3 నుంచి జరిగే రెండో టెస్టుకు దూరమయ్యాడు. ఈ నేపథ్యంలో ఎల్గర్‌ను దక్షిణాఫ్రికా బోర్డు అతని కెరీర్‌లో ఆఖరి మ్యాచ్ కోసం కెప్టెన్‌గా బరిలోకి దింపుతోంది.

ఒత్తిడిలో హర్మన్ బృందం

నేడు ఆస్ట్రేలియాతో రెండో వన్డే

ముంబై: వన్డే సిరీస్‌లో నిలవాలంటే తప్పక గెలవాల్సిన సమరానికి భారత మహిళల జట్టు సిద్ధమైంది. వాంఖెడే మైదానంలో శనివారం భారత్, ఆస్ట్రేలియా మహిళల జట్ల మధ్య రెండో వన్డే జరుగుతుంది. తొలి మ్యాచ్‌ను గెలిచిన ఆసీస్ 1–0తో ఆధిక్యంలో ఉండగా... తీవ్రమైన ఒత్తిడిలో ఉన్న హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో ఉంది. నిజానికి ఇదే వేదికపై జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ భారీస్కోరే చేసింది. కానీ బౌలింగ్ వైఫల్యంతో మూల్యం చెల్లించుకుంది. ఇప్పుడు లోపాలపై దృష్టి పెట్టిన టీమ్ మేనేజ్‌మెంట్ వీటిని అధిగమించి ఆస్ట్రేలియాను నిలువరించాలనే లక్ష్యంతో ఉంది. మధ్యాహ్నం 1.30 నుంచి జరిగే మ్యాచ్ 'స్పోర్ట్స్–18'లో ప్రత్యక్ష ప్రసారం అవుతుంది.

పాయింట్ల పట్టిక (PKL)

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
పుణేరి పల్టన్	7	6	1	0	31
జైపూర్ పింక్ పాంథర్స్	8	4	2	2	28
గుజరాత్ జెయింట్స్	8	5	3	0	28
హరియాణా స్టీలర్స్	8	5	3	0	26
పట్నా పైరేట్స్	8	4	4	0	22
బెంగాల్ వారియర్స్	8	3	3	2	22
యు ముంబా	6	4	2	0	21
యూపీ యోధాస్	8	3	4	1	20
దబంగ్ ఢిల్లీ	7	3	3	1	20
బెంగళూరు బుల్స్	9	3	6	0	20
తమిళ్ తలైవాస్	8	2	6	0	12
తెలుగు టైటాన్స్	7	1	6	0	8

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

పట్నా పైరేట్స్‌కు నాలుగో విజయం

నోయిడా: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో మూడుసార్లు చాంపియన్ పట్నా పైరేట్స్ నాలుగో విజయం నమోదు చేసింది. హరియాణా స్టీలర్స్‌తో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 46–33తో గెలిచింది. పట్నా తరఫున మంజీత్ అత్యధికంగా 13 పాయింట్లు స్కోరు చేశాడు. సచిన్ (8), సుధాకర్ (5), కృషన్ (5) కూడా రాణించారు. హరియాణా తరఫున వినయ్ 12 పాయింట్లు సాధించాడు. మరో మ్యాచ్‌లో యూపీ యోధాస్ 34–33తో బెంగళూరు బుల్స్ జట్టును ఓడించింది. యూపీ కెప్టెన్ ప్రదీప్ నర్వాల్ అత్యధికంగా 10 పాయింట్లు స్కోరు చేశాడు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో తెలుగు టైటాన్స్‌తో యు ముంబా; యూపీ యోధాస్‌తో దబంగ్ ఢిల్లీ తలపడతాయి.







Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.